

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం | 3-3-2018 | పేజీలు: 16 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 232 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 2.21 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తర రా. 8.55 తదుపరి హస్త; వర్జ్యం: తె.5.05 మొదలు; దుర్ముహూర్తం: ఉ.6.37-7.23; అమృతఘడియలు: మ.2.05-3.37; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.19 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai





10 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కాల్పుల మోత

- నక్సల్స్ కాల్పుల్లో గ్రేహౌండ్స్ జవాను మృతి
- మృతుల్లో కేకేడబ్ల్యూ కార్యదర్శి బడే చొక్కారావు, ఆదిలాబాద్ జిల్లా బాధ్యుడు రాజిరెడ్డి
- మూడు మృతదేహాలే హెలికాప్టర్లో భద్రాచలానికి
- మిగిలిన వారి వివరాలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- తప్పించుకున్న హరిభూషణ్, సమ్మక్క, ఆజాద్
- ప్లీనరీ సమాచారంతో పోలీసుల దాడి
- ఆపరేషన్‌లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బలగాలు

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు! దట్టమైన అటవీ ప్రాంతం! ఉదయం ఆరు గంటలు! అప్పుడే తెలతెల వారుతోంది! ప్రశాంతంగా ఉన్న ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కాల్పుల మోత! పోలీసులు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురు కాల్పులు! తుపాకుల మోతలతో దండకారణ్యం దద్దరిల్లింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ కాల్పుల్లో పది మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. పోలీసు వర్గాల వివరాల ప్రకారం మృతుల్లో కేకే డబ్ల్యూ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఇన్‌చార్జి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి ఉన్నారు. ఎదురు కాల్పుల్లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ కూడా మరణించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జయశంకర్ భూపాలపల్లిజిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం డోలె, చర్ల మండలం చిన్న ఉట్లపల్లి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పూజారి కాంకర్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసు వర్గాల

మిగతా 16వ పేజీలో...



మావోయిస్టుల మృతదేహాలను హెలికాప్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

భద్రాచలం ఆస్పత్రి మార్చురీలో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు

ఫోరెన్సిక్ వైద్యుడి పర్యవేక్షణలో

పోస్టుమార్టం చేయించండి

మృతదేహాలను బంధువులకు అప్పగించండి

టి-సర్కారుకు ఉమ్మడి హైకోర్టు ఆదేశం 16

పట్టుకొని చంపారు: వరవరరావు

ఫాసిస్ట్ పాలనకు పరాకాష్ఠ: టీపీఎఫ్

సుప్రీం జడ్జితో విచారణ జరపాలి: న్యూడెమోక్రసీ



ఖమ్మంలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్లు; లబ్ధిదారులకు ట్రాక్టర్ తాళాలు అందజేస్తున్న మంత్రులు తుమ్మల, పోచారం

800 ట్రాక్టర్ల పంపిణీ

- తెలంగాణ దేశానికే ఆదర్శం
- వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట
- రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- మంత్రులు పోచారం, తుమ్మల

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-ఖమ్మం)

దేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలన ఆదర్శంగా నిలుస్తోందని, ఇక్కడ అమలయ్యే వ్యవసాయ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో

మిగతా 6వ పేజీలో...





టేకాఫ్ కాని కల

- పేద బ్రాహ్మణుల విదేశీ చదువులకు నిధులు రావు
- మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందవు
- అప్పుల ఊబిలో పడి తల్లిదండ్రులు విలవిల 6



నెత్తుటి హోలీ

- టైరు పేలి పల్టీకొట్టిన కారు
- ఎదురుగా వస్తున్న బస్సుతో ఢీ
- కారులోని ఐదుగురు మృతి 2













కామ విజయానికి.. కాల నిగ్రహానికి..



పరంజ్యోతి

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ

మహాకవి కాళిదాసు 'రఘువంశం' అనే కావ్యంలో రాసిన మంగళ శ్లోకమది. ఈ లోకానికి మాతాపితరులు పార్వతీపరమేశ్వరులని ఆ మహాకవి అన్నాడు. వాక్కు, అర్థము ఎలా ఒకదానితో మరొకటి వదలక చేరి ఉన్నవో.. అట్లే పార్వతీపరమేశ్వరులు ఒకరినొకరు వదలక జగన్మాతా, జగత్పితలై ఉన్నారని, వారికి వందనాలని కాళిదాస మహాకవి మంగళాచరణం చేశాడు. ఇదే అర్ధనారీశ్వర తత్వం. మనకందరికీ చావుపుట్టుక లున్నాయని తెలుసు. పుట్టుకకు కారణం కామం. చావుకు కారణం కాలుడు. కామకారణంగా కల్గిన వస్తువు కాలగ్రస్తమై నశిస్తోంది. ఈ రెంటినీ జయించాలంటే పరమేశ్వరుని వద్దకు వెళ్లాలి. మన్మథుని దృష్టిమాత్రమున దగ్ధమొనర్చినవానికి, కాలుని (యముడిని) కాలదన్నిన కాలకాలునికి ఉత్పత్తి వినాశనాలు లేవు. ఆయన ప్రసాదం ఉంటే.. మనకూ పుట్టుట, గిట్టుట ఉండదు. మరి పరమేశ్వరుడొక్కడు చాలడా? అంబిక కూడా కావాలా? అంటే.. కావాలి. ఈశ్వరుడు కామనిగ్రహం చేసింది లలాటనేత్రంతో. అర్ధనారీశ్వర ప్రకృతులగు వీరికి మూడవకన్ను ఉమ్మడి. అందులో ఆయనకు సగపాలు. ఆ తల్లికి సగపాలు. కాలుని తన్నినది వామపాదముతో. ఆ పాదము అంబికది. అందుచే కామవిజయానికి, కాలనిగ్రహానికి స్వామి దయతోపాటు అమ్మ అనుగ్రహం సైతం కావాలి. మనం జన్మ వద్దనుకొంటే.. ఆ దంపతులనిరువురినీ చేర్చి ఉపాసన చేయాలి. వారి అనుగ్రహముంటే చాలు మనకు చావుపుట్టుకల బాధ ఉండదు.

-చంద్రశేఖరేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామి
('జగద్గురు బోధలు' నుంచి)



హోంగార్డు బయన్న

ఎస్ఐ సెలవివ్వలేదని హోంగార్డు ఆత్మహత్యాయత్నం

- ఇంటిపనులు చేయిస్తున్నాడని బాధితుడి ఆవేదన
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఘటన

నాగర్‌కర్నూల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తనతో గొడ్డు చాకిరి (ఆర్డర్లీ) చేయించుకోవడమే కాకుండా మూడు నెలలుగా సెలవివ్వడం లేదంటూ హోంగార్డు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సంచలనం రేకెత్తించింది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ చెంచుగూడెంకు చెందిన బయన్న.. కోడేర్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పురుగుల మందు డబ్బాతో ప్రత్యక్షమైన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ప్రజలు అడ్డుకున్నారు. కోడేర్ ఎస్ఐగా పని చేస్తున్న షేక్ షఫీ కూరగాయలు తెప్పించుకోవడం సహా ఇంటి పనులన్నీ చేయాలని వేధిస్తున్నాడని ఆరోపించాడు. 3 నెలలుగా కుటుంబ సభ్యులను చూసి రావడానికి కూడా సెలవు మంజూరు చేయడంలేదని, దీంతో మానసికంగా ఆవేదన చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పాడు. కాగా, హోంగార్డు బయన్నకు సెలవు మంజూరు చేయకుండా తాను వేధిస్తున్నట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కోడేర్ ఎస్ఐ షేక్ షఫీ వివరణ ఇచ్చారు. రెండున్నర నెలలుగా అతను జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హోంగార్డుతో తాను ఇంటి పనులు చేయిస్తున్నట్లు చెప్పడంలో కూడా నిజం లేదన్నారు. మద్యం సేవించి విధులకు హాజరుకావడం, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నట్లు హోంగార్డు బయన్నపై అనేక ఆరోపణలున్నాయని ఎస్ఐ చెప్పారు.





భయంకర ద్వీపాల్లో.. పెంగ్విన్ల సమూహం

అంటార్కిటికాలో 15 లక్షల పక్షుల గుర్తింపు

డ్రోన్‌ల ద్వారా తీసిన ఈ చిత్రం పశ్చిమ అంటార్కిటికాలోని భయంకర ద్వీపాల (డేంజర్ ఐలాండ్స్)కు సంబంధించింది. 2డీ, 3డీ డ్రోన్ కెమెరాలు ఈ ప్రాంతంలో భారీ ఎత్తున పెంగ్విన్ల సమూహాన్ని గుర్తించాయి. ఇది ఇప్పటి వరకు ప్రపంచం చూడని వింత అని అమెరికాకు చెందిన శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. డ్రోన్, శాటిలైట్ కెమెరాలను వినియోగించి ప్రత్యేక అల్గారిథమ్ ద్వారా వీటి సంఖ్యను 15 లక్షలుగా తేల్చారు. శాటిలైట్ ద్వారా తీసిన చిత్రాల్లో గుట్టలుగా పెంగ్విన్ల పెంట నిల్వను గుర్తించడంతో.. వాస్తవ స్థితిని తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు డ్రోన్ కెమెరాలను పంపించారు. అంటార్కిటికా మొత్తంలో రెండు కోట్ల వరకు పెంగ్విన్ల జనాభా ఉండగా.. తాజాగా గుర్తించిన పెంగ్విన్ల కాలనీ ప్రపంచంలోకెల్లా అతి పెద్దది అని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ద్వీపాలు తూర్పు అంటార్కిటికాకు 160 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, అక్కడి ప్రతికూల పరిస్థితుల కారణంగా మానవమాత్రులెవరూ ఇప్పటి వరకు ఆ ప్రాంతాన్ని సందర్శించలేదని వివరించారు.

తెలంగాణకు 24, ఏపీకి 9 టీఎంసీలు

- ఉన్న నీటిని పంచిన కృష్ణా బోర్డు
- 28 లోపు పంటలకు వాడుకోవాలి
- తాగునీటి కోసం కనీస మట్టం దిగాల్సిందే
- బోర్డు త్రి సభ్య కమిటీ నిర్ణయాలు

హైదరాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి 24 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 9 టీఎంసీల నీటిని కృష్ణా బోర్డు కేటాయించింది. ఈ నీటిని పంటల అవసరాల కోసం మార్చి 28వ తేదీలోపు ఇరు రాష్ట్రాలు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అలాగే వచ్చే వేసవి తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోని కనీస నీటి నిల్వ మట్టానికి దిగువన ఉన్న నీటిని ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం జలసౌధలోని బోర్డు కార్యాలయంలో జరిగిన త్రి సభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావుతో పాటు ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి రిజర్వాయర్లయిన శ్రీశైలం (834 అడుగులు), నాగార్జునసాగర్ (510 అడుగులు)లో కనీస నీటి నిల్వ మట్టం (ఎండీడీఎల్)కు ఎగువన 33 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. అయితే ఈ ఏడాది ఇరు రాష్ట్రాలకు కేటాయించిన నీరు, ఉపయోగించుకున్న నీటిని అంచనా వేసిన బోర్డు, ప్రస్తుతం ఉన్న 33 టీఎంసీల నీటిలో తెలంగాణకు 24 టీఎంసీలు ఏపికి 9 టీఎంసీలు కేటాయించారు. నాగార్జున సాగర్ దగ్గర కృష్ణా జలాల వివాదం నేపథ్యంలో బోర్డు త్రి సభ్య కమిటీ ప్రత్యేకంగా సమావేశమై ఈ నిర్ణయాన్ని తీసుకుంది. మార్చి 20వ తేదీ వరకు సాగర్ నీటి మట్టం 520 అడుగులు ఉండేలా రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. మార్చి చివరికి నాటికి సాగర్‌లో 515 అడుగుల నీటిమట్టం ఉండేలా ఒప్పందం కుదిరింది. ఇందుకుగాను శ్రీశైలం నుంచి కృష్ణ జలాలను సాగర్‌కు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ఒప్పుకుంది. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు సంబంధించి మళ్లీ ఉత్తర్వులు జారీచేయాలని కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకున్నది. సాగర్ కనీస నీటి మట్టం తగ్గిపోతే గత ఏడాది తెలంగాణ ప్రజల తాగునీటి అవసరాలకు నీళ్లందించలేక ఇబ్బందులు పడిన విషయాన్ని తెలంగాణ గుర్తు చేసింది. ఈ సారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా శ్రీశైలం నీరు విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఆగస్టు వరకు తెలంగాణకు 46 టీఎంసీల నీటి అవసరం ఉన్నట్టు ఈ సమావేశంలో తెలంగాణ అధికారులు బోర్డు దృష్టికి తీసుకువచ్చారు. కాగా మార్చి నెలాఖరు నాటికి పంటల సాగు కోసం ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఇరు రాష్ట్రాలు పూర్తిగా ఉపయోగించుకుంటే...వేసవిలో తాగు నీటి అవసరాల కోసం గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా ఎండీడీఎల్ దిగువలోని నీటిని తోడాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ఎండీడీఎల్‌కు ఎగువన ఉన్న నీటిని పూర్తిగా పంపిణీ చేశారు. ఈ నెలాఖరులో ఈ నీరు ఖాళీ అయ్యే పరిస్థితి ఉంది. దాంతో తాగునీటి కోసం శ్రీశైలం, సాగర్‌లోని అడుగు నీటిపైన ఆధార పడాల్సి ఉంటుంది.



శోభయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి



విధుశేఖర భారతీస్వామి

పీఠాధిపతుల రాకతో వనపర్తి సుభిక్షం కావాలి

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఆకాంక్ష
- పురవీధుల్లో విధుశేఖర భారతీస్వామి శోభాయాత్ర

వనపర్తి సాంస్కృతికం, మార్చి 2: పీఠాధిపతుల రాకతో వనపర్తి జిల్లా సుభిక్షం కావాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఆకాంక్షించారు. శృంగేరి శ్రీ శారదా పీఠాధిపతులు శుక్రవారం గద్వాల జిల్లా నుంచి వనపర్తి జిల్లా కేంద్రంలోకి అడుగుపెట్టారు. విధుశేఖర భారతీస్వామికి నిరంజన్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు రామాలయం దగ్గర స్వాగతం పలికారు. ఆ తర్వాత కొత్త బస్టాండ్, రాజీవ్‌చౌరస్తా మీదుగా పురవీధుల్లో శోభాయాత్ర సాగింది. యాత్రలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ శివారులోని శ్రీలక్ష్మి కృష్ణ గార్డెన్‌లో ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలను నిరంజన్‌రెడ్డి దంపతులు అందించారు. రాత్రి 8 గంటల సమయంలో జగద్గురువులు శారదా చంద్రమౌళీశ్వరస్వామి పూజ, అనుగ్రహ భాషణం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ డైరెక్టర్ గోపాలశర్మ, రఘునాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకర్ష!

- సామాజిక భద్రతకు కేంద్రం కొత్త పథకం
- 50 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులే లక్ష్యం

న్యూఢిల్లీ, మార్చి 2: దేశంలోని కార్మికులందరినీ ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోందా!? వారికి సామాజిక భద్రత పథకాన్ని అమలు చేయనుందా!? ఈ మేరకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసిందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కేంద్ర ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు. ప్రభుత్వం జాతీయ సమగ్ర సామాజిక భద్రత పథకాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా దేశవ్యాప్తంగా 50 కోట్ల మంది కార్మికులకు, ఉద్యోగులకు పదవీ విరమణ, ఆరోగ్య, వృద్ధాప్య, వికలాంగ, నిరుద్యోగ, ప్రసూతి ప్రయోజనాలను అందించాలని నిర్ణయించింది. రాబోయే పదేళ్లలో మూడు దశల్లో, నాలుగు విడతలుగా దీనిని అమలు చేస్తారు. ఆ తర్వాత ఈ పథకాన్ని అందరికీ అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. మిగిలిన కార్మికులు మాత్రం తమ వాటాగా కొంత మొత్తాన్ని భరించాల్సి ఉంటుంది. మొదటి దశలో ఆరోగ్య భద్రత, పదవీ విరమణ భద్రత సహా కనీస ప్రయోజనాలను అందించాలని కేంద్రం భావిస్తోంది. రెండో దశలో వాటికి నిరుద్యోగ భృతి ప్రయోజనాలను కలుపుతారు. మూడో దశలో మొత్తం అన్ని సంక్షేమ పథకాలనూ జత చేస్తారు. ఈ పథకం మొదటి దశకే రూ.18,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందుకు అధిక శాతం నిధులను బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్ సెస్, జాతీయ స్థిరీకరణ నిధి ద్వారా వివిధ పథకాలకు కేటాయించిన నిధులను ఉపయోగిస్తారు. జాతీయ సామాజిక భద్రత కౌన్సిల్ ద్వారా ఈ పథకాన్ని పర్యవేక్షించడం, నియంత్రించడం చేస్తారు. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించే ఈ కౌన్సిల్‌లో కేంద్ర ఆర్థిక, ఆరోగ్య శాఖల మంత్రులతోపాటు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కార్మికులు, యజమానులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ పథకం అమలుకు సంబంధించి ఏప్రిల్ 30లోపు అభిప్రాయాలు పంపాలంటూ భాగస్వాములకు కేంద్ర కార్మిక శాఖ నోట్ పంపింది. తుది ముసాయిదాను రూపొందించిన తర్వాత కేబినెట్ ఆమోదం తీసుకుని దీనిని పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భావిస్తోంది. నిజానికి, దేశంలో 50 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు ఉంటారని అంచనా. వీరిలో దాదాపు 10 శాతానికిపైగా ఈపీఎఫ్‌ఓ, ఈఎస్ఐసీ పరిధిలోకి వస్తారు. మిగిలిన వారిలో అత్యధికులు అసంఘటిత రంగంలో ఉన్నారు.



నెత్తుటి హోలీ

- టైరు పేలి పల్టీకొట్టిన కారు.. ఎదురుగా వస్తున్న బస్సును ఢీ
- కారులోని ఐదుగురు మృతి.. కంది ఐఐటీ సమీపంలో ఘోరం

కంది, మార్చి 2: వాళ్లంతా ఒకే ఊరివాళ్లు.. పైగా స్నేహితులు! అంతా కలిసి హోలీ సంబరాలను జరుపుకొన్నారు! ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కారులో తిరిగివస్తున్నారు! అంతలోనే ఊహించని ఘోరం జరిగింది! టైరు పగిలిపోవడంతో కారు అదుపు తప్పింది. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారంతా మృతిచెందారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఐఐటీ వద్ద ఈ ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మహేశ్వర్ గుప్తా (25), శివరాజు అలియాస్ నాగరాజు (24), నరేందర్ (27) ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. మిగతా ఇద్దరు.. వెంకటరెడ్డి (22), వెంకట్‌రాం రెడ్డి (28) సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించారు. మృతులంతా సంగారెడ్డి పట్టణానికి చెందినవారే! పటాన్‌చెరు మండలం రుద్రారంలోని పిచ్కారి ఫంక్షన్ హాల్లో హోలీ వేడుకలు ముగించుకుని కారులో సంగారెడ్డికి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదాన్ని తప్పించేందుకు బస్సు డ్రైవర్ బస్సును వెంటనే రోడ్డు కిందకు దించినా అప్పటికే ఆలస్యం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్ లింగేశ్వర్, ప్రయాణికులు అనిల్‌కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయలయ్యాయి.

డీఅడిక్షన్‌సెంటర్లో మంటలు.. 30మంది మృతి



అజర్‌బైజాన్ రాజధాని బకులోని డీఅడిక్షన్ సెంటర్‌లో శుక్రవారం మంటలు చెలరేగి 25 మంది ఆహుతయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ కేంద్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రెస్క్యూ బృందాలు 200 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

లోకం తీరు



మీ దయవల్ల వాళ్ల వ్యాపారం పెరిగిందట సార్.. కృతజ్ఞతలు తెలపడానికి వచ్చారు!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రామగుండం	38.8	17.2
ఆదిలాబాద్	38.5	15.4
ఖమ్మం	38.0	19.0
వరంగల్	37.0	19.5
హైదరాబాద్	36.3	18.2

కొనసాగుతున్న ఎండ మంట

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో శుక్రవారం సాధారణం కంటే అధిక పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు చోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి తక్కువగా నమోదయ్యాయి. భద్రాచలం, రామగుండంలో 38 డిగ్రీలు, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ 37.5 డిగ్రీలు, మెదక్ 37.3 డిగ్రీలు, హన్మకొండ 36.5 డిగ్రీలు, ఖమ్మంలో 36.4 డిగ్రీల మేరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండలో 2 డిగ్రీలు, నిజామాబాద్‌లో ఒక డిగ్రీ మేరకు సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నేనున్నా.. చింతించకు

నేనున్నాను.. చింతించకు. అన్నీ నేను చూసుకుంటాను. నీకు ఈ కేసు నుంచి సాంత్వన కలుగుతుంది. లాయర్లతోనూ మాట్లాడుతున్నాను. ఎలాంటి ఇబ్బంది ఉండదు. న్యాయం మనవైపే ఉంది.

- కార్తిని ఓదార్చిన చిదంబరం

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.98	పాత ధర 67.88
కొత్త ధర రూ.76.24	కొత్త ధర 68.11
పెరిగింది : 26 పైసలు	పెరిగింది : 23 పైసలు



పిల్లల్లో అలర్జీకి చేప నూనెతో చెక్

లండన్, మార్చి 2: గర్భిణులు చేప నూనె, ప్రోబయోటిక్స్ తీసుకుంటే పుట్టబోయే పిల్లలకు అలర్జీ రాకుండా ఉంటుందని పరిశోధనలో వెల్లడైంది. గుడ్లు తినడం వల్ల కొంతమంది పిల్లలకు చర్మంపై దద్దుర్లు వస్తాయి. గర్భం దాల్చిన 20 వారాల నుంచి పిల్లలు పుట్టిన 2, 3 నెలల వరకు చేప నూనె సప్లిమెంట్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చని పరిశోధకులు తేల్చారు. పిల్లలు పుట్టిన మొదటి ఆరు నెలల్లో ప్రోబయోటిక్స్ తీసుకోవడం వల్ల తామర రాకుండా ఉంటుందని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ పరిశోధకులు చెప్పారు.

మధుమేహ మందులతో స్థూలకాయం!

లండన్, మార్చి 2: గర్భిణిగా ఉన్నప్పుడు మధుమేహానికి సంబంధించిన మందులు ఎక్కువగా వాడితే పుట్టబోయే పిల్లలు స్థూలకాయం బారిన పడే అవకాశం ఉందని పరిశోధనలో తేలింది. గర్భిణులు మెట్‌ఫార్మిన్‌ను తీసుకుంటే అది జరాయువు నుంచి పిండానికి చేరే అవకాశం ఉందని పరిశోధకులు చెప్పారు. దీని వల్ల పుట్టబోయే పిల్లల బరువుపై ప్రభావం పడకపోయినా.. నాలుగేళ్ల తర్వాత స్థూలకాయం వచ్చే అవకాశం ఉందని నార్వేలోని నార్వేజియన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు తెలిపారు.

నొప్పి నివారణితో మధుమేహానికి ఉపశమనం!

బీజింగ్, మార్చి 2: నొప్పి నివారణి మందులు రక్తంలోని గ్లూకోజ్‌ను తగ్గిస్తాయని పరిశోధనలో వెల్లడైంది. వీటి వల్ల టైప్-2 మధుమేహంతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుందని పరిశోధకులు తెలిపారు. ముఖ్యంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడేవారు ఉపయోగించే లెఫ్లునమైడ్ మందులు రక్తంలోని గ్లూకోజ్‌ను తగ్గిస్తాయని చెప్పారు. దీంతో మధుమేహం, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు ఒకే మందుతో చెక్ పెట్టొచ్చని చైనాలోని యాంగ్జూ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు.



ధర్మపురిలో ఘనంగా డోలోత్సవం

జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలతో ఉత్సవ మూర్తులను బ్రహ్మ పుష్కరిణికి తీసుకొచ్చారు. అనంతరం హంస వాహనంపైన స్వామివారలను కూర్చోబెట్టి, నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. బ్రహ్మ పుష్కరిణి విద్యుద్దీపాలతో శోభిల్లింది. రాత్రివరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి, సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పాల్గొన్నారు. **- ధర్మపురి**

పది రూపాయల నాణేలతో పరేషానీ

బ్యాంకర్లే తీసుకోవడం లేదని పోలీసులకు ఫిర్యాదు



పోస్టాఫీసులో పింఛన్‌దారులకు రూ. 10 నాణేల పంపిణీ

నర్వ, మార్చి 2 : పది రూపాయల నాణేలను బ్యాంకర్లు తీసుకోవడం లేదంటూ మహబూబ్‌నగర్ జిల్లా నర్వలో శుక్రవారం వ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. ఆసరా పింఛన్‌దారులకు మండలంలోని గ్రామ గ్రామాన ఒక్కొక్కరికి రూ.500 విలువైన నాణేలను పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేశారు. ఆ నాణేలను హోటళ్లు, దుకాణాల్లో ఇస్తే తీసుకోవడం లేదు. వాటిని తాము బ్యాంకుల్లో జమ చేయడానికి వెళితే తీసుకోవడంలేదని వ్యాపారులు నర్వ ఎస్‌ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వ్యాపారుల సమక్షంలోనే ఏపీజీవీ బ్యాంకు మేనేజర్ సంపత్ కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. అయితే ఇప్పటికే బ్యాంకులో లక్షన్నర రూపాయల విలువైన పది రూపాయల నాణాలు ఉన్నాయని మేనేజర్ చెప్పారు.

ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్న కేసీఆర్

» మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి



మంథని, మార్చి 2: తెలంగాణలో ప్రాజెక్టు రీ డిజైనింగ్ పేరిట సీఎం కేసీఆర్ ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో శుక్రవారం మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 81వ జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను తీసుకు వచ్చే దమ్ము, ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌పై కేసీఆర్ బహిరంగ చర్చకు ముందుకు రావడం లేదన్నారు. విమర్శలు ప్రజలు హర్షించేలా ఉండాలి తప్ప అసహ్యించుకునేలా ఉండవద్దన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మాట్లాడే పద్ధతి నేర్చుకోవాలన్నారు. ప్రధాన మంత్రి హోదాలో ఉన్న నరేంద్ర మోదీపై కేసీఆర్ చేసిన విమర్శలను తప్పు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు కూరపాటి వెంకట నారాయణ, కుడిమేడ చొక్కయ్యలకు పురస్కారాలను ప్రదానం చేశారు.

డేకేర్ సర్జరీలతో రోగులకు మేలు

» డాక్టర్ బియాన్ జాక్సన్

హన్మకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన సేవలతో పాటు ఆర్థిక భారం, సమయం తగ్గించేందుకు డే కేర్ సర్జరీలు ఉపయోగపడతాయని అంబులేటరీ అంతర్జాతీయ సర్జరీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బియాన్ జాక్సన్ అన్నారు. వరంగల్ కేఎంసీలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డే కేర్ తరహా సర్జరీలు మెట్రో నగరాలకే పరిమితమయ్యాయి. ఈ తరహా సర్జరీలపై అవగాహన కల్పించేందుకు శనివారం ఎన్‌ఆర్‌ఐ ఆడిటోరియంలో అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ విభాగాల వైద్యులను దీనికి ఆహ్వానించినట్లు తెలిపారు. డేకేర్ పద్ధతిలో సర్జరీ సేవల వ్యాప్తికి తాము నిర్వహిస్తున్న సదస్సులు, సమావేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

సాగర్‌లో మీనాయానం

పొట్టిచెల్మ నుంచి కేజ్ కల్చర్ వరకు బోటింగ్.. త్వరలో ప్రారంభానికి కసరత్తు



నదిలో మర పడవలో కేజ్ కల్చర్ వద్దకు వెళ్తున్న కలెక్టర్

నాగార్జునసాగర్, మార్చి 2: ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌కు మరో ఆకర్షణ సమకూరనుంది. మత్స్యకారులకు అధిక వనరులు కల్పించేందుకు సాగర్ జలాశయం మధ్యలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ వరకు పడవలు నడపటానికి కసరత్తు చేస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. శుక్రవారం ఆయన సాగర్‌లో పొట్టి చెలమ వద్ద మత్స్యకారులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాగర్‌లో పర్యాటక పరంగా కూడా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఎర్ర గుట్ట వద్ద ఉన్న కేజ్ కల్చర్ వరకు మీనాయానం పేరుతో బోటింగ్ వల్ల పర్యాటకులకు దానిని తిలకించే అవకాశం కలుగుతుందన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు మత్స్య కారులకు ఉపాధి కలుగుతుందని అన్నారు. అనంతరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే మీనాయానం వాల్‌పోస్టర్‌ను, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.

మీనాయానం టూరిజం ప్యాకేజీ వివరాలు

పెద్దలకు:
బోటింగ్‌కు రూ. 100
చేపలకూరతో భోజనానికి రూ. 100
లైఫ్ జాకెట్ కిరాయి రూ.50
నదిలో ఫిషింగ్ (చేపల వేట)కు రూ.100
మొత్తం రూ.350

పిల్లలకు:
బోటింగ్‌కు రూ.50
భోజనానికి రూ.50
లైఫ్ జాకెట్‌కు రూ.50
మొత్తం రూ.150

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మర్రిగూడ, మార్చి 2: అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఎరుగండ్లపల్లికి చెందిన అబ్బనబోయిన రాములు (29) తనకున్న నాలుగు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని నాలుగేళ్లుగా పత్తి సాగు చేస్తున్నాడు. ఇందుకోసం రూ. 5 లక్షల వరకు ప్రైవేట్ అప్పులు చేశాడు. వర్షాభావం కారణంగా పత్తిపంట దిగుబడిరాకపోవడం, అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి పెరగడంతో ఆందోళనకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోగా మృతి చెందాడు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
FORM - F
జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి కార్యాలయము
(రూల్ 7 (C) ప్రకారం కలెక్టర్ గారి ప్రకటన)
(Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Re-settlement (Telangana Amendment) Act - 2016 (Act. No. 21/2017) Dated 17-05-2017
R/w G.O.Ms No. 120 Revenue (JA & LA) Dept. Dated 30.06.2017.
ఆర్.సి.నెం. బి/108/2017 - SDC (LA) SRCIP, పాల్వంచ తేది. 09-02-2018
ఆర్.సి.నెం. బి/14/2016 - జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం. తేది. 14-02-2018
ఆర్.సి.నెం. ఎ4/72/2018 - జిల్లా గెజిట్ నెంబర్ తేది. 17-02-2018
ఈ కార్యాలయం ప్రకటన నెంబర్ బి/108/2017 తేది. 12.09.2017 ప్రకారం సీతా రామ ఎత్తిపోతల ప్రాజెక్టు క్రింద [illegible] కెనాల్ నిర్మాణం కొరకు [illegible] గ్రామము, చండ్రుగొండ మండలములో భూసేకరణ నిమిత్తం తేది. 26.09.2017న ఆంధ్రజ్యోతి మరియు తేది. 26.09.2017న సూర్య పత్రికల నందు ప్రకటించి ఉండడమైనది.
అట్టి ప్రకటనకు అనుగుణముగా సీతా రామ ఎత్తిపోతల ప్రాజెక్టు క్రింద [illegible] కెనాల్ నిర్మాణ భూసేకరణలో భూమి కోల్పోయే అర్హులైన లబ్ధిదారుల విస్తీర్ణం ఎ. 10.17 కుం.లు [illegible] గ్రామము, చండ్రుగొండ మండలము నందు, క్రింద చూపిన సంబంధిత వ్యక్తులు వారి (భూ యజమానులు మరియు ఇతరులు) యొక్క హక్కులను చర్చల ద్వారా పరిష్కరించడానికి ముందుకు వచ్చినారు. అట్టి వారి వివరములు క్రింద చూపనైనది.
షెడ్యూల్
గ్రామము- [illegible] మండలము- చండ్రుగొండ, జిల్లా- భద్రాద్రి కొత్తగూడెం

1	2	3	4	5	6	7	8 పట్టాదారు పేరు	9 అనుభవదారు పేరు	10
1	14	140/5	[illegible]	[illegible]	మెట్ట	0.04	[illegible]	[illegible]	[illegible]
2	16	140/6	[illegible]	[illegible]	మెట్ట	0.27	[illegible]	[illegible]	లేవు
3	18	140/5	[illegible]	[illegible]	మెట్ట	0.32	[illegible]	[illegible]	లేవు
4	23	140/8	140/7/ [illegible]	[illegible]	మెట్ట	0.06	[illegible]	[illegible]	లేవు
5	26	140/11	140/8	[illegible]	మెట్ట	2.34	[illegible]	[illegible]	లేవు
6	32	140/9	[illegible]	[illegible]	మెట్ట	0.01	[illegible]	[illegible]	లేవు
7	33	140/9	[illegible]	[illegible]	మెట్ట	1.00	[illegible]	[illegible]	లేవు
8	34	140/10		[illegible]	మెట్ట	0.36			లేవు
9	46	140/12	140/ [illegible] 12	[illegible]	మెట్ట	2.34	[illegible]	[illegible]	[illegible]
10	51	140/13	[illegible]	[illegible]	మెట్ట	1.01	[illegible]	[illegible]	లేవు
				మొత్తం విస్తీర్ణం		10.17			

[illegible]
సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), సీతా రామ ఎత్తిపోతల ప్రాజెక్టు, పాల్వంచ. సం/- సంయుక్త కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. సం/- కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
DIPR/Ro.No.1664 /LA/PP/2017-18

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూ.సే.) శాఖ
ఫారం -సి
రెఫ నెం. బి1/168/2016 తేది: 22/01/2018
[illegible] (D 45, BMC) [illegible] ఎ. 5.33 [illegible]
గ్రామము: అప్పలి 45 మండలము: సిర్పూర్-టి జిల్లా: కుమురం భీం ఆసిఫాబాద్

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	57/1	పట్టా	ఖుష్కి	0.07	[illegible]	స్వంతం	55	60	VB	58	0	0	0	
2	57/3	పట్టా	ఖుష్కి	0.06	[illegible]	స్వంతం	55	60	VB	58	0	0	0	0
3	60	పట్టా	ఖుష్కి	0.23	[illegible]	స్వంతం	57	61	VB	58	0	0	0	0
4	61/అ	పట్టా	ఖుష్కి	0.12	[illegible]	స్వంతం	60	62	VB	63	0	0	0	0
5	61/1/అ/4	పట్టా	ఖుష్కి	0.12	[illegible]	స్వంతం	60	62	VB	63	0	0	0	0
6	61/అ/1	పట్టా	ఖుష్కి	0.07	[illegible]	స్వంతం	60	62	VB	63	0	0	0	0
7	61/అ/1	పట్టా	ఖుష్కి	0.07	[illegible]	స్వంతం	60	62	VB	63	0	0	0	0
8	62	పట్టా	ఖుష్కి	0.07	[illegible]	స్వంతం	61	VB	VB	63	0	0	0	0
9	63/14	లా పట్టా	ఖుష్కి	1.07	[illegible]	[illegible]	65 64 44	VB	58	95	0	0	0	0
10	63/13/2	లా పట్టా	ఖుష్కి	0.05	[illegible]	స్వంతం	65 64 44	VB	58	95	0	0	0	0
			మొత్తం	3.13										
అప్పలి BMC														
1	130/1/2	పట్టా	ఖుష్కి	0.28	[illegible]	స్వంతం	131	153	153	132	0	0	0	0
2	131/4	పట్టా	ఖుష్కి	0.13	[illegible]	స్వంతం	153	132 130	153	134 133	0	0	0	0
3	131/2	పట్టా	ఖుష్కి	0.12	[illegible]	[illegible]	153	132 130	153	134 133	0	0	0	0
4	132	పట్టా	ఖుష్కి	1.07	[illegible]	స్వంతం	131	153	153	153	0	0	0	0
			మొత్తం	2.20										
			మొత్తం	5.33										

ఈ ప్రకటన భూసేకరణ, న్యాయ పరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన, (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టము 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) కు సవరించబడిన తెలంగాణా చట్టం భూసేకరణ, న్యాయ పరిహారం మరియు పునరావాస మరియు పునరుపాధి కల్పన (సవరణ తెలంగాణా చట్టం-2016 (చట్టం 30/ఎ మరియు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వము యొక్క యాక్ట్ నెం. 21/2017 యొక్క సెక్షన్ 10 (ఎ) ప్రకారము ఎవరికి సంబంధించిన వారికి చెందును.
[illegible]
తేది: 20.01.2018
DIPR/Ro.No.1656 /LA/PP/2017-18

భద్రాద్రిలో వైభవంగా డోలోత్సవం, వసంతోత్సవం

» రామయ్య కల్యాణ పనులకు శ్రీకారం..తలంబ్రాల తయారీ ప్రారంభం



వసంత శోభలో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

భద్రాచలం, మార్చి 2 : భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో డోలోత్సవం, వసంతోత్సవాన్ని శుక్రవారం ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఈ నెల 26న భద్రాద్రి మిథిలా స్టేడియలోని శిల్పకళాశోభిత కల్యాణ మండపంలో అంగ రంగ వైభవంగా జరిగే స్వామి వారి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీ కూడా సంప్రదాయ బద్ధంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తొలుత ఉత్సవ మూర్తులకు 25 కలశాల పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించారు. ఈ సమయంలో స్వామి వారికి సహస్రధారతో స్నపనం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రంగు రంగుల పూలతో అలంకరించిన ఉయ్యాలలో శ్రీ సీతారామలక్ష్మణులను ఆసీనులను చేశారు. ఈ సమయంలో ఆస్థాన గాయకులు రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలు ఆలపిస్తుండగా నక్షత్ర, కుంభ హారతులను స్వామి వారికి ప్రత్యేకంగా సమర్పించారు. డోలోత్సవంలో భాగంగా శ్రీ సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆగమ సంప్రదాయం ప్రకారం హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని వసంతోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు వసంతం చల్లిన రోజున రామయ్యను పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేసినట్టు భావిస్తారు. సాయంత్రం శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ స్వాములకు బాజా భజంత్రీలతో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం దేవస్థానం ఈవో కె. ప్రభాకర శ్రీనివాస్, భద్రాచలం పథమ శ్రేణి న్యాయమూర్తి కేవీవీ బుల్లి కృష్ణ, ఏఈవో శ్రవణ్ కుమార్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, సీతారామానుజాచార్యులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. భద్రాద్రి రామయ్య కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీ కార్యక్రమానికి కూడా శుక్రవారం శ్రీకారం చుట్టారు. చిత్రకూట మండపంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత కల్యాణ కార్యక్రమంలో పాల్గొనే రుత్వికుల సతీమణులు పసుపును రోట్లో దంచారు. అనంతరం పసుపు, కుంకుమ, నెయ్యి, అత్తర్, పన్నీర్, నూనె, సుగంధ ద్రవ్యాలు కలిపి తలంబ్రాలను సిద్ధం చేశారు. తొలి రోజున 10 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేయగా.. మొత్తంగా 100 క్వింటాళ్లను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



శ్రీ స్వామివారల ఉత్సవ మూర్తులు

వేములవాడలో కల్యాణోత్సవాలు

» నేడే శ్రీకారం.. 4న కల్యాణం.. 6న రథోత్సవం

వేములవాడ, మార్చి 2 : శివకల్యాణ మహోత్సవాలకు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రం ముస్తాబైంది. శనివారం నుంచి బుధవారం వరకు ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా ఆదివారం కల్యాణం, మంగళవారం (6న) రథోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తారు. శనివారం ఉదయం శివభగవత్ పుణ్యాహవాచనం గావించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఆదివారం ఉదయం తీర్థరాజ పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, ధ్వజారోహణం, ఎదుర్కోళ్లు కల్యాణ మహోత్సవం, సాయంత్రం శివపురాణ ప్రవచనం, ప్రధాన హోమం, బలిహరణం, పెద్ద సేవ ఊరేగింపు నిర్వహిస్తారు. సోమవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అభిషేకాలు, ఔపాసనము, బలిహరణం, శివ పురాణ ప్రవచనం, సదస్యం నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, ఔపాసనము, బలిహరణం, ఏకాదశ రుద్ర కలశ స్థాపన, రుద్రయాగం, రథప్రతిష్ట, రథహోమం, సాయంత్రం రథోత్సవం, రాత్రి శృంగార వసంతోత్సవం నిర్వహిస్తారు. బుధవారం శ్రీస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

లంచాల వీఆర్వోపై వేటు

» విధుల నుంచి తప్పించిన ఆర్డీవో

» కూచిపూడిలో బహిరంగ విచారణ

కోదాడ రూరల్, మార్చి 2 : సమగ్ర భూ సర్వేలో సాదా బైనామాల కింద దరఖాస్తు చేసుకున్న వారి వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేసిన సూర్యాపేట జిల్లా కూచిపూడి గ్రామ వీఆర్వోను ఆర్డీవో భిక్షు నాయక్ విధుల నుంచి తప్పించారు. సమగ్ర సర్వేలో తమ పేర్లు నమోదు కాకపోవడంతో గ్రామ రైతులు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం గ్రామానికి విచారణకు వచ్చిన ఆర్డీవో భిక్షు నాయక్‌కు.. వీఆర్వో మౌలానా నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. తాతల కాలం నుంచి వస్తున్న భూములను తమ పేర్ల మీదకు మార్చడానికి ఎకరాకు రూ.5 నుంచి 8 వేల వరకు డిమాండ్ చేశాడని, తప్పని పరిస్థితుల్లో ముట్టజెప్పినట్లు చెప్పారు. అయినా తమ పేర్లను రికార్డుల్లో నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కూచిపూడి వీఆర్వో మౌలానాను విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆర్డీవో భిక్షు నాయక్ ప్రకటించారు. గ్రామంలో అతడిపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో పాటు సమగ్ర భూ సర్వేలో రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిష్కరించకుండా అవకతవకలకు పాల్పడినట్లు రుజువైనందన్నారు. అతడి స్థానంలో ఆర్ఐ పుష్పలతకు కూచిపూడి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

ఈనాటి ఈ బంధమేనాటిదో..



తెల్లావు కడుపునా ఎర్రావు.. ఆ ఎర్రావు కడుపునా కర్రావులూ పుడతాయి! వర్ణబేధమే కాదు.. తమకు జాతి బేధమూ ఉండదని ఈ గోమాత చాటుతున్నట్టు లేదూ ఈ చిత్రం! ఆ బుజ్జిమేక ఆకలికి తట్టుకోలేక పొదుగు వద్దకు వచ్చి మూతిపెడితే ఆవు పొడవలేదు. సరికదా.. చక్కగా కడుపునిండా పాలు తాగేదాకా కదలకుండా నిల్చుంది. వికారాబాద్ మండల పరిధిలోని గెరిగేట్‌పల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన జాంబాపూర్ తాండాలో కనిపించిందీ దృశ్యం! **-వికారాబాద్**

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీ రాజ్ శాఖ, జగిత్యాల
టెండరు ప్రకటన
టెండర్ ప్రకటన నం.DB1/ /2017-18 తేది:21.02.2018
పని పేరు: మల్యాల (గ్రా॥&మం॥) వద్ద R&B రోడ్ నుండి KGBV వరకు CC రోడ్ నిర్మాణం & జగిత్యాల (జిల్లా హెడ్ క్వార్టర్స్) వద్ద టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం యొక్క B/W. మొత్తం ECV: రూ.20.00 లక్షలు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది:13.03.2018 సా.5.00 గం. వరకు. టెండర్ షెడ్యూల్ సరఫరా తేది:16.03.2018 సా.5.00 గం. వరకు. టెండర్ల స్వీకరణ తేది:17.03.2018 మ.3.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేది:17.03.2018 న మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, జగిత్యాల జిల్లా.
DIPR RO No.3201/CL/ADVT/1/1/2017-18, తేది:02.03.2018.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ, నిజామాబాద్
NIT No.558-562/2017-18 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.02.2018
నిజామాబాద్, PR సర్కిల్‌లో BT రెన్యువల్ పనులు (05) చేపట్టుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వద్ద టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.915.50 లక్షలు. టెండర్ షెడ్యూళ్లను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి 03.03.2018 ఉ. 10.30 గం. నుండి 12.03.2018 మ. 3.00 గం. వరకు పొందవచ్చును. ఫోన్ నెం. 08462-239502. ఇతర వివరాలు మరియు భవిష్య సవరణలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR సర్కిల్, నిజామాబాద్
DIPR RO No. 3209/CL/Advt/1/1/2017-18, Dt: 02.03.2018

జగిత్యాల జిల్లాలో హవాలా దందా!

» గల్ఫ్ వెళ్లిన వారి సాయంతో నగదు మార్పిడి

» కోరుట్లలో రూ. 46 లక్షల స్వాధీనం



ఇటీవల కోరుట్లలో పట్టుకున్న కరెన్సీ

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లాలో హవాలా దందా కొనసాగుతోంది. ఈ జిల్లా నుంచి చాలా మంది గల్ఫ్ వెళ్లారు. వారి నుంచి హవాలా మరా వారు విదేశీ కరెన్సీ కొనుగోలు చేస్తూ, గుట్టుచప్పుడు కాకుండా కరెన్సీ మార్పు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అనుమతులు లేకుండా విదేశీ కరెన్సీ కొనడం, అమ్మడం ఆర్థిక నేరం అని తెలిసినప్పటికీ కొందరు అధికారుల అండదండలతో జిల్లాలో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. కోరుట్లలో చింత సంతోష్ అనే వ్యక్తి విదేశీ కరెన్సీ కొనుగోలు చేస్తూ హవాలా దందా కొనసాగిస్తున్నాడని జిల్లా ఎస్పీకి వచ్చిన సమాచారం మేరకు మూడు రోజుల క్రితం పోలీసులు దాడులు చేశారు. రూ.30.78 లక్షల విలువైన భారతీయ కరెన్సీ, రూ.16 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీ పట్టుబడింది. పోలీసులు ఈ కరెన్సీని హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయంలో అప్పగించారు. జిల్లాలో 18 మండలాలు, మూడు మున్సిపాలిటీలు ఉండగా, దాదాపు 10 లక్షల మేరకు జనాభా ఉంది. జిల్లాలోని 2 లక్షల మందికి పైగా ఇతర దేశాల్లో నివసిస్తున్నారు. ఉపాధి నిమిత్తం వెళ్లిన వీరు ప్రతి నెలా ప్రభుత్వామోదిత సంస్థల ద్వారా డబ్బులు పంపుతుంటారు. అయితే మరికొందరు విదేశీ కరెన్సీని కూడా తీసుకుని వస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు ముఠాగా విదేశీ కరెన్సీని కొనుగోలు చేస్తూ చెలామణీ చేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి ప్రాంతాలకు చెందిన కొందరు ఈ అక్రమ దందా సాగిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న కొందరు గల్ఫ్ ఏజెంట్ల సహకారంతో గల్ఫ్‌కు వెళ్లి వచ్చిన వారి వివరాలను సేకరిస్తూ నిత్యం లక్షల్లోనే విదేశీ కరెన్సీని కొనుగోలు చేసి హవాలా దందా సాగిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
గురుకులం
తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ®
Rc.No.C2/69/2018 తేది : 28.02.2018
టెండరు ప్రకటన
2017-18 సంవత్సరం కాలంలో TTWRE ఇన్‌స్టిట్యూషన్స్‌కు దిగువ ఐటమ్‌లు సరఫరా చేయుట కొరకు టెండరు ఫారంలో తెలిపిన నియమ నిబంధనలపై నమోదిత సంస్థలు/సరఫరాదారుల నుండి నిర్ణీత నమూనాలో సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి.

క్ర.సం.	ఐటమ్ పేరు	ఆవశ్యకత	సంప్రదించాల్సిన నం.లు
1.	లైబ్రరీ బుక్స్, రిఫరెన్స్ బుక్స్ మరియు ప్రాక్టికల్ మాన్యువల్స్.	(21) TTWR డిగ్రీ కాలేజీలు	9491064519
2.	ఔట్ డోర్ ప్లే ఎక్విప్‌మెంట్స్	(29) మినీ గురుకులాలు	8185807047
3.	ఆమోదిత సివిల్ ఇంజినీర్ల ద్వారా సివిల్ లే ఔట్ మ్యాప్స్	(65) TTWR పాఠశాలలు & జూనియర్ కాలేజీలు	9492357809

టెండరు ఫారాలు/ డాక్యుమెంట్లు TTWREI సొసైటీ (గురుకులం) గురుకులం భవన కాంప్లెక్స్, DSS భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్ వారి నుండి అన్ని పని రోజుల్లో 02.03.2018 నుండి 12.03.2018 న ఉ.11.00 గం.నుండి సా.5.00 గం.మధ్యన పొందవచ్చును. ఇందుకుగాను సెక్రటరీ, TTWREI సొసైటీ హైదరాబాద్ పేరున డిడి రూపంలో పై ఒక్కో ఐటమ్ కొరకు రూ 1000/- వాపసు రాని చెల్లింపు చేయవలసి ఉంటుంది. అన్ని వివరాలు టెండరు డాక్యుమెంటులో తెలియజేయబడినవి.
టెండరు దాఖలుకు ఆఖరి తేది : 12.03.2018 న సా. 5.00 గం. వరకు, టెండరు తెరచు తేది : 16.03. 2018న ఉ.11.00 గం.కు, తదుపరి వివరాలకు http://www.tgtwgurukulam.telangana.gov.in ను దర్శించగలరు.
సం/- (డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, IPS), సెక్రటరీ, (FAC) TTWREI సొసైటీ (గురుకులం)
DIPR No.636PP/CL/ADVT/1/1/2017-18 Dt: 02.03.2018

ప్రైవేటు మోజు!

ఇందిరాగాంధీ బొగ్గు రంగాన్ని జాతీయం చేసిన 44 ఏళ్ళ తరువాత, తిరిగి ప్రైవేటు శక్తుల ప్రవేశానికి వీలు కల్పిస్తూ మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. బొగ్గు వనరులమీద ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా నియంత్రణను దెబ్బతీసే ఈ చర్యను అత్యంత కీలకమైన సంస్కరణగా, మేలిమలుపుగా కేంద్ర మంత్రి గోయల్ అభివర్ణించారు. ప్రైవేటు కంపెనీలతో పాటు విదేశీ సంస్థలూ దేశంలోకి దిగుతాయి కనుక ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందనీ, దేశావసరాలు సత్వరమే నెరవేరిపోతాయని గోయల్ చెబుతున్నారు. విదేశాలనుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం దిగివస్తుందనీ, గుత్తాధిపత్యం దెబ్బతిన్నప్పటికీ హెచ్చిన పోటీ కారణంగా కోల్ ఇండియా మరింత బాగుపడుతుందని ఆయన అంటున్నారు. బొగ్గు దిగుమతుల అవసరం తగ్గిపోవడం విలువైన విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందనీ, విద్యుత్ చార్జీలు కూడా గణనీయంగా పడిపోతాయని ఆశ చూపుతున్నారు. ప్రభుత్వ సంస్థలను చంపేసి ఆయా రంగాలను ప్రైవేటుకు అప్పగిస్తున్నప్పుడు పాలకులు చెప్పే ఈ తరహా కబుర్లకు ఏ మాత్రం కొదవుండదు.

గత కాంగ్రెస్ పాలకులు బొగ్గురంగాన్ని ప్రైవేటీకరించే దిశగా కొన్ని ఆలోచనలు, ప్రయత్నాలు చేసినప్పటికీ, కార్మిక ఉద్యమాల కారణంగానో, జాతీయీకరణ చేసిన పార్టీగా తామే భిన్నంగా పోవడానికి భయపడో ఇంతటి తీవ్రమైన నిర్ణయం తీసుకోలేకపోయారు. బొగ్గు వెలికితీతలో ప్రపంచవ్యాప్తంగా ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం హెచ్చి వుండవచ్చునేమో కానీ, ఇప్పుడు గోయల్ చూపుతున్న కారణాల రీత్యానే గతంలో ఇందిరాగాంధీ గనులను జాతీయం చేసినమాట వాస్తవం. దేశంలో దాదాపుగా రెండు వందల సంవత్సరాలు బొగ్గు ఉత్పత్తి ప్రైవేటు చేతుల్లోనే ఉన్నది. జాతీయం చేసే ముందువరకూ ఈ రంగంలో సాగిన ఉత్పత్తి దేశ అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోయింది. సమర్థత, పెట్టుబడి, పరిజ్ఞానం ఇత్యాది విషయాల్లోనూ అప్పటికి మిగతాదేశాల్లో ఉన్న ప్రమాణాలను కూడా అందుకోలేకపోయింది. దేశ విద్యుత్ అవసరాలను తీర్చలేని దుస్థితికి తోడు, కార్మికుల దోపిడీ యథేచ్ఛగా సాగింది. రక్షణ మృగ్యమై వందలాదిమంది కార్మికులు ప్రమాదాల్లో కన్నుమూశారు. శ్రామిక కుటుంబాల బాగుకు కానీ, సమాజానికి కానీ మేలు చేయని ఈ వాతావరణాన్ని జాతీయీకరణ కొంత మార్చింది. ఉత్పత్తి లక్ష్యాలను అందుకోలేకపోవచ్చును కానీ, బొగ్గురంగంలో ఉన్న అస్థవ్యస్థ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. లక్షలమంది కార్మికులకు భద్రత, శ్రమకు తగిన వేతన భత్యాలు అందాయి. కోల్ ఇండియా యాభైవేలకోట్ల పైచిలుకు టర్నోవర్‌తో నవరత్న కంపెనీగా, ప్రపంచంలోని ఆరు అతిపెద్ద మైనింగ్ కంపెనీల్లో ఒకటిగా అవతరించింది. 1990లలో వచ్చిన నూతన పారిశ్రామికార్థిక విధానాలతో ప్రభుత్వాలు బడ్జెట్ సపోర్టు ఇవ్వడం నిలిపివేసినా, ఈ సంస్థ నిలబడి లాభాలను పంచుతూనే ఉన్నది. రాయల్టీలు, పన్నులు, డివిడెండ్లు ఇత్యాది పలు రూపాల్లో ఏటా ఓ పదిహేనువేల కోట్ల వరకూ కోల్ ఇండియా ప్రభుత్వానికి సమర్పిస్తూనే ఉన్నది. అయినప్పటికీ, నియామకాలను నిలిపివేసి కార్మికుల సంఖ్యను సగానికి తగ్గించివేయడం, విస్తరణకు అనుమతులు ఇవ్వకపోవడం వంటి ఎత్తులకు పాల్పడుతూ బొగ్గును ప్రైవేటుకు అప్పగించడం మినహా మరోమార్గలేదని అనిపించేందుకు ప్రభుత్వాలు సర్వదా ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

తన నిర్ణయానికి ప్రభుత్వం ఏ అవసరాలను చూపినప్పటికీ, వాటిలో కొంత వాస్తవం ఉన్నప్పటికీ, మిగతా రంగాల మాదిరిగానే బొగ్గురంగాన్నీ ప్రైవేటీకరణతోనూ, విదేశీపెట్టుబడులతోనూ ముంచెత్తడమే దాని అసలు లక్ష్యం. దేశంలో ఇప్పటికీ 70శాతం విద్యుదుత్పత్తి బొగ్గు ఆధారంగానే సాగుతున్నందున, వాటి అవసరం తీర్చడానికీ, నానాటికీ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు వీలుగా కొత్త విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకూ బొగ్గు వెలికితీత వేగంగా, అధికం జరగాల్సిన మాట వాస్తవం. అయితే, ఈ పని కోల్ ఇండియాకు వెన్నుదన్నుగా ఉంటూ, దాని అవసరాలను తీరుస్తూ కొత్తగనులను తవ్వించడం ద్వారా కాక, ప్రైవేటు రంగం ద్వారానే సాధ్యపడుతుందని ప్రభుత్వం భావించడమే విచిత్రం. అణు, సౌర, పవన తదితర విద్యుదుత్పత్తికి పెద్దపీట వేశామనీ, అవి భారీగా అందుబాటులోకి రాబోతున్నాయనీ, కాలుష్యకారక బొగ్గుమీద ఆధారపడే అవసరం ఇకపై తగ్గిపోతుందని పాలకులు చెబుతున్న మాటల్లో నిజం లేదని కూడా ఈ నిర్ణయంతో తేలిపోయింది. దేశంలో అపారమైన బొగ్గు నిల్వలు ఉండగా, వాటిని వెలికి తీయడంపై శ్రద్ధపెట్టకుండా విదేశాలనుంచి పెద్ద ఎత్తున బొగ్గు దిగుమతులు చేసుకోవాల్సిరావడం విధానాల్లో లోపమే. ఇప్పుడు ప్రభుత్వం పెద్ద ఎత్తున బొగ్గు రంగంలోకి ప్రైవేటును ప్రవేశపెడుతున్న నేపథ్యంలో, గతంలో బొగ్గు గనుల కేటాయింపుల్లో అవకతవకలు జరిగి, సర్వోన్నత న్యాయస్థానం ఆ కేటాయింపులను రద్దుచేసిన నేపథ్యాన్ని గమనంలో ఉంచుకోవడం అవసరం. వేలానికి సంబంధించిన విధానాలపైనా, రాష్ట్రాల వాటాలపైనా గోయల్ చెబుతున్నదంతా ఉపరితలంలో ఎంతో ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, ఆచరణ వక్రమార్గం పట్టకుండా చూడటం ముఖ్యం. ఇదంతా ఒక ఎత్తయితే, ప్రైవేటు రంగ ప్రవేశంతో ఈ రంగంలో ఉత్పన్నమయ్యే ఇతరత్రా సమస్యలను ఎదుర్కోవడం మరింత ముఖ్యం. బొగ్గు తవ్వకం పర్యావరణ హితంగా సాగేట్టు చూడటం, కార్మికుల భద్రత, సంక్షేమాన్ని పరిరక్షించడం వంటివి ఎన్నో జరగాలి. ఒక ఉన్నతస్థాయి పర్యవేక్షణ సంస్థను నియమించడం ద్వారా ఈ రంగం భ్రష్టుపట్టిపోకుండా కొంతమేరకైనా నియంత్రించవచ్చు.

జాతీయ విద్యా విపత్తు!

దేశంలోని వర్సిటీలు, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల నియామకానికి, ఇప్పటికే ఉన్నవారి పదోన్నతులకి సంబంధించిన ప్రతిపాదనలతో యుజీసీ విడుదల చేసిన 84 పేజీల చిత్తు ప్రతి (డ్రాఫ్ట్) ఆందోళనకి గురిచేస్తోంది. టీచింగ్‌లో ఎంట్రీ లెవెల్ పోస్టులు అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 2021 జూలై నాటికి పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికే అర్హత ఉంటుందని, అధ్యాపకుల నియామక ఇంటర్వ్యూకి అర్హత సాధించడానికి వారి విద్యా జీవితంలో పొందిన డిగ్రీలలో వచ్చిన మార్కుల శాతాన్ని బట్టి మార్కులు కేటాయించడం జరుగుతుందనీ పేర్కొనడం నిరుద్యోగులను బెంబేలెత్తిస్తూ ఉంది. వాస్తవానికి '2021 జూలై కల్లా పీహెచ్‌డీ' తప్పనిసరి చేయడం ఒక పెద్ద జాతీయ విద్యా విపత్తు. ఇప్పటిదాకా నెట్ వంటి జాతీయ అర్హత పరీక్ష, సెట్ వంటి రాష్ట స్థాయి అర్హత పరీక్షలు కాని పక్షంలో, 2009 యుజీసీ గైడ్‌లైన్స్ ప్రకారం పీహెచ్డీ పూర్తి చేసినవారికి అధ్యాపకులుగా అవకాశం కల్పిస్తూ ఉన్నారు. ఇప్పుడు వీటితో పాటు పీహెచ్డీని కూడా తప్పనిసరి చేయడం వల్ల ఒరిగే ప్రయోజనమేమీలేకపోగా అసలే అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగక కునారిల్లుతున్న ఉన్నత విద్య, ప్రమాణాల పరంగా మరింత దిగజారుతుంది. ఒక పీహెచ్డీ పూర్తి చేయడం డిగ్రీ పీజీ పూర్తి చేయడమంత సులభం కాదు. ఒక పీహెచ్‌డీ అడ్మిషన్ పొందాలంటే పీజీ పూర్తి చేసి ఉండాలి. నెట్, సెట్ వంటి జాతీయ రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షలు, లేదా యునివర్సిటీల ప్రవేశ పరీక్ష ద్వారా మాత్రమే పీహెచ్‌డీ అడ్మిషన్ పొందగలం. దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏటా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రవేశ పరీక్షను నిర్వహిస్తాయి. తర్వాత ఇంటర్వ్యూల ద్వారా సంబంధిత సబ్జెక్టుల్లో ప్రవేశాలు చేపడతాయి. ప్రతి సబ్జెక్టులో అక్కడున్న అధ్యాపకుల అర్హత, అప్పటికే తమ వద్ద ఉన్న ఖాళీలను బట్టి సీట్ల సంఖ్య ఉంటుంది. అందుకే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇక రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఏటా జరగదు. రెండేళ్లకోసారి, మూడేళ్లకోసారి నిర్వహిస్తుంటారు.

> **ఇప్పటికీ జాతీయ స్థాయి విద్యాలయాల్లో కూడా కాంట్రాక్ట్ టీచర్లతో బోధిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ స్థితిలో పీహెచ్‌డీ అర్హత కలిగిన వారు ఎక్కడి నుంచి పుట్టుకొస్తారు? పీహెచ్‌డీలను పర్యవేక్షించడానికి అవసరమైన మేర అర్హత కలిగిన అధ్యాపకులు దేశంలో సిద్ధమయ్యాక తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడం తప్పకుండా ఒక 'జాతీయ విద్యా విపత్తు'కు దారి తీస్తుంది.**

కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసే వారికి నెలకు 5వేల నుండి 8వేల వరకూ ఉపకార వేతనం అందజేస్తారు. కానీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఇవేమీ ఉండవు. అందువల్ల ఎక్కువమంది అడ్మిషన్ పొందాక బయట తమ జీవనోపాధి చూసుకుంటూ అధ్యయనం చేస్తారు. దానితో వారికి ఈ డిగ్రీ పొందడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఏడెనిమిది సంవత్సరాలు పట్టే వాళ్లు కూడా ఉన్నారు. ఇంత సమయం పట్టే ఒక డిగ్రీని అధ్యాపక ఉద్యోగాల నియామాకానికి అర్హతగా పెట్టడం వల్ల ఏమి సాధించాలని కోరుకుంటున్నట్టు? నిజంగానే ఈ అర్హత తప్పనిసరి చేస్తే ఇప్పుడు పీహెచ్‌డీ అడ్మిషన్ పొందే విద్యార్థులు సైతం 2021కి డిగ్రీ పొందలేరు. అలాగే 2021 జూలై తరువాత, ఇప్పుడు అర్హతలుగా ఉన్న నెట్, సెట్ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు పీహెచ్‌డీ పూర్తి చేసేదాకా అధ్యాపక ఉద్యోగాలకు అర్హులే కారు. ఇదెలా న్యాయం?

దేశంలో జాతీయ విశ్వ విద్యాలయాలు, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపక ఖాళీలు వేలసంఖ్యలో ఉన్నాయి. అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడం, అభ్యర్థుల నుంచి ఫీజు వసులు చేయడం ఏదో ఒక కారణంతో వాయిదా వేయడం.. ఇలా అభ్యర్థుల జేబులు గుల్ల కావడం తప్ప భర్తీ జరిగిందే లేదు. ఇప్పటికీ జాతీయ స్థాయిలో విద్యాలయాల్లో కూడా కాంట్రాక్ట్ టీచర్లతో బోధిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ స్థితిలో పీహెచ్‌డీ అర్హత కలిగిన వారు ఎక్కడి నుంచి పుట్టుకొస్తారు? పీహెచ్‌డీలను పర్యవేక్షించడానికి అవసరమైన మేర అర్హత కలిగిన అధ్యాపకులు దేశంలో సిద్ధమయ్యాక తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడం తప్పకుండా ఒక 'జాతీయ విద్యా విపత్తు'కు దారి తీస్తుంది.

■ పచ్చల రాజేష్

సెహ్వాగ్: అపరాధం – ఆదర్శం

■ రామచంద్ర గుహ



గతానుగతం

చరిత్రను వ్యాఖ్యానించడం, రాజకీయాలను విమర్శించడం నా వృత్తి. క్రికెట్ రచనా వ్యాసంగం నా ద్వితీయ వ్యాపకం. నా వృత్తీ, నా అభిమాన వ్యాపకమూ చాలవరకు విడివిడిగా వర్ధిల్లుతున్నాయి. అప్పుడప్పుడు అవి సంఘర్షించుకుంటాయి. అటువంటి సందర్భమొకటి ఇటీవల తటస్థించింది. గత శనివారం నాడు నా ట్విటర్ ఖాతాలోకి వచ్చిన పోస్ట్‌లను చూస్తుండగా, కేరళలో సంభవించిన ఒక విద్వేష నేరం గురించి క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొన్ని అర్ధ సత్యాలను చెప్పినట్లు కనుగొన్నాను.

మధు అనే బాలుడిని హిందూ, ముస్లిం మిశ్రమ మూక ఒకటి తీవ్రంగా కొట్టి చంపివేసింది. నేరస్థుల జాబితాను ఇప్పటికే వివిధ వార్తాపత్రికలు ప్రచురించాయి (ట్విటర్‌లో కూడా ఆ జాబితాను పోస్ట్ చేశారు). అయినా సెహ్వాగ్ రెండు ముస్లిం నామధేయాలను ఎంపిక చేసుకొని, వారే ఆ కిరాతకానికి పాల్పడిన వ్యక్తులయినట్టుగా హతుని హిందూ పేరు ఎదురుగా రాసి 'ఈ ఘటన నాగరిక సమాజానికి సిగ్గుచేటు' అని ఘోషించారు.

సెహ్వాగ్ బ్యాటింగ్ అంటే నాకు ఎంతో ఇష్టం. టీమ్ ఇండియా నుంచి ఆయన్ని తొలగించినప్పుడు నేను చాలా వ్యాకులపడ్డాను. ఆయన బ్యాటింగ్ నైపుణ్యాలను భావోద్వేగంతో కొనియాడుతూ ఒక కవితాత్మక కాలమ్ రాశాను. గూగ్లీ బౌలర్ బి.ఎస్. చంద్రశేఖర్‌తో పాటు సెహ్వాగ్, భారతీయ క్రికెట్ చరిత్రలో ఇద్దరు మౌలిక, అసమాన ప్రతిభావంతులలో ఒకరని సూచించాను. అయితే కేరళ ఘటనపై సెహ్వాగ్ ట్వీట్ నన్ను దిగ్భ్రాంతి పరచింది. నిజానిజాలు తెలుసుకోకుండా ఎంపిక చేసుకొన్న నామధేయాల ప్రాతిపదికన ఆ వ్యాఖ్య చేసినందుకే గాక, తాను ఒక పాఠశాలను నిర్వహిస్తున్న హర్యానాలో చోటు చేసుకొంటున్న విద్వేష నేరాలపై పూర్తిగా మౌనం వహించడం కూడా నన్ను నిర్ఘాంతపరచింది. ఆయన కాపట్యాన్ని, అజ్ఞానాన్ని గర్హిస్తూ ఒక ట్వీట్ చేశాను. అందులో ఇంకా ఇలా వ్యాఖ్యానించాను: 'సెహ్వాగ్‌కు ఏమైనా కించిత్ మానవత ఉంటే, తన ట్వీట్‌ను తొలగించాలి'.

సెహ్వాగ్‌కు 160 లక్షల మంది ట్విటర్ అనుయాయులు ఉన్నారు. వారిలో అత్యధికులకు ఆయన మాట దైవసత్యం. క్రికెట్ ద్వారా తనకు లభించిన కీర్తిని మతతత్వ ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి ఆయన ఉపయోగించడం నన్ను చాలా విచారగ్రస్తుడిని చేసింది. సెహ్వాగ్ అసాధారణ అపరాధం గురించి సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయిని అప్రమత్తం చేశాను. ఈ విషయమై సర్దేశాయి ట్వీట్ చేసిన తరువాత సెహ్వాగ్ క్షమాపణ చెప్పారు. తన సమాచారం విషయంలో పొరపడ్డానని పేర్కొన్నారు. అయితే చాలా హానికరమైన తన తొలి ట్వీట్‌ను అలానే యథాతథంగా ఉంచివేశారు. రాజ్‌దీప్ మరలా విజ్ఞప్తి చేసిన దరిమిలా సెహ్వాగ్ ఆ ట్వీట్‌ను తొలగించారు.

ఈ పరిణామాల అనంతరం, సెహ్వాగ్ ఆ 'మతతత్వ' ట్వీట్‌ను ఎందుకు పోస్ట్ చేశారు ఎందుకు తొలగించారన్న విషయమై పలు కథనాలను అనేక వెబ్‌సైట్‌లు ప్రచురించాయి. ఆ సుప్రసిద్ధ క్రికెటర్ తన తప్పు తెలుసుకొని సరిదిద్దుకోవడానికి నేను కారణమని కొన్ని కథనాలు నన్ను ప్రశంసించాయి. నిజానికి ఈ ప్రశంసలకు నా కంటే రాజ్‌దీప్ సర్దేశాయే ఎక్కువ అర్హుడు. రాజ్‌దీప్ తండ్రి, సెహ్వాగ్‌లా తన బ్యాటింగ్‌తో భారత్‌కు టెస్ట్ మ్యాచ్‌లలో విజయం సాధించారు. నేను కేవలం వార్తా పత్రికలలో రాసేవాణ్ణి మాత్రమే కాగా రాజ్‌దీప్ టెలివిజన్ పాత్రికేయుడు. ఆయనకు నా కంటే నాలుగు రెట్లు అధికంగా ట్విటర్ అనుయాయులు ఉన్నారు. రాజ్ దీప్ ట్వీట్, ఆ తరువాత ఆయన స్వయంగాచేసిన ఫోన్‌కాల్‌తో స్వాభిప్రాయబద్ధమైన అర్ధ సత్యాలను ప్రజలపై రుద్దడం వల్ల పర్యవసనాలు ఎంత తీవ్రంగా ఉంటాయో సెహ్వాగ్ అర్థం చేసుకొన్నారు.

> **తప్పులు చేయడం మానవ సహజం; సరిదిద్దుకోవడం ప్రజాస్వామ్య పౌరధర్మం. క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తప్పు చేశారు. ఆ తప్పును ఎత్తిచూపినప్పుడు అందులోని అవివేకాన్ని గ్రహించారు. సమాజానికి క్షమాపణ చెప్పారు. హానికరమైన తన ట్వీట్‌ను ఉపసంహరించుకున్నారు. ప్రజాభిప్రాయాన్ని ప్రగాఢంగా ప్రభావితం చేసే ప్రముఖులు విధిగా సెహ్వాగ్ ఆదర్శాన్ని పాటించాలి. అది, వారిని మానవత్వం చూపే ఉదాత్తులుగా ప్రజలకు మరింత ప్రేమాస్పదులను చేస్తుంది.**

ఇరవయో శతాబ్ది తొలినాళ్ళలో సుప్రసిద్ధ బ్రిటిష్ పాత్రికేయుడు, మాంచెస్టర్ గార్డియన్ ఎడిటర్ సి.పి.స్కాట్ పాత్రికేయ ధర్మాన్ని ఇలా నిర్దేశించారు: 'వ్యాఖ్య స్వేచ్ఛగా చేయవచ్చు. అయితే వాస్తవాలు పవిత్రమైనవి'. 21వ శతాబ్దిలో సామాజిక మాధ్యమాలలో ఈ నియమం ప్రతి నానోసెకండ్‌కూ ఉల్లంఘనకు గురవుతూనే ఉన్నది.

వీరేంద్ర సెహ్వాగ్ ట్వీట్ ఉదంతం గురించి ఆలోచిస్తున్నప్పుడు గతంలో ఒక సెలెబ్రిటీ తన రాజకీయ ఎజెండాలో భాగంగా కేవలం అర్ధ సత్యాలు గాక సంపూర్ణ అసత్యాలను ప్రజలపై రుద్దడానికి ప్రయత్నించిన వైనం గుర్తుకొచ్చింది. ఇది, 2002లో గుజరాత్ మతతత్వ అల్లర్ల అనంతరం జరిగింది. ఆ మారణకాండలో హతులయిన వేలాది వ్యక్తుల్లో మాజీ ఎంపి ఎహ్సన్ జాఫ్రి ఒకరు. అహ్మదాబాద్‌లోని తన గృహసముదాయాన్ని హింసాత్మక హిందూ మూకలు చుట్టుముట్టినప్పుడు తమను ఆదుకోవాలని సీనియర్ పోలీస్ అధికారులకు, రాజకీయ వేత్తలకు జాఫ్రి ఫోన్ చేశారు. అయితే ఎవరి నుంచీ ఎటువంటి సహాయమూ అందలేదు. జాఫ్రితో పాటు ఆ గృహ సముదాయంలో నివశిస్తున్న పలువురు మూకల అమానుషత్వానికి అంతమైపోయారు.

ఆ మత మారణకాండ సద్దుమణిగిన తరువాత రచయిత్రి అరుంధతీ రాయ్ ఆ భయానక ఘటనల గురించి ఒక వ్యాసాన్ని రాశారు. జాఫ్రీ సంఘటన గురించి అరుంధతి ఇలా రాశారు: 'జాఫ్రీని చంపివేయడానికి ముందే ఆయన కుమార్తెలను సజీవంగా దహనం చేశారు'. నిజంగా ఏమి జరిగిందన్నది అరుంధతీ రాయ్ ధ్రువీకరించుకోలేదు. ఆమె రాసిన ఈ



విషయాన్ని తొట్టతొలుత ఖండించిన వ్యక్తి జాఫ్రీ సొంత కుమారుడే. 'అరుంధతీ రాయ్ వ్యాసం మాకందరికీ అపరిమిత దిగ్భ్రాంతి కలిగించింది. ఎందుకంటే మా సోదరులు, తోబుట్టువులలో నేను ఒక్కడిని మాత్రమే భారతదేశంలో నివశిస్తున్నాను. మిగతా వారు అమెరికాలో ఉన్నారు' అని జాఫ్రీ కుమారుడు రాశారు.

2002 ఫిబ్రవరి–మార్చిలో గుజరాత్‌లో సంభవించిన ఘటనలు భయానకమైనవి. ఆ మతోన్మాద అల్లర్ల గురించి ఆంగ్ల భాషా పత్రికలలో చాలా విస్తృతంగా (మరెంతో సున్నితంగా) వార్తలు, వార్తా కథనాలు, వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఆ హత్యాకాండకు పాల్పడిన మూకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం, మద్దతు గురించి బలమైన సాక్ష్యాధారాలతో ఆ వార్తలు, వ్యాఖ్యలు బహిర్గతం చేశాయి. ఆ ఘటనల సమయంలో గుజరాత్‌లోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ, ఈ కథనాల మూలంగా ఆత్మరక్షణలో పడింది. అరుంధతీ రాయ్ వ్యాసం వెలువడేంతవరకు బీజేపీ ఆ క్లిష్ట పరిస్థితినెదుర్కొన్నది. అయితే నిజానిజాలను ధ్రువీకరించుకోకుండా రాయ్ రాసిన వ్యాసంతో తన పై వెలువడుతున్న విమర్శలను తిప్పికొట్టేందుకు బీజేపీకి ఒక ఆలంబన లభించింది. వాస్తవాలను 'సృష్టించడం' ద్వారా హిందువులను అప్రతిష్ఠపాలు చేసేందుకు మాత్రమే మీడియా శ్రద్ధ చూపుతున్నదని బీజేపీ ప్రతి దాడి ప్రారంభించింది. 'రచయితలు కాల్పనిక కథనాలను ఉపయోగించుకొని జాతీయవాద శక్తులను రాక్షసశక్తులుగా చిత్రిస్తున్నారని' బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు విమర్శించారు. 'భారతదేశపు ప్రముఖ రచయిత్రులలో ఒకరు పూర్తిగా కల్పించిన సంఘటనల గురించి ప్రస్తావించారని' మరో అధికార ప్రతినిధి ఆరోపించారు. ఆ వ్యాసం ప్రచురితమైన మూడు వారాల అనంతరం అరుంధతీ రాయ్ క్షమాపణ చెప్పారు.

సెహ్వాగ్ అదృష్టవంతుడు. ఆయన తన ఘోర తప్పిదానికి పాల్పడే నాటికి అత్యాధునిక మాధ్యమం ట్విటర్ ఉనికిలోకి వచ్చింది. ఈ కారణంగానే, తప్పును ఎత్తిచూపి వెన్వెంటనే క్షమాపణలు చెప్పడం ద్వారా ఆయన తన పొరపాటును సరిదిద్దుకొనే అవకాశం కల్పించడం సాధ్యమయింది. ఒక రంగంలో ప్రఖ్యాతులై, మరో రంగంలో సంభవించిన సంఘటనలపై సామాజిక మాధ్యమాల ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు ఆరాటపడే సెలెబ్రిటీలు తప్పకుండా సెహ్వాగ్ ఉదంతాన్ని గమనంలోకి తీసుకొని తీరాలి. ముఖ్యంగా ప్రజలను అమితంగా ఆకట్టుకొనే, ప్రభావితం చేసే సినిమా నటీనటులు, క్రికెటర్లు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎందుకంటే వారు అజ్ఞానం వల్ల గానీ లేదా దుర్బుద్ధితో గానీ వాస్తవాలను వక్రీకరించినా, కప్పిపుచ్చినా తమ సొంత పేరు ప్రతిష్ఠలకే కాకుండా భారతీయ సమాజపు సున్నితమైన నిర్మాణానికి కూడా ఎనలేని నష్టం చేసేవారవుతారు. సెహ్వాగ్ ఘటన నుంచి నేర్చుకోవాల్సిన మొదటి పాఠమిది.

ఇక రెండో పాఠం– ఎవరైనా ఒకరు ఇటువంటి తప్పు చేసినప్పుడు తాము ఎలాంటి పరిస్థితుల్లో అలా వ్యవహరించవలసి వచ్చిందో వెల్లడించి క్షమాపణలు చెప్పాలి. సెహ్వాగ్ పాక్షిక క్షమాపణలు చెప్పినప్పుడు నేను ఉపశమనం చెందాను. మరింతగా బలవంతం చేయగా ఆయన తన (నిజాయితీ లేని) ట్వీట్‌ను పూర్తిగా తొలగించారు. తప్పులు చేయడం మానవ సహజం. మన సినిమా నటీనటులు, క్రికెటర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, మరీ ముఖ్యంగా రాజకీయవేత్తలు తరచుగా కాకపోయినాఎప్పుడో ఒకసారి ఘోరమైన తప్పులు చేస్తుండడం కద్దు. మరి చేసిన తప్పును ఎత్తి చూపినప్పుడు క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ వ్యవహరించిన తీరును ఆ ప్రముఖులందరూ తప్పక దృష్టిలో పెట్టుకోవాలి. ఆ సుప్రసిద్ధ ఓపెనింగ్ బ్యాట్స్‌మాన్ వలే తామూ తమ తప్పులను సరిదిద్దుకొనేందుకు వెనుకాడకూడదు. చేసిన తప్పునకు క్షమాపణ చెప్పాలి. అది, వారిని మానవత్వం చూపే ఉదాత్తులుగా ప్రజలకు మరింత ప్రేమాస్పదులను చేస్తుంది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

వర్గీక'రణం'... విరసం!

సామాజిక న్యాయం ఎంత కష్టమో ఎస్సీ వర్గీకరణే ఉదాహరణ. మాదిగ ఉప కులాల ప్రజలు అదనంగా ఏమీ అడగడం లేదు. ఇప్పుడు ఇస్తున్నదాన్నే పంచి పెట్టమని అడుగుతున్నారు. రాజ్యాంగం ఇచ్చిన వాటినే కులాలవారిగా లెక్కగట్టమని కోరుతున్నారు. ప్రజాస్వామ్యం ఊసు లేని పాత సమాజాల్లో కూడా అన్నదమ్ముల మధ్య పంపకాలకు అప్పటికి తగిన పద్ధతులు ఉండేవి. ఊళ్లల్లో పెద్ద మనుషులు ఆ ప్రకారంగా వర్గీకరించి అప్పగించేవాళ్లు. ఇప్పుడు పంపకాలకు సామాజిక న్యాయమనే ప్రజాస్వామిక విలువ గీటురాయి అయింది. ఉద్దేశాలు, ప్రయోజనాలు ఎలా ఉన్నా సామాజిక న్యాయ భావనను ఎవరూ తిరస్కరించలేని కాలం ఇది. కానీ మాదిగ ఉప కులాల వర్గీకరణ ఆకాంక్ష నెరవేరడం లేదు.

ఒక చిన్న సామాజిక న్యాయ ప్రక్రియ అమలు కావడానికి ఈ వ్యవస్థలో ఉన్న అవరోధాలను ఈ ఇరవై నాలుగేళ్ల పోరాటం సూచిస్తోంది. సామాజిక సాంస్కృతిక రంగాల్లో ఒక ప్రజాస్వామిక కదలికకు, ఓట్ల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు కారణమైన ఈ సామాజిక న్యాయ వాతావరణంలో కూడా ఎస్సీ వర్గీకరణ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. సమాజంలో ఇంత పెద్ద ఎత్తున సంఘీభావం కూడగట్టుకున్న ఉద్యమం ఇటీవలి కాలంలో మరొకటి లేదు. ఈ లక్ష్య సాధనలో ఉద్యమం లోపలి సమస్యల సంగతి అటుంచితే ప్రధానంగా పాలకవర్గ వైఖరి వల్లే ఈ సమస్య ఇంత కాలంగా అపరిష్కృతంగా ఉండిపోయింది.

నిజానికి చట్ట పరిధిలో అమలు కావాల్సిన సమస్య ఎందుకు ఇన్ని సవాళ్ల ఎదుర్కొంటున్నది? ఇది మాల మాదిగ కులాల సామాజిక అంతరాన్ని, చట్టపరమైన సమస్యలను మాత్రమే చూపడం లేదు. ఒక చిన్న న్యాయ ప్రక్రియ మీద రాజకీయాల ప్రభావాన్ని కూడా సూచిస్తోంది. ఈ ఇరవై నాలుగేళ్లుగా కమిషన్లు, నివేదికలు.. ఎన్ని ముందుకు వచ్చినా మాదిగ, మాదిగ ఉప కులాలకు, మాల ఉపకులాలకు న్యాయం దక్కలేదు. కుల వ్యవస్థ స్వభావం వల్ల దళిత కులాల మధ్య కూడా ఉన్న అనేక అంతరాలు ఉమ్మడి రిజర్వేషన్లతో మరింత పెరుగుతున్నాయి. అసమాన పంపిణీ మరింత అసమానతలకు దారి తీయడం సహజమే. జనాభా ప్రాతిపదిక మీద రిజర్వేషన్ ఫలాలు అందనప్పుడు సామాజిక అంతరాలకు మిగతా అసమానతలు తోడవుతాయి. అగ్రకులాలతో సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం ఉమ్మడిశక్తిగా తయారు కాదు. అసలు సామాజిక న్యాయ భావనే సంక్షోభంలో పడుతుంది.

అగ్రకుల పాలకవర్గాలు ఈ విషయంలో అనుసరిస్తున్న వైఖరిని బోను ఎక్కించాలి. మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్ల కోసమే వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తున్నారా? నిజంగానే ఆ కులాలకు జరగాల్సిన న్యాయాన్ని ఒక విలువగా భావిస్తున్నారా? రెండోదే నిజమైతే ఇప్పటికి వర్గీకరణ జరిగి ఉండేది. కానీ మన ఓట్ల రాజకీయాలకు ఓట్ల విలువ తెలిసినంతగా న్యాయం విలువ తెలుస్తుందని నమ్మలేం. 'ఓట్లు మావి, సీట్లు మీవా?' అనే మాట అగ్రకుల పాలకవర్గాలకు, దళిత బూర్జువాలకు కూడా ఒక అనివార్యమైన అవగాహన కలిగించింది. ఓటర్లుగా దళితులను పట్టించుకోవాలని, గతంలాగా నడవదని తెలిసి వచ్చింది. కానీ వాళ్ల న్యాయ ఆకాంక్ష పట్ల మాత్రం కనీసంగా పట్టింపు లేదు. అదే ఉంటే ఒక్క మాల కులానికి తప్ప మాల ఉపకులాలకు కూడా మేలు చేసే వర్గీకరణ ఎందుకు పూర్తికాదు. ఈ విషయంలో దళిత బూర్జువాల పాత్రను కూడా గుర్తించాలి. అందరూ అంబేద్కర్‌వాదులే.. కానీ ఆయన చెప్పిన పీడిత కులాల సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం అనే భావనల పట్ల ఖాతరు ఉండదు. సొంత కుల ప్రయోజనాలు తప్ప తమ కులానికంటే సామాజికంగా కింద ఉన్న కులాల అవసరాలను, ఇంత కాలం వాటికి జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించలేనప్పుడు సామాజిక న్యాయానికి చోటు ఎక్కడ? ఈ స్థితి కుల వ్యవస్థలో వేల ఏళ్లుగా గడ్డకట్టి ఉంది. దీని వల్లే అగ్రకుల ప్రయోజనాలు తరతరాలుగా నెరవేరుతున్నాయి. ఈ స్థితి ఉన్నంత వరకు సమానత్వం, న్యాయం, అందరికీ ఒకే విలువ అనేవి అమలులోకి రావడం కష్టం. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఎదుర్కొంటున్న సంక్షోభం ఇదే. రాజకీయ, న్యాయ ప్రక్రియల్లో ఉన్న ఇబ్బందులు, ఆ విషయంలో పాలకవర్గ పద్ధతులు, ప్రయోజనాలతోపాటు సామాజికంగానే ఇది అన్యాయమైన వ్యవస్థ కావడం ముఖ్య కారణం. దళిత, బహుజన కులాల ఓట్లు

> **ఈ విషయంలో దళిత బూర్జువాల పాత్రను కూడా గుర్తించాలి. అందరూ అంబేద్కర్‌వాదులే.. కానీ ఆయన భావనలపట్ల ఖాతరు ఉండదు. సొంత కుల ప్రయోజనాలు తప్ప, తమ కులానికంటే సామాజికంగా కింద ఉన్న కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించలేనప్పుడు సామాజిక న్యాయానికి చోటు ఎక్కడ?**



మెజారిటీ కాబట్టి చట్టసభల్లో సీట్లు సంపాదిస్తే ఇలాంటి న్యాయప్రక్రియలు సునాయాసంగా నడపవచ్చని అనుకోడానికి వీల్లేని అనుభవాలు ఈ పాతిక ముప్పై ఏళ్లలో కలిగాయి.

విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు దళితుల ప్రగతికి కొంతవరకు దోహదపడతాయి. కానీ అంటరానితనం మాత్రం రద్దు కాదు. కనీసం దళిత కులాలు, ఉపకులాల మధ్య సామాజిక అంతరాలు కూడా తొలగిపోవు. ఆ కులాల మధ్య వివక్ష, చిన్న చూపు కూడా పోవు. ఉమ్మడి రిజర్వేషన్‌లో అదనంగా అనుభవిస్తున్న అవకాశాలు పోతాయనే భయంతోనే మాల కులం నుంచి ఎది గిన ఒక బృందం వర్గీకరణకు అడ్డుకుంటోందని సరిపెట్టుకోగలమా? దీని వెనుక మాదిగ, మాదిగ ఉప కులాలపట్ల సామాజిక అసమానత పని చేస్తుండదా? మాల ఉప కులాల ప్రయోజనాలను సహితం బలిపెట్టడానికైనా సిద్ధమై రిజర్వేషన్ల వర్గీకరణను ఈ చిన్న బృందం అడ్డుకోవడం వెనుక ఇది లేదనగలమా?

ఈ అర్థంలో కూడా వర్గీకరణ ఉద్యమం దళితుల మధ్య ఉన్న సామాజిక అసమానతలపై చైతన్యం తీసుకొని వచ్చింది. కాకపోతే వర్గీకరణ డిమాండ్‌కు, దాని పరిష్కారానికి ఉన్న ప్రత్యేకత రీత్యా ఈ ఉద్యమ క్రమంలో మాదిగలపై రాజ్యాంగవాద ప్రభావం పడే అవకాశం ఉంది. కానీ ఒక చిన్న న్యాయం దక్కడానికి సామాజిక, రాజకీయ రూపాల్లో, చట్టపరంగా ఎదురవుతున్న అనుభవాలపట్ల వాళ్లకు అవగాహన ఎందుకు ఉండదు?

■ పాణి

(4వ తేదీ ఆదివారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై హైదరాబాదులో విరసం సదస్సు)

ఎంత దిగజారుడుతనం!

వందేళ్లకు పైబడిన కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఇంకా అధికారంలోకి ఎందుకు రాలేకపోతోంది? కమ్యూనిస్టు పార్టీకన్నా ఎంతో ఆలస్యంగా పురుడు పోసుకున్న జనతా పార్టీ ఒకసారి, బీజేపీ రెండు సార్లు అధికారంలోకి రాగా, కమ్యూనిస్టులు ఎందుకు రోజురోజుకూ అధికార పీఠానికి మరింత దూరమైపోతున్నారు? కమ్యూనిస్టు పార్టీలకు భవిష్యత్తులో కూడా అధికారాన్ని చేపట్టడం సాధ్యం కాదన్న అభిప్రాయం బలపడేందుకు కారణాలేమిటి?

ఏదైనా ఒక పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవాలంటే 1) ప్రభుత్వ వైఫల్యాలను అందిపుచ్చుకునే సమయ స్ఫూర్తి 2) అనుబంధ సంఘాల అంకిత భావం అత్యంత ముఖ్యం. ఇప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు ఇవి రెండూ కొరవడ్డాయి.

కమ్యూనిస్టు పార్టీలకు అనుబంధంగా పనిచేసే అనేక సంఘాలకు సైద్ధాంతిక పునాదిని అందించే 'విరసం' అతి ముఖ్యమైన సంస్థ. ఇంతటి అతి ముఖ్యమైన విరసం కులాల మధ్య వైషమ్యాలను తగ్గించి, ప్రజలను ఐక్యం చేయాల్సింది పోయి, కులాల మధ్య చిచ్చుపెట్టే బాధ్యతను భుజాల కెత్తుకొంటోంది! కుటిల నీతిని ప్రదర్శిస్తోంది. ఎమ్మార్పీఎస్‌కు మద్దతుగా మార్చ్4న హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేస్తుండడమే ఇందుకు నిదర్శనం. 'ఎమ్మార్పీఎస్‌పై రాజ్యనిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుదాం' అంటూ సభకు సంబంధించి విరసం విడుదల చేసిన కరపత్రం ఆ సంస్థ భావదారిద్ర్యాన్ని, దిగజారుడుతనాన్ని ప్రతిబింబిస్తోంది.

> **వర్గీకరణ అంశం చచ్చిన శవం వంటిది. ఆ అంశంపై బతికే మంద కృష్ణ, దాని ఉనికిని అప్పుడప్పుడూ ప్రదర్శించేందుకు ధర్నాలు, బంద్‌లు, సభల్లాంటివి జరుపుతుంటాడు. అలాంటి 'ప్రదర్శన'లపై రాజ్యనిర్బంధమేమిటి? దాన్ని విరసం ఎదుర్కోవడమేమిటి?!**

ఇరవై నాలుగేళ్ల క్రితం మంద ఎలియా ఎలియాస్ మంద కృష్ణ మాదిగ అధ్యక్షునిగా ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం పుష్కలంగా అండదండలు అందించిన విషయం జగమెరిగిన సత్యం. ఆ నాటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, నేటి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి అందించిన తోడ్పాటుతోనే ఎమ్మార్పీఎస్ బలపడింది. తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టం తేవడం, దాన్ని సుప్రీం కోర్టు కొట్టివేయడం జరిగింది.

ఈ 24 ఏళ్లలో మంద కృష్ణ మాదిగ చేసిన పనులు వేసిన వేషాలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకూ, బయటివారికీ ఆశ్చర్యం కలిగించిన సంఘటనలు విరసం వారికి కనిపించినట్టు లేదు. కృష్ణ మాదిగ అంతర్గత అజెండా నచ్చక అనేక మంది ఆయన అనుచరులే ఆయనను చీదరించిన విషయం విరసం వారికి ఎందుకు తెలియదో అర్థం కాదు. కమ్యూనిస్టు పార్టీలు, విరసం చేత మనువాద పార్టీగా ముద్రపడిన బీజేపీకి మంద కృష్ణ ఎందుకు ఆప్తుడయ్యాడో అర్థం చేసుకోలేనంతగా విరసం దిగజారిందా? దండకారణ్యంలో గ్రీన్ హంట్ పేరుతో లక్షలాది ఆదివాసీ బతుకులను నాశనం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాలను నిత్యం దుమ్మెత్తి పోసే విరసం నేతలకు, అదే బీజేపీ నేతలకు కృష్ణమాదిగ చేస్తున్న పాదసేవ కనిపించదా? "వెంకయ్యనాయుడే మాదిగలకు అంబేద్కర్, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అట్టర్ ఫెయిల్యూర్" అంటూ బహిరంగసభల్లో కృష్ణమాదిగ గొంతుచించుకొని చేసిన నినాదాలు వినపడనంత చెవిటిదయ్యిందా విరసం? విప్లవోద్యమంలో మాదిగల త్యాగాలను కీర్తించిన విరసం, మాలల రక్తార్పణలు కనిపించనంత గుడ్డిదైపోయిందా? లేక మాలల రక్తం ఎర్రగా లేదా? రాబోయే రోజులలో రక్తార్పణ విషయంలోనూ మాల–మాదిగల మధ్య వర్గీకరణ చేస్తారా? శ్రీకాకుళ సాయుధ పోరాటం పురుడుపోసుకున్న లక్ష్మీపేట గ్రామంలో మాలల ఊచకోత జరిగినపుడు కనీసం కరపత్రం కూడా వేయని విరసం, మంథనిలో మాదిగ యువకుడు మధుకర్ దారుణంగా హత్య చేయబడ్డప్పుడు మాటలు రాని విరసం, ఇప్పుడు మంద కృష్ణకు మద్దతివ్వడంలో మాత్రం ముందుంటున్న దెందుకు? 1994నుంచి ఎమ్మార్పీఎస్‌తో కలిసి పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న విరసం నేతలకు మంద కృష్ణ తప్పిదాలు కనిపించలేదా? లేక ఆ తప్పిదాలలో వారికీ భాగస్వామ్యముందా?

నవంబర్ 1, 1997న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్సీ) విడుదల చేసిన కరపత్రంలో ఉన్న అవగాహనను నేడు విరసం విస్మరించడం శోచనీయం. పౌరహక్కుల సంఘం మాల–మాదిగల ఘర్షణ నివారణకు కృషి చేద్దామంటే.. నేడు విరసం వారు రాజ్య నిర్బంధం పేరుతో ఒక నాయకుడిని వెనకేసుకువస్తూ అంతిమంగా రెండు అణగారిన కులాల మధ్య వైరానికి ఆజ్యం పోస్తుండడం బాధాకరం. మంద కృష్ణ ఒక మోసగాడని, వంచకుడని, అవకాశవాదని, స్వార్థపరుడని, దోపిడీదారుల ఏజెంటని, ఎమ్మార్పీఎస్ ముసుగులో ఆస్తులు కూడబెట్టుకున్నాడనీ అదే సంస్థ నుంచి వచ్చిన వంగపల్లి శ్రీనివాస్ తూలనాడిన విషయం విరసం నేతలకు తెలియదా? రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రలో మాలలు, తెలంగాణలో మాదిగలు ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారన్న వాస్తవం కూడా విరసం మేధావులు గుర్తించలేరా?

అధికార పార్టీల కన్నుసన్నలలో మెలిగి, తిరిగి ఆ పార్టీలనే బ్లాక్‌మెయిల్ చేసే ఎమ్మార్పీఎస్‌పై రాజ్య నిర్బంధం గురించి మొసలి కన్నీరు కార్చుతున్న విరసం నేతలకు, అసలు రాజ్యమే ఎమ్మార్పీఎస్‌ను సృష్టించిందన్న సత్యం తలకెక్కకపోవడం ఆశ్చర్యం. 24 సంవత్సరాల కాలంలో టీడీపీ, కాంగ్రెస్, తెరాస ప్రభుత్వాలు ఎమ్మార్పీఎస్‌పై నిషేధం విధించిన దాఖలాలే లేనపుడు, ఎమ్మార్పీఎస్‌పై నిర్బంధ వ్యతిరేక ఉద్యమమంటూ వీధికెక్కడం విరసం నేతల అవివేకమా? ఆత్మద్రోహమా? ఇటీవల మరణించిన భారతిని పోలీసులు కొట్టలేదు, జైల్లో నిర్బంధించలేదు, ఆమె ఇంటిపై దాడి చేయలేదు... అనారోగ్యంతో చనిపోయిన ఆమె మరణాన్ని వీరమరణంగా స్తుతించడం విరసం దిగజారుడుతనానికి నిదర్శనం కాదా?

తెలంగాణలో వర్గీకరణ అంశం చచ్చిన శవం వంటిది. ఆ అంశంపై బతికే మంద కృష్ణ, దాని ఉనికిని అప్పుడప్పుడూ ప్రదర్శించేందుకు ధర్నాలు, బంద్‌లు, సభల్లాంటివి జరుపుతుంటాడు. అలాంటి 'ప్రదర్శన'లపై రాజ్యనిర్బంధ మేమిటి? దాన్ని విరసం ఎదుర్కోవడమేమిటి?!

■ మామిడి నారాయణ

స్పైసెస్ బోర్డులో తెలంగాణకు ప్రత్యేక సెల్

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డు కోసం కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభు రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు లేఖ రాశారు. స్పైసెస్ బోర్డు కార్యాలయంలో పసుపు కోసం తెలంగాణకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పసుపుతోపాటు ఇతర సుగంధద్రవ్యాల పంటల ఎగుమతులు, నాణ్యతాప్రమాణాలను స్పైసెస్ బోర్డు పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ పథకం కింద తెలంగాణకు ప్రత్యేకంగా ఒక స్పైసెస్ పార్కును మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి తన లేఖలో తెలిపారు. మార్కెటింగ్, పరిశోధనల ద్వారా పసుపు పంటను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన గుర్తుచేశారు.

స్పెషల్ కోర్టుకు 30 పోస్టులు మంజూరు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేల క్రిమినల్ కేసులను విచారించడానికి ఏర్పాటు చేస్తున్న స్పెషల్ కోర్టుకు ప్రభుత్వం 30 పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శివశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కోర్టు ఏర్పాటుకు సంబంధించి సర్కారు ఇప్పటికే జీఓ జారీ చేసింది. కోర్టుకు జడ్జి పోస్టుతోపాటు ఇతర కేటగిరీల పోస్టులను మంజూరు చేయాలంటూ హోంశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు పోస్టులు మంజూరయ్యాయి. ఒక జిల్లా జడ్జి, మరో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులతో పాటు 28 ఇతర పోస్టులను మంజూరు చేసింది.

నేడు టీఆర్టీ స్కూల్ అసిస్టెంట్లకు రాతపరీక్ష

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్టులో భాగంగా శనివారం స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళ్ మాధ్యమంలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. శుక్రవారం ఉదయం ఎస్‌జీటీ పోస్టుల రాత పరీక్షకు 94.6 శాతం, మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాత పరీక్షకు 60.4 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది.

తెలుగు వర్సిటీ ప్రవేశానికి గడువు పొడిగింపు

రవీంద్రభారతి/హైదరాబాద్, మార్చి 2 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ద్వారా ప్రవేశాలకు గడువును పొడగిస్తున్నట్లు రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రూ.300 రుసుంతో నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మమ్మల్ని ఆదుకోండి: 1998 డీఎస్సీ అభ్యర్థులు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగాలిస్తామన్న హామీని సీఎం కేసీఆర్ నిజం చేసి.. తమను ఆదుకోవాలని 1998 డీఎస్సీ అభ్యర్థులు కోరారు. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి ఉద్యోగాలిస్తామని సీఎం కేసీఆర్ రెండేళ్ల క్రితం హామీ ఇచ్చారని, దాన్ని కచ్చితంగా నెరవేరుస్తారని డీఎస్సీ సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు..

11న లక్ష కుటుంబాలతో దీక్ష: టీసీపీఎస్ఈఏ

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని(సీపీఎస్) రద్దు చేసి ఓపీఎస్(పాత పింఛను విధానం)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11 వ తేదీన లక్ష కుటుంబాలతో నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పుప్పాల కృష్ణకుమార్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో దీక్ష చేపట్టనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

కొనసాగుతున్న సింగరేణి థర్మల్ రికార్డులు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉత్పాదనలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం రికార్డుల పరంపర కొనసాగుతూనే ఉంది. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఉన్న ప్లాంట్ ఫిబ్రవరి నెలలో 93.59 పీఎల్ఎఫ్ (విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం) సాధించింది. డిసెంబరు నెల దాకా 90.19 పీఎల్ఎఫ్ సాధించి.. దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో సగటు స్టేషన్ పీఎల్ఎఫ్ 90.70 శాతం ఉండటంతో దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల జాబితాలో సింగరేణి ఐదో స్థానంలో ఉంది. ఇదే పీఎల్ఎఫ్‌ను కొనసాగించాలని సింగరేణి సీఎండీ శ్రీధర్ పిలుపునిచ్చారు.

జర్మనీకి విత్తనాల ఎగుమతి: పార్థసారథి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జర్మనీకి చెందిన విత్తన నిపుణుల బృందం శుక్రవారం తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయాన్ని సందర్శించింది. సంస్థ కార్యాలయంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథిని వారు కలిశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ గతేడాది ఈజిప్టు, సూడాన్ తదితర దేశాలకు 17 వందల క్వింటాళ్ల విత్తనాలు ఎగుమతి చేశామని, జర్మనీకీ ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికి కావాల్సిన యూరోపియన్ ఈక్వలెన్స్ అధికారాలనూ త్వరలో సాధిస్తామన్నారు.

బీట్ ఆఫీసర్ ఫలితాలు ఆపండి : హైకోర్టు

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నిరుడు అక్టోబరులో నిర్వహించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన ఫలితాలను ఎనిమిది వారాలపాటు ప్రకటించొద్దని హైకోర్టు టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ సైనికోద్యోగి ఆర్.రఘుపతిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ పిటిషన్‌పై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను జడ్జి ఆదేశించారు.

హైకోర్టులో రెండోరోజూ నిలిచిన సేవలు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల విధుల బహిష్కరణ పిలుపుతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో వరుసగా రెండోరోజూ న్యాయసేవలు స్తంభించిపోయాయి. కోర్టు ప్రారంభంలో విధులకు హాజరైన కొంతమంది న్యాయవాదులకు మిగిలిన లాయర్లు నచ్చజెప్పి బయటకు తీసుకురావడంతో కేసుల విచారణ నిలిచిపోయింది. ఒకటి రెండు కోర్టుల్లో అత్యవసర కేసుల విచారణ మాత్రమే జరిగింది.

‘కంట్రీ క్లబ్’ మోసగాడికి మూడేళ్ల జైలు



హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కంట్రీక్లబ్‌లో సభ్యత్వం పేరుతో ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1.1 లక్షల జరిమానా విధించింది. ముంబైకి చెందిన సర్వేష్ నిగం బేగంపేట్ కంట్రీ క్లబ్‌లో ప్లాటినం, గోల్డ్, సిల్వర్ సభ్యత్వం పేరుతో ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు వివిధ సెక్షన్లకింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1.1 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.



గన్‌పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం సంస్థల నాయకులు

సిరియాపై దాడులను నిలిపివేయాలని ధర్నా

నాంపల్లి/హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సిరియాపై అమెరికా, రష్యా చేస్తున్న సైనిక దాడులను నిలిపివేయాలని పలు ముస్లిం సంస్థలు డిమాండ్ చేశాయి. అగ్రరాజ్యాలు బాంబు దాడులతో రక్తపాతాన్ని సృష్టిస్తూ అమాయక ముస్లింలను పొట్టనబెట్టుకుంటున్నాయంటూ నిరసన తెలిపాయి. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ అధ్యక్షుడు సలావుల్లా ఖాన్ సారథ్యంలో ముస్లింల సంస్థల ప్రతినిధులు శుక్రవారం గన్‌పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు.

హోలీ.. పిడిగుద్దుల కేళీ

బోధన్, మార్చి 2: ఆ మూలకో స్తంభం.. ఈ మూలకో స్తంభం.. వాటికి మధ్య ఓ గట్టితాడు. తాడుకు అటూ ఇటూ జనం. కేరింతల నడుమ ఒకరికొకరు పిడికిళ్లతో గుద్దుకోవడం. గెలుపోటములు ఉండవు! అంతా ఉత్సాహమే.. రంగుల ఉత్సవమే!! హోలీ సందర్భంగా ఏటా నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హున్స గ్రామంలో నిర్వహించే ‘పిడిగుద్దులాట’ ఇది. శుక్రవారం ఈ కేళీ ఆద్యంతం ఉత్సాహంగా, ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులంతా హోలీ జరుపుకొన్నారు. సాయంత్రంకాగానే గ్రామపెద్దల ఇళ్ల నుంచి బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. ఆ వెంటనే ప్రధాన కూడలి వద్ద పిడిగుద్దులాట ప్రారంభమైంది. రెండు స్తంభాలకు తాళ్లను కట్టి.. పురుషులంతా తాడుకు ఇరువైపులా రెండు గ్రూపులుగా ఏర్పడి పిడికిళ్లతో గుద్దుకున్నారు. సుమారు 20 నిమిషాలపాటు సాగిన ఈ ఆటలో కేరింతల నడుమ ఒకరికొకరు తామే గెలిచినట్లు ప్రకటించుకొన్నారు. ఆట ముగిశాక కామదహనం బూడిదను ఒంటికి రాసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు. బోధన్ రూరల్ సీఐ గోవర్ధనగిరి, ఎస్ఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



నిజామాబాద్ జిల్లా హున్సలో పిడిగుద్దులాట





నల్లగొండలోని ఓ థియేటర్‌లో క్యారమ్స్ ఆడుతున్న సిబ్బంది,(ఇన్‌సెట్లో) హైదరాబాద్‌లో మూతబడిన ఎర్రగడ్డలోని గోకుల్ థియేటర్

కదలని ‘బొమ్మ’

రాష్ట్ర వ్యాప్తంగా సినిమా థియేటర్ల బంద్

- వీకెండ్‌లో వినోదానికి దూరమైన ప్రేక్షకులు
- క్యాంటీన్లు, చిరు వ్యాపారాలపై ప్రభావం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో సినిమా హాళ్లన్నీ మూతబడ్డాయి. శుక్రవారం ఏ థియేటర్‌లోనూ బొమ్మ పడలేదు. చలనచిత్ర పరిశ్రమకు అత్యంత భారంగా తయారైన డిజిటల్ ప్రొవైడర్ల చార్జీలకు వ్యతిరేకంగా సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ జేఏసీ నిర్ణయం మేరకు థియేటర్ల యజమానులు బంద్ పాటించారు. వివిధ జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలోనూ సినిమా ప్రదర్శనలను నిలిపివేశారు. దీంతో వారాంతపు సెలవుల్లో వినోదానికి ప్రేక్షకులు దూరమయ్యారు. క్రాస్ రోడ్స్‌లో ట్రాఫిక్ రద్దీ లేకుండా పోయింది. బంద్ ప్రభావం సినీ వ్యాపార రంగంతో పాటు ఇతర రంగాలపైనా పడింది. థియేటర్లలో పని చేసే సిబ్బంది, వాటి ప్రాంగణాల్లో చిరు వ్యాపారాలు నిర్వహించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆటోవాలాలకు గిరాకీ లేక ఖాళీగా ఉండిపోయారు. థియేటర్ల సమీపంలో నిత్యం సందడిగా కనిపించే హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు వెలవెలబోయాయి. వారం రోజులపాటు బంద్ పాటిస్తామని జేఏసీ ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రభావం తీవ్రంగానే ఉండే అవకాశం కనిపిస్తోంది. కొంపల్లిలోని సినీ ప్లానెట్‌లో పనిచేసే సిబ్బంది థియేటర్ ఆవరణలో క్రికెట్ ఆడుతూ గడిపారు. నల్లగొండలోని ఓ థియేటర్‌లో సిబ్బంది క్యారమ్ బోర్డు ఆడారు. మరోవైపు ప్రతి శుక్రవారం కొత్త సినిమాలు విడుదలయ్యే నేపథ్యంలో సినిమా హాళ్ల బంద్ చేపట్టడంతో సినీ అభిమానులకు నిరాశ తప్పలేదు. చాలా చోట్ల ప్రేక్షకులు థియేటర్ల వద్దకు వచ్చి నిరాశగా వెనుదిరిగారు. అయితే థియేటర్లను మూసివేయడం తమకు ఆర్థికంగా నష్టమేనని, ఆదాయం కోల్పోవడంతోపాటు సిబ్బందికి వేతనాలు మాత్రం చెల్లించాల్సిందేనని యాజమాన్యాలు పేర్కొన్నాయి. సర్వీస్ ప్రొవైడర్లు చార్జీలు తగ్గిస్తే జేఏసీ నిర్ణయం మేరకు తిరిగి ప్రదర్శనలు కొనసాగిస్తామని తెలిపాయి. కాగా థియేటర్ల బంద్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మద్దతు ప్రకటించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

పాలీహౌస్‌కు బదులు నెట్‌హౌస్!

- 75 శాతం సబ్సిడీతో ప్రోత్సాహం
- ఉద్యానవనశాఖ నిర్ణయం

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పాలీహౌస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో నెట్‌హౌస్‌లను ప్రోత్సహించాలని ఉద్యానవనశాఖ నిర్ణయించింది. వచ్చే సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 300 ఎకరాల విస్తీర్ణంలో నెట్‌హౌస్‌లను మంజూరు చేయనుంది. వీటిని 75 శాతం సబ్సిడీపై అందించనుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యానవనశాఖ ద్వారా పాలీహౌస్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. 75 శాతం సబ్సిడీపైన ఈ పథకాన్ని గత మూడేళ్ల నుంచి అమలు చేస్తోంది. పాలీహౌస్ ఏర్పాటు చాలా ఖర్చుతో కూడుకున్నది కావడం.. అందులో 75 శాతం సబ్సిడీ ప్రభుత్వమే భరించాల్సి రావడంతో ఇంతవరకు కేవలం 1150 ఎకరాల్లో మాత్రమే ఏర్పాటైంది. సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.199 కోట్లు చెల్లించింది. ఎకరా విస్తీర్ణంలో పాలీహౌస్ నిర్మాణానికి ప్లాంట్ మెటీరియల్ రకాన్ని బట్టి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ ప్రభుత్వం భరించాల్సి వస్తోంది. రైతు తన వాటా 25 శాతం కింద రూ.10 లక్షల నుంచి రూ. 14 లక్షల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత పెద్ద ఎత్తున సర్కారు సబ్సిడీని భరిస్తున్నా పెద్ద రైతులు, రిటైరైన ఉన్నతాధికారులకే పథకం దక్కుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నెట్‌హౌస్‌లను ప్రోత్సహించేందుకు ఉద్యానవనశాఖ కసరత్తు చేస్తోంది. ఎకరా విస్తీర్ణంలో నెట్‌హౌస్ ఏర్పాటుకు రూ.19.35 లక్షల వ్యయం కానుంది. ఇందులో 75 శాతం సబ్సిడీ అంటే ప్రభుత్వం రూ.14.51 లక్షలను భరిస్తుంది. అంటే.. పాలీహౌస్‌తో పోలిస్తే రైతుపైనా చాలా తక్కువ భారం పడుతుంది. నెట్‌హౌస్ డిజైన్‌ను తెలంగాణ వాతావరణం, రైతుల ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా మారుస్తుండడంతో యూనిట్ ధర మరింత తగ్గే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 300 ఎకరాల మేరకు నెట్‌హౌస్‌ల నిర్మాణానికి ఉద్యానవనశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికి రూ. 48 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

వెబ్‌సైట్లో ఎంసెట్ మాక్‌టెస్ట్

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పరీక్షపై ఒకింత కంగారు, అవగాహనలేమితో సతమతమవుతున్న ఎంసెట్ విద్యార్థులకు గొప్ప ఊరట! ఎంసెట్ మాక్‌టెస్టులను అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ ఏడాది నుంచి ఎంసెట్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కోసం ఈ చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు ఎవరైనాసరే ఎంసెట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మాక్ టెస్టును రాయవచ్చు. మార్కులు, ప్రశ్నలు, సమయం పరంగా తుది పరీక్ష స్థాయిలోనే ఈ మాక్‌టెస్టును నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు, అగ్రికల్చర్ స్ట్రీమ్‌కు వేర్వేరుగా మాక్‌టెస్టులను అందుబాటులో ఉంచారు. ఆయా సబ్జెక్టుల విద్యార్థులు సులువుగా ప్రాక్టీస్ చేసుకోవచ్చు. ప్రాక్టీస్ చేయాలనుకునే విద్యార్థి ట్ఛ్చఝఛ్ఛ్టి.్టట్చ్ట్ఛ.జీ వెబ్‌సైట్లోకి వెళ్లి మాక్‌టెస్ట్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు ఇంజనీరింగ్ స్ట్రీమ్, అగ్రికల్చర్ స్ట్రీమ్ ఆప్షన్లను చూపిస్తుంది. అందులో ఏ పరీక్ష రాయాలో దానిపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ఆప్షన్ చూపిస్తుంది. ఎలాంటి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేకుండానే నేరుగా లాగిన్ బటన్ నొక్కినా మాక్ టెస్ట్ పేపర్ ఓపెన్ అవుతుంది. మాక్‌టెస్ట్‌లో క్యాలిక్యులేటర్‌ను ఉపయోగించుకునే అవకాశం కల్పించడం గమనార్హం. కుడి పక్క పైభాగంలో క్యాలిక్యులేటర్ సింబల్‌ను నొక్కి ఏవైనా లెక్కలు చేసుకోవచ్చు. మాక్‌టెస్ట్ పేజీలో విద్యార్థి ఫోటో, హాల్‌టికెట్ నంబరు తదితరల వివరాలు పొందుపరుస్తారు. మొత్తం 160 ప్రశ్నలకు గానూ 180 నిమిషాల సమయం కేటాయిస్తారు. సమయం పూర్తికాగానే దానంతట అదే క్లోజ్ అవుతుంది.

నేషనల్ పూల్‌లో చేరడం విద్యార్థులకు లాభమే



- నీట్ అడ్మిషన్ల విషయంలో మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్య పీజీ అడ్మిషన్లలో మొదటిసారి తెలంగాణ నేషనల్ పూల్‌లో చేరడం వల్ల రాష్ట్రానికి చెందిన 8 వేల మంది విద్యార్థులకు అవకాశం లభిస్తుందని వైద్య ఆరోగ్యశాఖమంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. జాగ్రత్తగా పీజీ అడ్మిషన్లు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. శుక్రవారం పీజీ నీట్ అడ్మిషన్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. నేషనల్ పూల్‌లో చేరినందున 50 శాతం సీట్లను వదలాల్సి వచ్చినా.. ఇతర ప్రాంతాల్లో రాష్ట్ర విద్యార్థులు అడ్మిషన్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. మార్చి 12 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన అన్ని విషయాలపై అన్నిశాఖల విభాగాధిపతులతో వివిధ అంశాలపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో రూ.20 కోట్లతో 100 పడకల ఆస్పత్రి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈమేరకు కొత్త ఆస్పత్రి భవన నమూనాలను ఆయన పరిశీలించారు. కొత్తగా నిర్మించబోతున్న ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

రైతు కార్పొరేషన్‌కు కేంద్రం పచ్చజెండా

- రిజిస్ట్రేషన్ ఫీజు కింద కోటిన్నర చెల్లింపు!
- బైలాస్ రిజిస్ట్రేషన్‌తో కార్పొరేషన్ ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి రిజిస్ట్రేషన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపింది. రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.1.52 కోట్ల మేరకు చెల్లించే ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. ఈ మొత్తాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రానికి ప్రభుత్వం చెల్లించనుంది. తెలంగాణ రైతు సమన్వయ సమితి పేరిట కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో ఫిబ్రవరి 23న వ్యవసాయశాఖ.. కంపెనీల చట్టం కింద రిజిస్ట్రేషన్ కోసం కేంద్రానికి దరఖాస్తు చేసింది. పరిశీలించిన కేంద్రం.. కార్పొరేషన్ రిజిస్ట్రేషన్‌కు అంగీకారం తెలుపుతూ రాష్ట్ర ప్రభుతానికి గురువారం లేఖ పంపింది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1.52 కోట్ల చెల్లింపుతో కార్పొరేషన్ రిజిస్ట్రేషనూ పూర్తి కానుంది. కాగా.. కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత దాని బైలాస్‌ను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కార్పొరేషన్‌లో ఉన్న 15 మంది డైరెక్టర్లూ సమావేశమై.. రిజిస్టర్ అయిన బైలాస్ ప్రకారం సంస్థకు చైర్మన్ పోస్టును ఏర్పాటు చేయడం, డైరెక్టర్ల సంఖ్యను పెంచడం వంటివి చేపట్టాల్సి ఉంది. అనంతరం కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి నియామకం జరుగుతుంది. ఈ ప్రక్రియకు మరో వారం సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తా సుఖేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకార కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరు కానున్నట్టు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ చైర్మన్ కార్యాలయాన్ని ఇప్పటికే వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కమిషనరేట్‌లో తగిన ఏర్పాట్లకూ ముందస్తు కసరత్తు జరుగుతోంది.



తండ్రికి తలకొరివి పెట్టేందుకు వెళుతున్న విద్యార్థి హేమసుమంత్

20 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసులు

- నిమిషం నిబంధనతో తప్పని ఇబ్బందులు
- ప్రశాంతంగా ఇంటర్ ‘ద్వితీయ’ పరీక్ష

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షల్లో మొదటి రోజు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోనే 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. నిమిషం ఆలస్యం నిబంధనతో ఖమ్మంలో ఇద్దరిని, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒకరు పరీక్ష రాయలేకపోయారు. 18,089 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టి.. పరీక్షకు !

తండ్రి మృతితో తల్లడిల్లిన తనయుడు తలకొరివి పెట్టిన తర్వాత ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరైన సంఘటన ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలంలో జరిగింది. మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కునారపు హేమసుమంత్ తండ్రి లక్ష్మణ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో కన్నీరుమున్నీరవుతూ శుక్రవారం ఉదయం తలకొరివి పెట్టాడు. దుఃఖాన్ని దిగమింగుకుని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు హాజరయ్యాడు.

కవి, సినిమా సమీక్షకుడు దేవరాజు రవి కన్నుమూత



మేడిపల్లి/హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నవలా రచయిత, కవి, సినిమా సమీక్షకుడు దేవరాజు రవి (81) కన్నుమూశారు. 1938 ఏప్రిల్ 5న ఒడిసా రాష్ట్రం బరహంపూర్‌లో జన్మించిన రవి.. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ఆరోగ్య శాఖలో ఉద్యోగం చేశారు. ఈ క్రమంలో రచయితగా గుర్తింపు పొందారు. కాగా.. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శుక్రవారం మేడిపల్లి గ్రీన్‌లాండ్స్ కాలనీలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన 12 నవలలు, రెండు వందలకు పైగా కథలు, 3 కవితా సంకలనాలు, రెండు కథాసంకలనాలు ఇంకా వివిధ విషయాలపై అనేక వ్యాసాలు రచించారు. సుమారు 1247 తెలుగు సినిమాలకు సమీక్షలు రాశారు. దేవరాజు రవికి భార్య సీత, ఇద్దరు కుమారులు శ్రీనివాసరావు, బాలకృష్ణ ఉన్నారు. రవి పార్థివదేహానికి శనివారం నగరంలోని అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

‘క్రీడా కోటా.. అక్రమాల పుట్ట’పై స్పందించిన సీఎంవో

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడా కోటాలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ జరిపిన ద్విసభ్య కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందింది. ‘క్రీడా కోటా...అక్రమాల పుట్ట’ పేరుతో ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చిన కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) స్పందించడంతో కమిటీ ఆగమేఘాల మీద తన నివేదికను శుక్రవారం అందజేసింది. క్రీడా కోటాలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సిఫార్సులో చోటు చేసుకున్న అవకతవకలపై అంతకుముందు ప్రాథమిక నివేదిక కూడా ప్రభుత్వానికి అందిన విషయం తెలిసిందే. పని ఒత్తిడి, సమయాభావం వల్ల ఒక విద్యార్థి సిఫార్సు విషయంలో ‘అథారిటీ’ పొరపాటు చేసిందని ప్రాథమిక నివేదిక తేల్చింది. అదే విషయాన్ని ఈ కమిటీ కూడా తేల్చినట్లు సమాచారం. అయితే ఈ విద్యార్థి ఇప్పటికే నాన్ లోకల్ కోటాలో వైద్య సీటును పొందినట్లు చెబుతున్నారు. విలు విద్యలో తన ప్రతిభను ప్రదర్శించిన మరో విద్యార్థి అంశాన్ని కూడా కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది. ఈ విద్యార్థి సిఫార్సు విషయంలోనూ పొరపాటు జరిగిందని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దీంతో సదరు విద్యార్థికి వైద్య సీటు అవకాశం దక్కొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరితో పాటు మరో ముగ్గురు విద్యార్థుల విషయాన్నీ కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది. వీరి విషయంలో కూడా సమీక్ష జరగాలని పేర్కొంది. అయితే పొరపాట్లకు బాధ్యులు ఎవరు? వారిపై చర్యలేవి? అనే విషయాలతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పారదర్శక విధానం అవసరమన్న విషయమై కమిటీ చేసిన సూచనలు వెల్లడి కావాల్సి ఉంది.

తెలంగాణ భవన్‌కు బాంబు బెదిరింపు

బంజారాహిల్స్/హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. బంజారాహిల్స్‌లోని తెలంగాణభవన్‌కు శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో భద్రతా సిబ్బంది ల్యాండ్ లైన్‌కు ఫోన్ కాల్ వచ్చింది. భవన్‌లో బాంబు పెట్టామని, మరికాసేపట్లో పేలుతుందని చెప్పి అవతలి వ్యక్తి ఫోన్ పెట్టేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది విషయాన్ని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని జాగిలాలు, బాంబు డిస్పోసర్లతో అణువణువూ గాలించారు. బాంబు లేదని తేల్చి చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఫోన్ చేసిన వ్యక్తి సెల్ నంబర్ ఆధారంగా ఆదిలాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా, ఫోన్ చేసిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



సీఎస్ ఎస్‌కే జోషికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నెలాఖరు దాకా కందులు కొనాలి

» సీఎస్‌కు భారతీయ కిసాన్ మోర్చా వినతి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కందులను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు దాకా కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ మోర్చా కోరింది. ఈ మేరకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషికి వినతిపత్రం సమర్పించారు.

పాలమూరులో నేడు సర్పంచ్‌ల సమ్మేళనం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల ప్రాంతీయ సమ్మేళనం శనివారం మహబూబ్‌నగర్‌లో జరగనుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సమ్మేళనానికి హాజరుకానున్నారు. జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూలు, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల సర్పంచ్‌లలో ఎంపిక చేసినవారు పాల్గొననున్నారు.

నేడు ఉత్తమ్ ఫేస్‌బుక్ లైవ్



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మొదటి దశ బస్సు యాత్రకు ముందు 'ఫేస్‌బుక్ లైవ్'లో ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులోకి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం మరోసారి 'లైవ్'లోకి రానున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 'నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి' అనే ఫేస్‌బుక్ పేజీతోపాటు, తెలంగాణ కాంగ్రెస్ పేజీలో కూడా ఆయన లైవ్ ప్రసారం అవుతుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. కాగా, బస్సు యాత్ర తదుపరి షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. 4వ తేదీన బోధన్, నిజామాబాద్, 5న ఆర్మూర్, బాల్కొండ, 6న నిర్మల్, మెట్‌పల్లి, 7న సిరిసిల్ల, మానకొండూరు, 8న హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగుతుందని వివరించారు.

14న గుంటూరులో జనసేన ఆవిర్భావ సభ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ మహాసభ ఈ నెల 14న ఏపీలోని గుంటూరులో జరగనుంది. నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న 35 ఎకరాల విశాలమైన స్థలంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. నిర్వహణ కమిటీలు కూడా వేసినట్లు తెలిపింది. సభ మధ్యాహ్నం 3 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమవుతుంది. ఈ మహా సభకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా అభిమానులు వస్తారని పేర్కొంది.

బీసీలకు 60-65 సీట్లు ఇస్తాం: బీఎల్ఎఫ్

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు 60 నుంచి 65 సీట్లను కేటాయిస్తామని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) నేతలు ప్రకటించారు. కనీసం 60 సీట్లను బీసీలకు ఇచ్చేందుకు కాంగ్రెస్, టీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నాయా? అని సవాల్ విసిరారు. శుక్రవారం ఇక్కడ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బీఎల్ఎఫ్ నేతలు నాగయ్య, రాములు, మాస్టార్జీ తదితరులతో కలిసి ఫ్రంట్ కన్వీనర్ నల్లా సూర్యప్రకాశ్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రజలను మోసం చేస్తున్నియనీ, అవి నాణేనికి బొమ్మబొరుసులాంటివని విమర్శించారు.

10న 'మిలియన్ మార్చ్' వార్షికోత్సవం: చాడ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మలివిడత తెలంగాణ ఉద్యమం సందర్భంగా హైదరాబాద్‌లో చేపట్టిన 'మిలియన్ మార్చ్'ను గుర్తుచేసుకుంటూ ఈ నెల 10న వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించేందుకు పలు పార్టీలు, ప్రజాసంఘాలతో శనివారం మఖ్దూం భవన్‌లో సమావేశమవుతామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న కుల సంఘాల ప్రతినిధులు

బీసీల రిజర్వేషన్ల కోసం ఉద్యమిద్దాం: జాజుల

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని, చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం బీసీ కుల సంఘాలన్నీ కలిసి జేఏసీగా ఏర్పడాల్సిన అవసరం ఉందని ఆ సంఘం తెలంగాణ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీసీ కుల సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశానికి 20 కుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వచ్చే బడ్జెట్‌లో బీసీలు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి రూ. 20 వేల కోట్ల నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల అభివృద్ధికి జనవరి 3న బీసీ మంత్రులు తయారు చేసిన నివేదికను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

క్షమాపణ చెప్పలేదేం? : ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ మాట దొర్లినట్లు టీఆర్ఎస్ ముఖ్యనేతలు చెబుతున్నారని, అదే నిజమైతే సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఎందుకు క్షమాపణ చెప్పలేదని బీజేపీ జాతీయ నాయకులు ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాట దొర్లింది అని మంత్రి కేటీఆర్, చిన్న పొరపాటుపై బీజేపీ రాద్ధాంతంచేస్తోంది.. అని ఆయన కూతురు అంటున్నారు.. అదేనిజమైతే మరుసటి రోజు ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన సభలో కేసీఆర్ తన మాటలకు కట్టుబడి ఉన్నట్లు ఎందుకు చెప్పారని ఇంద్రసేనా నిలదీశారు. కేసీఆర్ ఘరానా మోసగాడని, విశ్వాసఘాతకుడని, కన్యాశుల్కంలో గిరీశంను మించినోడని మండిపడ్డారు.

గాంధీ భవన్‌ను ముట్టడిస్తాం: గంగపుత్రులు

సోమాజిగూడ/హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఓట్ల కోసమే ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారని రాష్ట్ర గంగ పుత్రుల సంఘం అధ్యక్షుడు పూస బాలకిషన్ ఆరోపించారు. సంగారెడ్డి బస్సు యాత్రలో చేసిన ప్రకటనను ఉపసంహరించుకోకుంటే గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడిన ఆయన.. ఆర్థికంగా బలమైన ముదిరాజ్‌లను బీసీ-ఏలో ఎలా చేర్చుతారని ఉత్తమ్‌ను ప్రశ్నించారు. వైఎస్ హయాంలో ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేరుస్తూ తెచ్చిన జీవో15ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు.

లా కమిషన్ పరిశీలనకు జమిలి ఎన్నికలు

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ అంశాన్ని లా కమిషన్ పరిశీలనకు పంపాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీలు, మేధావులు, నిపుణులు, న్యాయకోవిదులు ఇతర భాగస్వాములతో సంప్రదింపులు చేయడం లా కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థకు సులువు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయమై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. లా కమిషన్ పరిశీలనకు వెళ్తే... జమిలి ఎన్నికలను సాధ్యం చేయడానికి రాజ్యాంగంలోని ఏయే అధికరణలను సవరించాలి...?ఏ చట్టాన్ని మార్చాలి...?అన్న అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. కాగా, జమిలి ఎన్నికల ప్రతిపాదనను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) సమర్థించినప్పటికీ, రాజ్యాంగ సవరణలతోనే ఇది సాధ్యమవుతుందని ఇప్పటికే స్పష్టం చేసింది.

టేకాఫ్ కాని కల

» పేద బ్రాహ్మణ విద్యార్థుల పథకానికి నిధులు రావు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పథకాల ప్రకటన అద్భుతంగా ఉన్నా అమలులో వైఫల్యం పేద విద్యార్థులకు శాపంగా, వారి తలిదండ్రులకు భారంగా మారుతోంది. బ్రాహ్మణ, మైనారిటీ విద్యార్థుల విదేశీ చదువు కల చెదిరిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. విదేశాల్లో ఉన్నత చదువులకు డబ్బు సాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. నిధులు, ఉపకార వేతనాలు విడుదల చేయకుండా నానుస్తోంది. సర్కారు మాటలు విని గంపెడాశ పెట్టుకున్న కుటుంబాలు ఇపుడు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. పేద బ్రాహ్మణ విద్యార్థుల అభ్యున్నతికి చేపట్టిన- వివేకానంద విదేశీ విద్యా పథకం ఇందుకు పెద్ద ఉదాహరణ. విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోవాలనుకునే అర్హులైన బ్రాహ్మణ పట్టభద్రులకు కోర్సు వ్యవధి ఆధారంగా రూ. 10 లక్షల నుంచి రూ 20 లక్షల దాకా ఆర్థిక సహాయం అందించడం ఈ స్కీం ఉద్దేశం. డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షలకు మించని, తెలంగాణకు చెందిన బ్రాహ్మణులైన పట్టభద్రులు పథకానికి అర్హులు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు ఈ బాధ్యత అప్పగించారు. గత సంవత్సరం మే 9న ప్రవేశపెట్టిన ఈ పథకంలో ఇప్పటి వరకూ 72 మంది విద్యార్థుల్ని అర్హులుగా ఎంపికచేశారు. అందులో మొదటి దశలో కేవలం 18 మంది విద్యార్థులకు కోటి 16 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. మిగతా విద్యార్థులెవ్వరికీ ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. సెమిస్టర్లు పూర్తి అవుతున్నా... పరిషత్ నుంచి ఎంతకీ ఆర్థిక సహాయం అందక విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధిక వడ్డీకి అప్పులు

పరిషత్ తన ఆర్థిక సహాయాన్ని మొత్తం ఒకేసారి కాకుండా సెమిస్టర్ల వారీగా చెల్లిస్తుంది. అది కూడా- ముందుగా విద్యార్థి కుటుంబ సభ్యులు కాలేజీలో ఫీజు చెల్లించి -ఆ మొత్తానికి సంబంధించిన రశీదును పరిషత్‌కు సమర్పిస్తే -పరిశీలన తర్వాత తిరిగి వారి ఖాతాలో డబ్బు జమచేస్తుంది. ఇలా ప్రతి సెమిస్టర్‌లో ఎప్పటికప్పుడు ఫీజు చెల్లించి పరిషత్ నుంచి తిరిగి తీసుకోవాల్సి ఉంటుంది. ఎలాగూ తమ పిల్లల్ని విదేశీ విద్య పథకానికి ఎంపిక చేశారు కాబట్టి నిధులు అందుతాయి కదా అని పేద విద్యార్థుల తల్లిదండ్రులు ముందుగా ఫీజు చెల్లించేందుకు బ్యాంకు రుణాలు, బయటి వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో వడ్డీ భారంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఏడాదిగా మైనార్టీ విద్యార్థుల ఎదురుచూపు

విదేశాల్లో ఉన్నత విద్యా కోర్సులు చదువుకునేందుకు మైనారిటీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకమూ ఇంతే! మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలోనిదీ పథకం. అయితే ఈ శాఖకు కేటాయించిన బడ్జెట్‌లో నిధులు విడుదల కాకపోవడంతో ఈ పథకం కింద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంలో జాప్యం జరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం 2015 లో ఓవర్సీస్ స్టడీ స్కీం కింద రూ. 10లక్షల వరకూ స్కాలరషిప్‌గా సమకూర్చనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు 2015-16, 2016-17 విద్యా సంవత్సరాల్లో 520 మందిని, 2017-18లో 335 మందిని ఎంపిక చేసి విదేశాల్లో చదువుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించనున్నట్టు ప్రకటించింది. రెండోసారి- సాయం మొత్తాన్ని రూ 20 లక్షలకు పెంచింది కూడా!. ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందిన అభ్యర్థులు ప్రభుత్వ సాయంతో చదువు పూర్తి చేయవచ్చని భావించారు. కానీ వారి ఆశ నెరవేరేట్లు కనిపించడం లేదు. విద్యార్థుల తలిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు.

ఒక్క వివేకానంద విదేశీ విద్యా పథకమే కాదు సరస్వతీ విద్యాప్రశస్తి, ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాల్లోను ఇప్పటి వరకు చాలా మంది విద్యార్థులకు నిధులు అందక ఇబ్బందులు పడుతున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న విద్యార్థులు చదువును కొనసాగించేందుకు వీలుగా వారు కట్టిన ఫీజును రీయింబర్స్ మెంట్ ద్వారా తిరిగి చెల్లిచే పథకం ఉన్నా వివిధ కారణాల వల్ల గత కొంత కాలంగా నిధుల విడుదల నిలిచిపోయింది.

మిగతా పథకాలదీ అదే పరిస్థితి..

అది సన్యాసుల బస్సు యాత్ర

» వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏడు సీట్లే

» ఎకరాకు 4 వేలు ఇచ్చే మగాడు కేసీఆర్ : నాయిని



వికారాబాద్ అర్బన్, మార్చి 2 : కాంగ్రెస్ సన్యాసులు నిర్వహిస్తున్న బస్సు యాత్రే.. వారికి అంతిమ యాత్ర అని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలంగాణ ఉద్యమ నేత మహేందర్ రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గేటు వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాయిని మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు పాలక పక్షంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో 70 సీట్లు వస్తాయని ఉత్తమ్ చెబుతున్నారని, అందులో నుంచి సున్నా తీసేస్తే ఉండే 7 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు వస్తాయని జోస్యం చెప్పారు. బక్కపల్చనైన వ్యక్తి సీఎంగా ఏం చేస్తారని అప్పట్లో కాంగ్రెస్ నేతలు అన్నారని, అదే వ్యక్తి ఇప్పుడు రాష్ట్రంలో మగాడయ్యాడని వ్యాఖ్యానించారు. దేశంలో ఎవరూ ఇవ్వని విధంగా పంట పెట్టుబడుల కోసం ఎకరాకు రూ. 4వేలు ఇచ్చేలా కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఏ చౌరస్తాలోనైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

బకాయిలు 1600 కోట్లు ఇవ్వండి

» కేంద్ర కార్యదర్శిని కోరిన ఈటల

» ఆహార భద్రతా పథకం అమలుపై కేంద్రం పరిశీలన

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.1600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార ప్రజా పంపిణీ కార్యదర్శి రవికాంత్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కోరారు. శుక్రవారం రాష్ట్రానికి వచ్చిన రవికాంత్ సచివాలయంలో మంత్రి ఈటల, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషీలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 2014-15 లెవీకి సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదలయ్యేలా చూడాలని ఈటల కోరారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖలో చేపట్టిన సంస్కరణలను ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. రౌడీలు, గుండాలపై పెట్టే పీడీ కేసులను రేషన్ అక్రమార్కులపై తొలిసారిగా పెట్టినట్టు చెప్పారు. రేషన్ పంపిణీలో అవకతవకలు నివారించేందుకు ఈపాస్ మిషన్లు, బయోమెట్రిక్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా రవికాంత్ అభినందించారు. రవికాంత్ శనివారం పౌరసరఫరాల ప్రధాన కార్యాలయాన్ని, కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించనున్నారు.

రిజర్వాయర్ల పనుల వేగాన్ని పెంచండి

» పెండింగ్ భూసేకరణ త్వరగా పూర్తి చేయండి: హరీశ్

» సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష

సిద్దిపేట, మార్చి 2: కాళేశ్వరం ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టిన నాలుగు రిజర్వాయర్ల పనులను వేగవంతం చేయాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 9, 10, 11, 12వ ప్యాకేజీ పనులు, భూసేకరణ, ఆయకట్టు సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉన్నాయన్నారు. రెండు జిల్లాల్లో అనుసంధానమైన అనంతగిరి రిజర్వాయర్, కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీల్లోని కాలువ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 8వ ప్యాకేజీ పనులు తొందరగా పూర్తి చేయాలని, టన్నెల్ లైనింగ్, పంప్‌హౌస్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతగిరి రిజర్వాయర్ భూసేకరణ పనులను వేగంగా పూర్తి చేసినందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌ను, యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో 2170 ఎకరాల భూసేకరణలో కేవలం 6 ఎకరాల భూసేకరణ మాత్రమే మిగిలిందన్నారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన జిల్లా కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్లు, ఆర్డీవో ముత్యంరెడ్డి తదితరులను అభినందించారు. అప్రోచ్ కెనాల్‌లు, టన్నెల్ పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రతిరోజూ రిజర్వాయర్‌లో 60 వేల క్యూబిక్ మీటర్ల పనులు జరగాలని ఆదేశించారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌లోని ఎడమ కాలువ పనులను జాప్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుడి కాలువ పనుల సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పనుల పురోగతిపైనా మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. మెయిన్ కెనాల్ భూసేకరణ వారం రోజుల్లో పూర్తి చేసి.. పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణలో ప్రత్యేక అధికారితో కలిసి చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఓవైపు భూసేకరణ, మరోవైపు ప్రాజెక్టు పనులు రెండూ యుద్ధ ప్రాతిపదికన జరగాలన్నారు. ఈ సమీక్షలో సిద్దిపేట సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు వెంకట్రామారెడ్డి, కృష్ణభాస్కర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్స్ పార్కులో 'యంగ్‌గాన్'కు స్థలాలు

» సిర్పూర్ పేపర్‌మిల్లు పునరుద్ధరణకు రాయితీలు

» మంత్రివర్గ ఉప సంఘం సమీక్షలో నిర్ణయాలు!

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణకొరియాకు చెందిన యంగ్‌గాన్ సంస్థకు కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కులో అవసరమైన స్థలాలు కేటాయించి, ప్రకటించిన రాయితీలను సమకూర్చాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రాజెక్టులపై శుక్రవారం సచివాలయంలో మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షించింది. ప్రధానంగా సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణ కోసం ముందుకు వచ్చిన జేకే పేపర్స్ ప్రతిపాదనలపై మంత్రులు చర్చించారు. విద్యుత్ చార్జీల మినహాయింపులు, కార్మికుల బకాయిల అంశాలపై జేకే పేపర్స్ ప్రతిపాదించిన అంశాలకు ఉప సంఘం సానుకూలతను తెలిపినట్లు సమాచారం. ఆ సంస్థ ప్రతిపాదించిన ఆర్థిక అంశాలను కేబినెట్‌కు నివేదించాని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కులో యంగ్‌గాన్ సంస్థకు రాయితీపై స్థలాన్ని కేటాయించాలనే ప్రతిపాదనలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం ప్రకటించినట్టు తెలిసింది. ఈ సంస్థను యాంకర్ యూనిట్‌గా పరిగణించి రాయితీలు అందించాలని నిర్ణయించినట్టు సమాచారం. మెగా టెక్స్‌టైల్స్ పార్కులో సుమారు వేయి కోట్ల పెట్టుబడులతో దాదాపు 10వేల మందికి ఉపాధి కల్పించేందుకు యంగ్‌గాన్ ముందుకు వచ్చింది.

స్థలాల కేటాయింపునకు చర్యలు


కోల్‌కతా కుందన టెక్నోటెక్స్, సాఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ సంస్థ, యునైటెడ్ ఎమిరేట్స్ చెందిన లూలూ గ్రూప్ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్సు ఇండియా, ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్‌ల యూనిట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఉప సంఘం టీఎస్ఐఐసీకి సూచించినట్టు తెలిసింది. ఇప్పటికే టీఎస్ఐఐసీ పర్యవేక్షణలోని ల్యాండ్ బ్యాంకు నుంచి స్థలాల కేటాయింపులకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఐఎస్ఈ ఫుడ్స్, ఆదాని లాజిస్టిక్స్, ఆదాని కాంపోజిట్ అండ్ ప్రిషిసన్ పార్కు, వెస్ట్‌కోస్ట్ ఆప్టిలింక్స్, ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్‌ల దరఖాస్తులను పరిశీలించి, అనువైన స్థలాలను కేటాయించేందుకు మంత్రివర్గ ఉపసంఘం అంగీకరించింది. ఐటీసీకి రాయితీలపై సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, సీఎంవో ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల కమిషనర్ అహ్మద్ నదీం, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా పాల్గొన్నారు.

ఇద్దరి వల్లే మహాద్భుతాలు

» ఒకరు కేసీఆర్, మరొకరు హరీశ్‌రావు

» కోమటిచెరువు కళాఉత్సవాల్లో స్పీకర్ మధుసూదనాచారి ప్రశంసలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సిద్దిపేట/సిద్దిపేట కల్చరల్, మార్చి 2: రాష్ట్రంలో ఇద్దరు వ్యక్తుల వల్లే మహాద్భుతాలు జరుగుతున్నాయని, వారిలో ఒకరు సీఎం కేసీఆర్ అని, మరొకరు మంత్రి హరీశ్‌రావు అని అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి ప్రశంసల జల్లు కురిపించారు. సిద్దిపేటలోని కోమటిచెరువు కళాక్షేత్రంలో శుక్రవారం రెండోరోజు జరిగిన కళాఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ సిద్దిపేట ప్రజలు దేశానికే ఆదర్శమని, వారి చైతన్యం ద్వారానే తెలంగాణ రాష్ట్రానికి మార్గం పడిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు.. ఇద్దరూ ఈ ప్రాంత ముద్దుబిడ్డలని ప్రశంసించారు. తెలంగాణ వస్తే ఏమొస్తుందని కొందరు విమర్శలు చేశారని.. ఇటు ప్రాజెక్టులు, అటు అభివృద్ధి పనులు అందిస్తున్నామని తెలిపారు. కోమటి చెరువును సుందర క్షేత్రంగా తీర్చిదిద్దిన ఘనత హరీశ్‌రావుదేనన్నారు. తెలంగాణ ఇరిగేషన్ శాఖ బ్రాండ్ అంబాసిడర్, ఐదేళ్ల బాలుడు నేహాల్ కార్యక్రమానికి హాజరై కాళేశ్వరం ప్రాజెక్టులపై ప్రజలకు అర్థమయ్యేలా అనర్గళంగా ప్రసంగించాడు. మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాలో జన్మించడం మీ(స్థానికుల) అదృష్టమంటూ నేహాల్ ప్రశంసలు కురిపించాడు.



నేహాల్‌ను అభినందిస్తున్న అసెంబ్లీ స్పీకర్. చిత్రంలో హరీశ్‌రావు

పార్లమెంట్‌లో పోరాటమేనా?

» నేడు టీఆర్ఎస్‌పీపీ భేటీ

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. తెలంగాణ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ (టీఆర్ఎస్‌పీపీ) శనివారం సాయంత్రం ప్రగతిభవన్‌లో భేటీ కానుంది. తెలంగాణ ఏర్పడి నాలుగేళ్లు పూర్తయినా విభజన సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదనే అభిప్రాయంతో టీఆర్ఎస్ అధిష్ఠానం ఉంది. బడ్జెట్‌లోనూ తెలంగాణకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేకపోవటంపై ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జరగనున్న టీఆర్ఎస్‌పీపీ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ ఎంపీలకు అధినేత కేసీఆర్.. ఏం దిశానిర్దేశం చేస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది. అలాగే, పంటలకు మద్దతు ధర, పెండింగ్ సమస్యలపై పార్లమెంట్ వేదికగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

800 ట్రాక్టర్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం రూ.56కోట్ల వ్యయంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన రైతులకు 800 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఒకేచోట రైతులకు భారీస్థాయిలో ట్రాక్టర్లు పంపిణీ చేయడం దేశంలోనే మొదటిసారి అని సభలో మంత్రులు ప్రకటించారు. తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ యాంత్రీకరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోచారం మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లైనా రైతు పరిస్థితి మారలేదన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు అవసరం లేకుండా సొంత పెట్టుబడితో వ్యవసాయం చేసే రోజులు రావాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమన్నారు. రైతులకు ఉచితంగా 24గంటలు విద్యుత్తు, ఎకరానికి రూ.4వేల పెట్టుబడి, సబ్సిడీపై ట్రాక్టర్లు, యంత్రాలు అందుబాటులో వ్యవసాయ విస్తరణాధికారులను అందించి వ్యవసాయాన్ని పండుగ చేస్తున్న ప్రభుత్వం దేశంలో తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు దళారులతో పని లేకుండా రైతు సమన్వయ సమితులతోనే కొనుగోలు చేయించి రైతుకు గిట్టుబాటు ధర కల్పించబోతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి జిల్లాలో రూ.100కోట్లతో తుమ్మల చొరవతో నిర్మించిన అప్పారావుపేట ఆయిల్ పరిశ్రమే ఇందుకు నిదర్శ మని పోచారం అన్నారు. ఏం చేస్తున్నారని రైతులను అడిగితే.. వ్యవసాయం చేస్తున్నామని ధైర్యంగా చెబుతూ ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగేలా తెలంగాణ రైతాంగాన్ని తీర్చిదిద్దబోతున్నామని తెలిపారు.

దరఖాస్తు చేసిన ప్రతి రైతుకు ట్రాక్టర్: తుమ్మల

రైతుకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక జిల్లాలో రైతుల కోసం ఒకేసారి 800 ట్రాక్టర్ల పంపిణీ చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అన్నారు. జిల్లాలో ఎన్నెస్పీ ఆయకట్టుతో వెయ్యి ట్రాక్టర్లు పంపిణీ చేయాలని కోరారని, ముందుగా 800 ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్నామని తుమ్మల తెలిపారు. దరఖాస్తు చేసిన ప్రతి రైతుకు ట్రాక్టర్ అందించేలా చర్య తీసుకుంటామని తెలిపారు. రెండేళ్లలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నామని తెలిపారు. ముందుగా వైరా, అశ్వారావుపేట, సత్తుపల్లి తదితర నియోజకవర్గాలకు సాగునీరు అందబోతుందని తుమ్మల పేర్కొన్నారు. వైరా రిజర్వాయర్ నుంచి బోనకల్లు కెనాల్‌ను అనుసంధానం చేసి సీతారామ సాగునీటి ప్రాజెక్టు ద్వారా సాగు నీరందిస్తామని పేర్కొన్నారు. ట్రాక్టర్లు పొందుతున్న రైతులు రోడ్లపై దమ్ము చక్రాలతో నడిపించొద్దని, దాని వల్ల రోడ్లు పాడవుతాయని మంత్రి తెలిపారు. ఈ సభలో ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ కవిత, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, మదన్‌లాల్, కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పొత్తు ఉంటే టీఆర్ఎస్‌తోనే!

» ఎన్టీఆర్ ఆశీర్వాదంతోనే కేసీఆర్ నాయకుడయ్యారు

» పార్టీ విలీనం వ్యాఖ్యలపై క్షమాపణ చెబుతున్నా

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : 'ఎన్నికల్లో టీఆర్ఎస్‌తోనే పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్టీఆర్ ఆశీర్వాదంతోనే సీఎం కేసీఆర్ నాయకుడయ్యారు. తెలుగుదేశం పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలన్న వివాదాస్పద వ్యాఖ్యలపై క్షమాపణ చెబుతున్నా. తెలంగాణ ఉద్యమం సందర్భంగా చంద్రబాబు కోసం నా జీవితాన్ని త్యాగం చేశా. నేను లేకుండా, ఆయన పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం నిర్వహించడం బాధ కలిగించింది' అని మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ రాష్ట్ర నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అసమర్థ నాయకత్వంతోనే నాయకులు పార్టీ నుంచి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. 'తెలంగాణ వాదం వచ్చినప్పుడు చంద్రబాబుకు అండగా నిలబడ్డా. డబ్బున్నోళ్లు, ఆయన కేబినెట్‌లో మంత్రులుగా చేసినోళ్లు ఆయన్నే నిందించి బయటకు వెళ్లి.. మళ్లీ మంత్రులయ్యిండ్రు. ఆనాడు నన్ను చంపడానికి రెక్కీ కూడా నిర్వహించిండ్రు. ఇవన్నీ చంద్రబాబుకు తెలుసు' అన్నారు.

పార్టీని భ్రష్టుపట్టించారు..

చిత్తశుద్ధి లేనివాళ్లకు నాయకత్వం ఇవ్వడం వల్ల పార్టీ భ్రష్టుపట్టిపోయిందన్నారు. పార్టీ పరువును బజారున పడేసిన కిరాతకుడు రేవంత్ అని, ఓటుకు నోటు కేసప్పుడు అతడిని ఆనాడే సస్పెండ్ చేసి ఉంటే ఈ గతి పట్టేది కాదన్నారు. 'చంద్రబాబు తెలంగాణలో పర్యటిస్తే తప్ప పార్టీ బలోపేతం కాదనే చెప్పా. పది లక్షల మంది కార్యకర్తలకు మనోధైర్యం కోసమే నేను విలీనం గురించి మాట్లాడిన. ఆయన తిరగలేదన్న బాధతోనే చెప్పా. నా వ్యాఖ్యలతో బాధపడ్డ కేడర్‌కు క్షమాపణ చెబుతున్నా. విలీనం అయినప్పుడు ఏం చేయాలో నేను మాట్లాడిన. విలీనం ఉండదు.. పొత్తులే అని మా బాస్ చెప్పారు' అని మోత్కుపల్లి వివరించారు.

పరీక్షలు వచ్చేశాయ్... బోల్డెంత సిలబస్... ఎలా చదవాల్రా బాబోయ్! అని తెగ టెన్షన్ పడుతుంటారు పిల్లలు. మరోవైపు ఎండల తీవ్రత ఇంకా నీరసాన పడేస్తుంది. దాంతో పేరెంట్స్ తీవ్ర ఒత్తిడికి గురవుతారు. పిల్లల్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచేందుకు ఎలాంటి ఆహారం పెట్టాలా అని ఆలోచిస్తుంటారు. పరీక్షల వేళ.. పిల్లల బ్రెయిన్‌కు, శరీరానికీ శక్తినిచ్చే వంటకాల్లో కొన్ని...

పరీక్షల వేళ..

మిక్స్‌డ్ బీన్ సలాడ్



కావలసినవి: మిక్స్‌డ్ బీన్స్- కప్పులో మూడొంతులు, టొమాటో- ఒకటి, పచ్చిమిర్చి- సగం, నిమ్మరసం- ఒక టీస్పూను, మిరియాలపొడి, ఉప్పు-తగినంత, క్యాప్సికం- సగం, రాజ్మా, పల్లీలు, నల్ల శెనగలు, తెల్ల శెనగలు - కావల్సినన్ని.

తయారీ:

- మిక్స్‌డ్ బీన్స్‌ను పన్నెండు గంటలు నీళ్లల్లో నానబెట్టాలి.
- కుక్కర్‌లో నీళ్లు పోసి, నానబెట్టిన బీన్స్‌లో చిటికెడు ఉప్పు వేసి ఉడికించాలి.
- ఉడికిన బీన్స్‌ను వడగట్టి విడిగా గిన్నెలో తీసిపెట్టాలి.
- టొమాటోను కోసి గింజల్ని తీసేసి సన్నగా తరగాలి.
- టొమాటో, పచ్చిమిర్చి ముక్కలు, మిరియాల పొడిని ఉడికించిన బీన్స్‌లో వేసి కలిపితే సలాడ్ రెడీ. కావాలంటే ఇందులో పచ్చిమామిడి, క్యారెట్, కీరదోస ముక్కల్ని కూడా కలుపుకోవచ్చు. ఇది శరీరానికి ఎన్నో పోషకాలను అందిస్తుంది.

ఫ్రూట్ చాట్



కావలసినవి: పళ్ల ముక్కలు- ఒక కప్పు, కారం- కొద్దిగా, జీలకర్ర పొడి, ఉప్పు, చాట్‌మసాలా- ఒక్కొక్కటి చిటికెడు చొప్పున, చక్కెర- కొద్దిగా, నిమ్మరసం-కొంచెం, పుదీనా తరుగు - కొంచెం.

(దానిమ్మ గింజలు, పైనాపిల్, యాపిల్, జామ, పియర్స్‌తోపాటు కీర, మామిడి, పుచ్చకాయ, స్ట్రాబెర్రీ, ద్రాక్ష పళ్ల ముక్కలు కూడా వాడొచ్చు.)

తయారీ:

- పళ్లను మీకు నచ్చిన సైజ్ ముక్కలుగా తరగాలి.
- యాపిల్, పియర్‌లను సగానికి కోసి ఉప్పు లేదా నిమ్మరసం కలిపిన నీళ్లలో వేయాలి. ఇలా చేస్తే ముక్కలు నల్లబడకుండా ఉంటాయి.
- పళ్లముక్కల్ని (పియర్, యాపిల్ ముక్కలతో సహా) ఒక పాత్రలో వేసి కారం, జీలకర్రపొడి, ఉప్పు, చాట్‌మసాలా, చక్కెర, నిమ్మరసం వేసి కలపాలి. దానిపై పుదీనా తరుగుతో అలంకరించాలి. ఇది తింటే తక్షణ శక్తి వస్తుంది.


రాగి, ఆలూ, మేథీ పరాటా

కావలసినవి: రాగి, గోధుమ పిండి - ఒక్కోటి పావు కప్పు చొప్పున, కారం- అర టీస్పూను, ఉప్పు-తగినంత, గరం మసాలా- కొంచెం, నూనె- ఒక టీస్పూను.

పరాటా కోసం: ఆలు - ఒకటి, మెంతి ఆకు తరుగు- రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ:

- ఆలూను ఉడికించి పైపొట్టు తీయాలి.
- ఇందులో మెంతి ఆకు లేదా కొత్తిమీర దేన్నైనా వాడొచ్చు.
- ఉడికించిన ఆలూను మెత్తగా చేయాలి.
- ఒక పాత్రలో రాగిపిండి, గోధుమపిండి, కారం, గరం మసాలా, మెంతి/కొత్తిమీర, ఉప్పు, మెత్తగా చేసిన ఆలు వేయాలి.
- ఈ మిశ్రమంలో కొన్ని నీళ్లు పోసి చపాతీ పిండిముద్దలా కలపాలి. కొంచెం నూనె వేసి కలిపితే పిండి మరింత మృదువుగా వస్తుంది. ఈ పిండిముద్దపై మూత పెట్టి పక్కన పెట్టాలి.
- తరువాత నిమ్మకాయ పరిమాణంలో ఉండలు చేసి, వాటిని గోధుమ పిండిపై అద్దుతూ చపాతీల్లా వత్తాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి అది వేడెక్కాక, కొంచెం వెన్న లేదా నూనె వేసి పరాటాలను రెండు వైపులా బంగారు వర్ణం వచ్చే వరకు కాల్చాలి.
- పెరుగు, నచ్చిన పచ్చడితో వేడి వేడి పరాటాలను తింటే ఎంతో రుచిగా ఉంటాయి. ఇవి పిల్లలకు బాగా బలాన్నిస్తాయి.



పాలక్ సూప్



కావలసినవి: పాలకూర- కొంచెం, వెల్లుల్లి రెబ్బలు- ఐదు, వెన్న లేదా నూనె- ఒక టీస్పూను, ఫ్యాట్ తక్కువగా ఉన్న పాలు- అరకప్పు, కార్న్‌ఫ్లోర్ - ఒక టీస్పూను, మిరియాలపొడి, ఉప్పు- సరిపడా.

తయారీ:

- కాడలు తీసేసి పాలకూర ఆకుల్ని శుభ్రంగా కడగాలి.
- కుక్కర్‌లో కాస్తంత వెన్న వేడిచేసి అందులో వెల్లుల్లి రెబ్బల్ని వేగించాలి.
- తరువాత కడిగిన పాలకూరని వేయాలి.
- అందులో పాలు, అరకప్పు నీళ్లు పోసి కుక్కర్‌లో ఉడికించాలి.
- ఉడికిన మిశ్రమం చల్లారాక దాన్ని గ్రైండ్ చేయాలి.
- కార్న్‌ఫ్లోర్‌ను నీళ్లల్లో వేసి చిక్కగా చేసి అందులో కలపాలి.
- ఒకవేళ సూప్ చిక్కగా అయితే కార్న్‌ఫ్లోర్ కలపాల్సిన అవసరం లేదు.
- ఉప్పు, మిరియాలపొడిని కలిపి, తాజా క్రీము సూప్ పైన వేసుకుని వేడి వేడిగా తాగితే టేస్టీగా ఉంటుంది. ఈ సూప్ తాగితే శరీరం ఎనర్జిటిక్‌గా ఉంటుంది. (పాలకూర ఇష్టంలేని వాళ్లు గుమ్మడికాయ, బ్రొకోలి, క్యారెట్ లేదా ఇష్టమైన ఏ కూరగాయలైనా వాడొచ్చు.)

పెసలతో కూర

కావలసినవి: పెసలు- ఒక కప్పు, ఉల్లిపాయలు, టొమాటోలు - ఒక్కోటి రెండు చొప్పున, కారం- ఒక టీస్పూను, జీలకర్ర, ధనియాలపొడి- ఒక్కొక్కటీ అర స్పూను చొప్పున, గరంమసాలా- పావు టీస్పూను, నూనె- మూడు టీస్పూన్లు, కసూరి మెంతి- కొద్దిగా, జీలకర్ర- పావు టీస్పూను, ఉప్పు- తగినంత.



తయారీ:

- పెసల్ని బాగా కడిగి రెండు గంటలపాటు నానబెట్టాలి.
- ఉల్లిపాయలు, టొమాటోలను ఒకే పరిమాణంలో ఉండేలా పొడుగ్గా, సన్నగా తరగాలి.
- ప్రెషర్ కుక్కర్‌లో నూనె వేసి, అది వేడెక్కాక జీలకర్ర వేయాలి. అది వేగాక ఉల్లిపాయ ముక్కలు వేసి ఒక నిమిషం వేగించాలి. తర్వాత అందులో టొమాటో ముక్కల్ని కూడా వేసి మరి కాసేపు వేగించాలి.
- ధనియాలపొడి, జీలకర్రపొడి, గరంమసాలా, కారం ఒకదాని తర్వాత ఒకటి వేసి టొమాటో, ఉల్లిపాయముక్కల్లో అవి బాగా కలిసేట్టు గరిటెతో కలపాలి.
- తర్వాత ఇందులో నానబెట్టిన పెసలను వేసి రెండున్నర కప్పుల నీళ్లు పోసి తగినంత ఉప్పు వేయాలి.
- ఆ తర్వాత ప్రెషర్ కుక్కర్ మీద మూత పెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకూ ఈ మిశ్రమాన్ని ఉడికించాలి.
- తరువాత కసూరి మెంతి వేసి కలపాలి.
- రెడీ అయిన కూరని వేరే పాత్రలోకి మార్చాక పైన కొత్తిమీర తరుగు చల్లాలి. రొట్టెలతో దీన్ని వేడి వేడిగా తింటే ఎంతో రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికీ ఎంతో మంచిది.

స్వీట్‌కార్న్ చాట్

కావలసినవి: స్వీట్‌కార్న్- ఒక కప్పు, క్యారెట్‌ముక్కలు- అర కప్పు, అల్లం-చిన్న ముక్క, పచ్చిమిర్చి- ఒకటి, నూనె- ఒక టీస్పూను, ఆవాలు-పావు టీస్పూను, కరివేపాకు- కొద్దిగా, కొబ్బరితరుగు- మూడు టేబుల్‌స్పూన్లు, ఉప్పు-తగినంత.

తయారీ:

- కుక్కర్‌లో స్వీట్ కార్న్ గింజల్ని ఉడికించాలి.
- క్యారెట్‌ను సన్నగా తురమాలి.
- అల్లం, పచ్చిమిర్చిలను కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి చిటపటలాడేటప్పుడు అల్లం, మిర్చి పేస్టు, కరివేపాకు వేయాలి.
- ఉడికించిన స్వీట్ కార్న్, క్యారెట్ తరుగు, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి.
- సన్నటి మంటపై కొద్దిసేపు ఉడికించి స్టవ్ ఆపేయాలి. ఆ తర్వాత తురిమిన కొబ్బరిని వేసి బాగా కలపాలి. పైన కొత్తిమీర తరుగుతో అలంకరిస్తే ఘుమఘుమలాడే స్వీట్ కార్న్ చాట్ రెడీ! దీని రుచి ఎంతో బాగుంటుంది. ఇదెంతో ఆరోగ్యకరం కూడా. అల్లం మాత్రం తప్పనిసరిగా వేయాలి. అదే ఈ చాట్ రుచిని పెంచుతుంది.



పరీక్షల వేళ పిల్లలు వీటికి దూరంగా ఉంటే మంచిది.

- బర్గర్స్
- పిజ్జా
- హాట్ డాగ్స్
- శాండ్‌విచ్
- రెడ్ మీట్
- డీప్ ఫ్రైడ్ ఫుడ్


మలబద్ధకం పోవాలంటే...

మలబద్ధకానికి, తినే ఆహారానికి సంబంధం ఉంటుందా? మలబద్ధకం పోవడానికి డైలీ ప్లాన్ ఇవ్వండి.

-వెంకటేశ్వరరావు

సాధారణంగా మలబద్ధకానికి కొన్ని కారణాలుంటాయి. అవేమిటంటే...

- నీరు తగిన మోతాదులో తీసుకోకపోవడం వల్ల మలం నుంచి వచ్చే నీటిని శరీరం తిరిగి పీల్చుకుంటుంది. దీనివల్ల మలం గట్టిబడి ఫ్రీ మూవ్‌మెంట్ లేకుండా నిలవ ఉండిపోతుంది. ఒక్కసారి ఇలా అయితే



అది పునరావృతమయ్యే అవకాశం ఉంటుంది. అందుకే రోజుకి కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగాలి.

- తక్కువ పీచు పదార్థాలు తీసుకోవడం వల్ల జీర్ణకోశంలో ఆహారం కదలిక తక్కువగా ఉండి, మలబద్ధకం ఏర్పడవచ్చు. రోజూ తీసుకునే ఆహారంలో తప్పకుండా 40 గ్రాముల పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. పళ్లు, కూరగాయలు ఆహారంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే తొక్క ఉన్న గింజలు ప్రతిరోజూ భోజనంలో ఉండాలి.
- ఆపరేషన్‌కు ముందు 'ఎనిమా' చేయడం వల్ల జీర్ణకోశం ఖాళీ అవుతుంది. జీర్ణకోశంలో ఉండే కదలికలు కూడా మందగిస్తాయి. ఆపరేషన్ అయిన ఒకటి రెండు రోజుల్లో సాధారణ ఆహారానికి షిఫ్ట్ అయినపుడు బల్క్‌గా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలి. పోస్ట్ ఆపరేటివ్ కండీషన్‌లో ఉన్న వాళ్లు పళ్లు, కూరగాయలు, తొక్క ఉన్న గింజలు తగు మోతాదులో తినడం మొదలెట్టాలి.
- సమయానికి మల విసర్జన చేయకుండా ఆపుకోవడం అనే అలవాటు ఎక్కువగా పిల్లలు, మహిళల్లో కనిపిస్తుంది. టైమ్ లేకనో, లేదా ఆ సమయంలో వేరే పని ఉండో, ఒక్కోసారి బాత్రూం ఖాళీగా లేకపోవడం వల్ల కూడా మల విసర్జన అనేది వాయిదా వేసుకుంటుంటారు. అదే అలవాటుగా మారి మలబద్ధకం మొదలవుతుంది.

మలబద్ధకం పోవాలంటే...

- ఉదయం నిద్ర లేవగానే ఒకటీ రెండు గ్లాసుల నీరు తాగాలి. ప్రతిసారి భోజనం చేయడానికి ముందు ఆ తర్వాత కూడా నీరు తాగాలి.
- బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ఆరెంజ్‌వంటి పీచుపదార్థం ఉన్న పళ్లు తీసుకోవాలి.
- బ్రేక్‌ఫాస్ట్‌కు, మధ్యాహ్న భోజనానికి మధ్యలో కాయగూరల సూప్ తీసుకోవాలి.
- లంచ్‌లో కాయగూరల సలాడ్ తప్పనిసరి. తొక్క ఉన్న గింజలతో కూర ఒకటి తప్పనిసరిగా ఉండాలి.
- స్నాక్‌టైమ్‌లో పళ్లుగానీ, మొలకెత్తిన గింజలు కానీ తినాలి.
- సరైన సమయానికి భోజనం చేసి దాంతో పాటు ఒక పండు తింటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు.



డాక్టర్ బి. జానకి
న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com



బ్రెడ్ మేకింగ్ కిట్

బ్రెడ్ ప్రియులకు ఎంతో ఉపయోగపడే కిచెన్‌వేర్ లోఫ్‌నెస్ట్ కిట్. దీంతో బ్రెడ్‌ను ఇంట్లోనే ఎంతో సులువుగా చేసుకోవచ్చు. వినూత్నమైన ఈజీ పీల్ లైనర్ టెక్నాలజీ, నాణ్యమైన ఐరన్‌లను ఈ కిట్‌లో వాడారు. దీంతో బ్రెడ్‌ను సులభంగా తయారుచేసుకోవచ్చు. ఇంట్లో బ్రెడ్ తయారు చేయడానికి వీలుగా ఎక్కువ వేడి, ఎక్కువ తేమ సౌకర్యం ఈ కిట్ డిజైనింగ్‌లో ఉంది. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఐరన్ హెవీ కాసరోల్ స్టోర్స్ దీంట్లో ఉంది. అలాగే నాన్‌స్టిక్ లైనర్ వల్ల మాయిశ్చర్ లోపల ఉండి బ్రెడ్ టెక్స్చర్ బాగా వస్తుంది. దాంతో ప్రొఫెషనల్ బేకర్స్ చేసిన బ్రెడ్‌లా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే లోఫ్‌నెస్ట్ అత్యంత సులభమైన ఆర్టిసాన్ బ్రెడ్ మేకర్. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడానికి ఇష్టపడేవారికి ఇది మంచి కిచెన్ కిట్. ఇందులోనే పిండి కలిపి, అది పొంగేందుకు 18 గంటలపాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత ఓవెన్‌లో ప్రీహీట్ చేసి లైనర్‌లో పిండి పోసి 45 నిమిషాలు బేక్ చేస్తే హోం బ్రెడ్ రెడీ. దీని ధర సుమారుగా ఏడు వేల రూపాయలు.

వారెవ్వా... వాల్‌నట్స్

వాల్‌నట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లలకు మరీ మంచిది. ప్రస్తుతం పరీక్షల సమయం కాబట్టి వాల్‌నట్స్ తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు...

- జీర్ణశక్తికి కూడా మంచివి.
- పిల్లల పెరుగుదలకు వాల్‌నట్స్ ఉపయోగపడతాయి.
- విటమిన్-బి, ఇ ఉంటాయి.
- శరీరంలోని చెడు, మంచి ఫ్యాట్లను ఇవి సమతుల్యం చేస్తాయి.
- వీటిలో ప్రొటీన్లు పుష్కలం. ఇవి బ్రెయిన్ ఫుడ్. వీటివల్ల జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది.
- మంచి నిద్ర పట్టేలా చేస్తాయి.
- పరీక్షల సమయంలో పిల్లలోని ఒత్తిడిని తగ్గిస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది.
- మలబద్ధకాన్ని నివారిస్తాయి.
- మిగతా నట్స్‌లో ఉండే ఖనిజాలు వాల్‌నట్స్‌లో కూడా ఉన్నాయి.
- ఎముకలను దృఢంగా ఉండేలా చేస్తాయి.
- వాల్‌నట్స్‌లో పీచుపదార్థాలు బాగా ఉంటాయి. అందుకే వీటిని తింటే పిల్లలు ఎంతో చురుగ్గా, ఉత్సాహంగా ఉంటారు.



నవ్య | ఆంధ్రజ్యోతి లిటిల్స్ ప్లస్
8 శనివారం • 3 మార్చి 2018 9



ఈ బుజ్జాయి

పంచ్ ఇస్తే పడిపోవాల్సిందే!

నిండా ఐదేళ్లు కూడా లేవు... కానీ ఒక్క పంచ్ గానీ ఇచ్చిందంటే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. గొంతెత్తి రాగం అందుకుందంటే చాలు ... ఎంతటి విద్వాంసులైనా ఫిదా కావాల్సిందే. గజ్జె కట్టి తాళానికి అనుగుణంగా ఆడిందంటే ఎవరైనా మెచ్చుకుని తీరాల్సిందే. రంగం ఏదైనా సరే అడుగు పెట్టిన చోటల్లా రఫ్ఫాడించేస్తోంది నడింపల్లి ప్రజ్వలిత. తాజాగా దేశంలోనే అతి చిన్న వయసులో తైక్వాండో బ్లాక్ బెల్ట్ సాధించి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా యూకేజీ చదువుతున్న ఈ చిచ్చరపిడుగు ముచ్చట్లు 'లిటిల్స్ ప్లస్' కోసం...



తైక్వాండోలో రోజూ అన్నయ్య ఇచ్చే పంచ్‌లు చూసిన ప్రజ్వలితకు దానిపై ఆసక్తి పెరిగింది. మారాం చేసి అన్నయ్యతో కలిసి శిక్షణకు వెళతానంది. గారాల పట్టి కోరికను ఎందుకు కాదనాలని అమ్మా నాన్నలు సరేనన్నారు. అలా ఆటగా మొదలుపెట్టిన తైక్వాండోలో ఈ చిన్నారి రాటుదేలింది. గాల్లోకి లేచి గిర్రున తిరిగి... దిమ్మ తిరిగే పంచ్‌లు ఇస్తోంది. క్షణాల్లో కాలును నిలువెత్తుకు లేపి అబ్బురపరుస్తోంది. పెద్దవాళ్లకే కష్టసాధ్యమైన విన్యాసాలు చేస్తున్న ప్రజ్వలిత గత ఏడాది తెలంగాణ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం దక్కించుకుంది. అంతే కాకుండా తైక్వాండో బ్లాక్‌బెల్ట్ సాధించి చరిత్ర సృష్టించింది. భారత్‌లోనే ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డులకెక్కింది. గతంలో జైపూర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు అర్ణవ్‌శర్మ పేరిట ఈ రికార్డు ఉండేది. ఇక జపనీస్ యుద్ధవిద్య ఆయుధం నన్‌చాకూను ఉపయోగించడమంటే పెద్దవారికే కష్టం. కానీ... ప్రజ్వలితకు ఇందులో ఏకంగా 20 లెవల్స్ వచ్చు. నన్‌చాకూతో అలవోకగా ఆడేసుకుంటుంది. హైదరాబాద్‌లోని ఇందూ ఇంటర్నేషనల్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్న ప్రజ్వలిత ఎస్ఎన్ఆర్ అకాడమీలో నర్సిరెడ్డి వద్ద ఏడాదిగా తైక్వాండో శిక్షణ తీసుకుంటోంది.

భరతనాట్యం... కర్ణాటక సంగీతం...

ఒక్క తైక్వాండాలోనే కాదు... భరతనాట్యం, కర్ణాటక సంగీతంలో కూడా ఈ చిన్నారి అదరగొడుతోంది. వివిధ వేదికలపై ప్రదర్శనలు కూడా ఇచ్చి పండితుల ప్రశంసలు పొందింది. భరతనాట్యంలో విశాఖ ప్రకాశ్ వద్ద, సంగీతంలో రామసీత వద్ద శిక్షణ పొందుతోంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'సదరన్ ఇండియా ఇన్‌స్పైర్ 2018'లో కర్ణాటక సంగీత కచేరీ చేసి మురిపించింది. రాజకీయ, కళారంగ ప్రముఖుల అభినందనలు, ఆశీస్సులు అందుకుంది. అంతేనా... మంచి మంచి కథలు ఆకట్టుకొనేలా చెప్పగలదు. ముప్పైకి పైగా వేమన, సుమతీ శతకాలు వల్లించగలదు. అటు చదువులోనూ ఈ బుజ్జాయి ముందుంటుంది. అన్నింటికంటే ఆశ్చర్యకర విషయమేమంటే... ఈ చిన్నారికి యూకేజీలో వంద శాతం అటెండెన్స్! ఆ వయసు పిల్లలు స్కూలుకు డుమ్మా కొట్టడం సాధారణం. కానీ ప్రజ్వలిత అందుకు భిన్నం. స్కూల్లో జరిగే వివిధ రకాల కార్యక్రమాల్లో ఉపన్యాసాలు కూడా ఇచ్చి చప్పట్లు కొట్టించుకుందీ చిన్నారి.



కుటుంబ ప్రోత్సాహం...

ఇంత చిన్న వయసులోనే వివిధ రంగాల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న ప్రజ్వలితను తండ్రి నడింపల్లి రవికుమార్, తల్లి నీహారిక ముందుండి నడిపిస్తున్నారు. రవికుమార్ 'ఎడ్‌సేవ.ఇన్' వ్యవస్థాపకుడు. ప్రజ్వలిత హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎన్ఆర్ఎల్ నాగేశ్వరరావు మనవరాలు. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది, కళాకారులు నడింపల్లి అప్పారావు ముని మనవరాలు.

'అస్థిత్వ' అవార్డు...

అతి చిన్న వయసులోనే తైక్వాండో బ్లాక్ బెల్ట్ సాధించినందుకు గానూ ఈ చిన్నారికి ఇప్పుడు ఎన్నో సత్కారాలు అందుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వ బాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏటా ఇచ్చే 'అస్థిత్వ' అవార్డుకు ప్రజ్వలితను ఎంపిక చేశారు. ఫిబ్రవరి 18న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చిన్నారికి ఈ అవార్డును బహూకరించారు. 'పెద్దయ్యాక ఏం కావాలనుకుంటున్నావు' అని అడిగితే... 'సైనికురాలినై దేశం కోసం సేవలు అందిస్తా' అంటూ తడుముకోకుండా చెప్పేస్తుంది ప్రజ్వలిత. ఈ చిచ్చరపిడుగు ప్రతిభకు ప్రముఖులెందరో ముగ్ధులయ్యారు. భారతీయత, దీపావళి పండుగలను వర్ణించిన తీరుకి హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి మురిసిపోయారు. తైక్వాండో బ్లాక్‌బెల్ట్ పోటీల సందర్భంగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి 'అ...ఆలు కూడా సరిగ్గా రాని ఈ చిన్నారి సాధించిన ఘనత అమోఘ'మన్నారు. 'చిన్నప్పటి నుంచే పిల్లల నైపుణ్యానికి పదును పెడితే ఎంతటి ఘనత సాధిస్తారో చెప్పడానికి ప్రజ్వలిత ప్రత్యక్ష నిదర్శనం' అని సెట్విన్ చైర్మన్ మీర్ అలీ బక్రి ప్రశంసించారు. ఆటైనా... పాటైనా అద్భుత నైపుణ్యంతో అందరినీ అబ్బురపరుస్తున్న ప్రజ్వలిత మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ మనమూ చెప్పేద్దాం... 'బెస్ట్ ఆఫ్ లక్'!


\- హనుమా



ఇదిగో జింక..!

పేపర్ కళ





జింకల గురించి మీరు వినే ఉంటారు! కానీ ధృవప్రాంతాల్లో... అంటే ఆర్కిటిక్, అంటార్కిటికా వంటి ధ్రువప్రాంతాల్లో కూడా జింకలు ఉంటాయి. కానీ ఇవి మామూలు జింకలతో పోల్చుకుంటే కాస్త వెరైటీగా ఉంటాయి. ధ్రువప్రాంతాల్లో వీటినే ఆంగ్లంలో రెయిన్‌డీర్ అంటారు. ఈ ధృవప్రాంత జింకను కాగితంతో ఎలా తయారుచేయాలో చూద్దామా!

స్టెప్ 1: చతురస్రాకారపు కాగితాన్ని బొమ్మలో చూపించిన విధంగా ఫోల్డ్ చేసి, మళ్లీ ఆ మడతను తీసేయండి

స్టెప్ 2: బొమ్మలో చూపించిన విధంగా కాగితాన్ని మధ్యలోకి మడవండి.

స్టెప్ 3: స్టెప్ 2నే కాగితం పై భాగంలో రిపీట్ చేయండి.

స్టెప్ 4: కాగితాన్ని మళ్లీ మధ్యలోకి మడవండి

స్టెప్ 5: ఆ మడతను తీసేసి బొమ్మలో చూపించిన విధంగా ఫోల్డ్ చేయండి

స్టెప్ 6: స్టెప్ 6నే వేరే వైపు రిపీట్ చేయండి

స్టెప్ 7: కాగితాన్ని వెనుకవైపునకు మడవండి

స్టెప్ 8: అప్పుడు కాగితాన్ని మూడు మడతలు ఏర్పడతాయి.

స్టెప్ 9: మధ్యలో ఉన్న మడతను పైకి మడవండి

స్టెప్ 10: జింక ముందు కాళ్ల ఆకారం వచ్చేలా, రెండు వైపులా ఉన్న ఫ్లాప్స్‌ను మడవండి(బొమ్మలో చూడండి)

స్టెప్ 11: పైన సూదిగా ఉన్న కొనను ముఖం ఆకారం వచ్చేలా మడవండి. (బొమ్మలో చూడండి)

స్టెప్ 12: ముఖం ఆకారంలో చేసిన ఫోల్డింగ్‌ను తీసేయండి

స్టెప్ 13: కొత్తగా మడత ఏర్పడుతుంది. అప్పుడు మళ్లీ అక్కడ కాగితాన్ని వెనుకవైపునకు మడవండి

స్టెప్ 14: బొమ్మలో చూపించిన విధంగా కాగితాన్ని కిందకు మడవండి

స్టెప్ 15: స్టెప్ 14లో ఎక్కడైతే ఫోల్డ్ చేశారో, అక్కడే కొత్తగా ఇంకో ఫోల్డ్ చేయండి (బొమ్మలో చూడండి)

స్టెప్ 16: జింక ముఖం వెనక కాగితాన్ని చిన్నగా కత్తిరించండి (బొమ్మలో చూడండి)

స్టెప్ 17: స్టెప్ 16లో కాగితాన్ని కట్ చేసిన చోట మళ్లీ మధ్యలోకి సన్నగా కత్తిరించండి. అవే కొమ్ములు. అంతే ధ్రువజింక రెడీ!



ఎవడు సన్యాసి?

నీతి కథ

ఒక రాజుగారికి సన్యాసులంటే ఎంతో భక్తి. సంసారాన్ని త్యజించి, ముక్తి మార్గంలో పయనించే సన్యాసులు అందరి కన్నా గొప్పవారని ఆయన విశ్వాసం. అటువంటి సన్యాసులు భిక్షమెత్తుకుని బతకటం ఆయనకు నచ్చలేదు. అందుచేత ఆయన మంత్రిని పిలిచి, "మన రాజ్యంలో ఉన్న ఒక్కొక్క సన్యాసికి పదివేల వరహాల చొప్పున పంచిపెట్టండి," అన్నాడు.

దేశంలో సన్యాసులకు కొదవలేదు. అందరికీ తలా పదివేలూ ఇస్తే ఖజానా ఖాళీయే. అయినా రాజుకు ఎదురు చెప్పలేక, "చిత్తం, అలాగే!"అని మంత్రి వెళ్లిపోయాడు.

మర్నాడు సభలో రాజు మంత్రిని, "మీకు అప్పగించిన కార్యం నెరవేర్చారా?" అని అడిగాడు. "క్షమించాలి మహారాజా! సన్యాసి అనేవాడు ఎవడూ నాకు కనిపించలేదు." అన్నాడు మంత్రి.

రాజు ఆశ్చర్యపోయాడు.

"అవును, ప్రభూ! నిజమైన సన్యాసి తుచ్ఛమైన ధనం స్వీకరించడు. ధనం స్వీకరించిన వాడెవడూ నిజమైన సన్యాసి కాజాలడు" అన్నాడు మంత్రి.

\- సింగంపల్లి అప్పారావు

కిడ్ సైంటిస్ట్!

కప్పులో లావా!

కావలసిన వస్తువులు


గాజు గ్లాసు
ఏదైనా నూనె - పావు కప్పు
ఉప్పు - ఒక స్పూను
నీరు - సరిపడా
ఎరుపు రంగు ఫుడ్‌కలర్




ప్రయోగం చేసే విధానం

గ్లాసును మూడొంతుల నీటితో నింపండి.
దీనికి ఐదు చుక్కల ఫుడ్ కలర్‌ను కలపండి
ఇందులో నెమ్మదిగా నూనెను పోయండి. అది నీటి పైన తెట్టు కడుతుంది.
నూనె తెట్టుపైన ఉప్పును చల్లండి.
ఇప్పుడు గ్లాసులో లావా పైకి ఉబికివస్తూ కనిపిస్తుంది.
ఉప్పు చల్లిన ప్రతిసారి లావా ఉప్పొంగుతుంది.

దారి కనుక్కోండి!



చదవండి



తాతయ్య కోసం!

నలుగురు పిల్లలు... వాళ్ల తాతయ్య దగ్గర ఎంతో అల్లారు ముద్దుగా పెరుగుతూ ఉంటారు. ఇంతకీ వాళ్ల తాతయ్యను నానా అని పిలుస్తూ ఉంటారు. తల్లిదండ్రులు బాగా బిజీ. పెద్ద ప్రభుత్వ అధికారులు. పిల్లలను చూసుకొనే తీరక లేదు. పేరుకు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ అయినా క్రమశిక్షణ పేరుతో కట్టేయకుండా ఆటపాటలను కూడా నేర్పుతాడు. ఇలా హాయిగా గడిచిపోతున్న జీవితంలో పెద్ద కుదుపు. తాతయ్యలో మార్పు కనబడుతోంది. ఏది గుర్తుంచుకోలేకపోతున్నాడు. వయసు మీదపడుతోందా కదా అని అనుకున్నారు. కానీ, విషయం సీరియస్ అవుతోంది. పాకెట్ మనీని రెండేసి సార్లు ఇవ్వడం, ఒకసారి కూతురు ఇంటికి వస్తే ఆమెను కూడా గుర్తుపట్టలేకపోవడం... ఈ సంఘటనలు చూసి షాకయ్యారు. డాక్టర్ దగ్గరకు తీసికెళితే, అల్జీమర్స్ వ్యాధి అన్నారు. అంటే తాతయ్యకు జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్న విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఇక, పెద్దాయన్ని హాస్పిటల్‌లో చేర్పించి, వీరిని బోర్డింగ్ స్కూల్లో జాయిన్ చేద్దామనుకున్నార వారి తల్లిదండ్రులు. పిల్లలకు ఆ ఇల్లు అందమైన లోకం. ఓ రంగుల కల. దాన్ని చెదరగొట్టే ప్రయత్నాలను ఆపాలనుకున్నారు ఆ పిల్లలు. అందుకే ఓ ప్లాన్ వేశారు! చిన్నతనం నుంచి ఎంతో బాగా పెంచిన తాతయ్యను ఎలా చూసుకున్నారు. అనేదే మిగతా కథ. ఇదే 'అర్ నానా వజ్ ఎ నట్‌కేస్'. అనే పుస్తకం ఇతివృత్తం. రంజిత్ లాల్ దీన్ని రచించారు.

తెలుసా!



ఝాన్సీరాణి లక్ష్మీభాయి అసలు పేరు మణికర్ణిక.


ఇది విన్నారా?

కారా సముద్రం!



ఆర్కిటిక్ మహాసముద్రంలో ఓ చిన్న భాగం కారా సముద్రం. దీని విస్తీర్ణం 3.40 లక్షల చ. మైళ్లు. లోతు 2034 అడుగులు. ఇది రష్యా సైబీరియా ప్రాంతానికి పశ్చిమంగా ఉంది. నొవాయా జెమ్‌లాయా, ఫ్రాంజ్ జోసెఫ్ ల్యాండ్ ద్వీపకల్పాలకు మధ్యన ఉంది. ఎనీసే, ఓబ్, ప్యాసినా లాంటి పలు నదులు ఈ సముద్రంలోకి ప్రవహిస్తున్నాయి. ఈ సముద్రం మత్స్యసంపదకు పెట్టింది పేరు.

12 తేడాలను గుర్తించండి..



తమాషా ప్రశ్నలు - జవాబులు

కలవరములో స్వప్నము - కల
గంగరేణిలో నీరు - నీరు
కేదారములో త్రాడు - దారము
జాగరణములో యుద్ధము - రణము
సంగీతములో హిందూమతగ్రంథము - గీత

సేకరణ: గంగరాజు మోహనరావు

విభిన్నం



రెస్టారెంట్‌లో సర్వ్ చేస్తున్న రోబోలు



రోబో రెస్టారెంట్

ఇక్కడ రోబోలు వడ్డిస్తాయి..!

అది ఓ బిజీ రెస్టారెంట్. వెయిటర్లు ఉండరు... కానీ కోరుకున్న వంటకాలు చిటికెలో టేబుల్‌పై ప్రత్యక్షమవుతాయి. ముచ్చటగొలిపే రూపం... అబ్బుర పరిచే పనితనం... మనుషులు కాని మనుషులు... మరమనుషులు అక్కడ ఎంతో క్రమశిక్షణతో సర్వ్ చేస్తుంటారు. నమ్మకం కుదరడం లేదా..! అయితే దేశంలోనే ఈ తొలి రోబో రెస్టారెంట్‌ను చూసేద్దాం రండి...

చెన్నై నుంచి మహాబలిపురం వెళ్లే రోడ్డు.... తెలుగు విద్యార్థులు అధికంగా చదువుకునే సత్యభామ విశ్వవిద్యాలయం వద్దకు వెళ్లగానే స్వాగతం పలుకుతుందీ రోబో రెస్టారెంట్. నాగపట్టణంకు చెందిన వెంకటేష్, అతని స్నేహితుడు, ఆర్కిటెక్ట్ కార్తీక్ కలిసి గత ఏడాది నవంబర్‌లో ఈ రోబో థీమ్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఐటీ ఉద్యోగం కోసం చెన్నైకి వచ్చిన వెంకటేష్.. అంతకు ముందు నాలుగేళ్లుగా ఇదే భవనంలో 'మోమో' పేరుతో చైనీస్, థాయ్ రెస్టారెంట్‌ను నడిపారు. అయితే కాలం మారుతోంది. అందరూ కొత్తదనాన్ని కోరుకొంటున్నారు. వారి అభిరుచికి తగ్గట్టుగా వైవిధ్యంగా ఏదో చేయాలన్న ఆలోచన ఆయనకు నిద్ర పట్టనివ్వలేదు. ఈ క్రమంలోనే చైనా, జపాన్, పలు తూర్పు దేశాల్లో అమితంగా ఆకట్టుకుంటున్న రోబో థీమ్డ్ రెస్టారెంట్ల గురించి తెలిసింది. ఇలాంటివి భారత్‌లో ఎక్కడా లేకపోవడంతో వాటిపై మరింత ఆసక్తి పెరిగింది.

చైనా రెస్టారెంట్ల పరిశీలన...

ఆర్కిటెక్ట్ కార్తీక్ చైనా వెళ్లి రోబో రెస్టారెంట్‌లను సందర్శించి, వాటి గురించి తెలుసుకుని వచ్చారు. తరువాత 'మోమో'ను రోబో థీమ్డ్ రెస్టారెంట్‌గా మార్చేశారు. రోబోల కొనుగోలు, వాటి నిర్వహణకు మాత్రమే అదనంగా ఖర్చయిందంటారు కార్తీక్. భారత్‌లోనే మొట్టమొదటి రోబో రెస్టారెంట్ ఇది. చైనా, జపాన్‌లో రోబో రెస్టారెంట్లు చాలా ప్రసిద్ధి. అదే కాన్సెప్ట్‌ని భారత్‌కు తీసుకొచ్చి, చెన్నైలో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. చైనా సాంకేతికతతో రోబోలను దిగుమతి చేసి రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. చైనీస్, థాయ్ శాకాహారం, మాంసాహార రుచులను ఇక్కడ రోబోలు సరఫరా చేస్తాయి.



మా ఊహకు మించిన స్పందన

రెస్టారెంట్ బిజినెస్‌లో మాకు అనుభవం ఉండడంతో కొత్తగా, వైవిధ్యంగా ఏదైనా చేయాలనుకున్నాం. రోబో రెస్టారెంట్ గురించి తెలిసి వెంటనే ప్రారంభించాం. కస్టమర్ల నుంచి మేము ఊహించినదానికంటే అధికంగా స్పందన వస్తోంది. రోబో కాన్సెప్ట్‌కు ఆకర్షితులై రెస్టారెంట్‌కు వస్తున్నా... ఆ తరువాత రుచికరమైన వంటకాల వడ్డనతో ఆస్వాదిస్తున్నారు. ముంబై, బెంగళూరుల నుంచి కూడా కస్టమర్లు వస్తుండటం విశేషం. అక్కడ కూడా ఇదే థీమ్‌తో రెస్టారెంటు ప్రారంభించేందుకు చాలా మంది ఆరా తీస్తున్నారు. చెన్నైలో మరిన్ని శాఖలు ప్రారంభించే యోచనలో ఉన్నాం.

● **వెంకటేశ్,** రెస్టారెంట్ యజమాని

ప్రీ డిఫైన్డ్ సాఫ్ట్‌వేర్...

ఈ రెస్టారెంట్‌లో ప్రస్తుతం నాలుగు లేడీ రోబోలు ఉన్నాయి. నగటు మనిషి ఎత్తులో తెలుపు, నీలం రంగుల్లో... మెడలో స్కార్ఫ్‌తో చూడగానే ఇట్టే ఆకర్షిస్తాయి. స్కార్ఫ్ రంగును బట్టి రోబోలకు 'బ్లూ డాట్, వయొలెట్, బటర్‌ఫ్లై, పింక్ అండ్ రెడ్' అని పేర్లు పెట్టారు. ప్రతి రోబోకీ రెండు ట్రేలు అమర్చి ఉంటాయి. వెయిటర్లు ఫుడ్ ఎలా తీసుకొస్తారో అదే విధంగా రోబోలు ఫుడ్ ట్రేలతో సర్వ్ చేస్తుంటాయి. ప్రత్యేక ప్రీ డిఫైన్డ్ సాఫ్ట్‌వేర్, సెన్సార్ల ద్వారా ఈ రోబోలు పనిచేస్తాయి. రెస్టారెంట్ ప్రారంభించే ముందు రోబోలను వైఫైతో కనెక్ట్ చేస్తారు. కస్టమర్ ఆర్డర్ ప్రకారం ఏ రోబో ఏ టేబుల్ దగ్గరకి ఆర్డర్ తీసుకెళ్లాలో కిచెన్‌లోనే ఆపరేటర్ సెట్ చేస్తారు. వంటకాలు రెడీ అయిన తరువాత రోబో ట్రేలలో వాటిని ఉంచుతారు. ఫ్లోర్ కింద భాగంలో ప్రత్యేకంగా అమర్చిన మేగ్నటిక్ ట్రాక్‌పై రోబోలు ముందుకు వెళ్తాయి. సర్వ్ చేసిన అనంతరం రోబో చేతి దగ్గర ఉండే ఎగ్జిట్ బటన్ నొక్కితే తిరిగి కిచెన్‌లోకి వెళ్లిపోయి, తరువాత ఆర్డర్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతుంది. ఇవి బ్యాటరీతో పనిచేస్తాయి. ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే 9 గంటలు నిరంతరాయంగా పనిచేస్తాయి.

ఆహారం... ఆస్వాదనం...

ఇప్పుడీ రోబో రెస్టారెంట్‌కు భోజన ప్రియులు క్యూ కడుతున్నారు. ఐటీ ఉద్యోగులు లక్ష్యంగా దీన్ని ప్రారంభించినా... అన్ని వర్గాల నుంచీ మంచి స్పందన వస్తోంది. కుటుంబ సమేతంగా... ఓ వైపు నోరూరించే కాంటినెంటల్ రుచులు... మరో వైపు రోబోల వడ్డనలను ఆస్వాదిస్తున్నారు. పర్యాటక స్థలానికి వచ్చినట్లే ఫీలవుతున్నారు. పిల్లలైతే రోబోల చుట్టూ తిరుగుతూ వాటితో ఆడుకొంటున్నారు. యువత సెల్ఫీలు తీసుకుంటున్నారు. "ఫుడ్ ఎక్కడైనా తినొచ్చు. కానీ, రోబోలు సర్వ్ చేస్తుంటే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేము. కాన్సెప్ట్ అద్భుతంగా ఉంది" అంటూ కస్టమర్లు ముచ్చట పడిపోతుంటే... టేబుల్స్ అన్నీ రిజర్వ్ అయిపోతుండటంతో నిర్వాహకులూ ఆనందంలో మునిగిపోతున్నారు. ఈ కాన్సెప్ట్‌ను 'చిట్టి'... అదేనండి 'రోబో' చిత్రం హీరో రజనీకాంత్, దాని సృష్టికర్త శంకర్ కూడా తెగ మెచ్చుకున్నారట!

● **గనిరెడ్డి అరుణ్‌కుమార్,** చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

బార్లీ.. భలే మంచి ఫుడ్డు

- సాధారణంగా ఎక్కువ శక్తినిచ్చే ఆహార పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతూ ఉంటుంది. అయితే బార్లీ ఇందుకు భిన్నమైనది. ఎక్కువ శక్తినిచ్చే పదార్థమే అయినా సులభంగా జీర్ణమవుతుంది. అందుకే అస్వస్థులైన వారికి బార్లీ ద్రావణం ఇస్తూ ఉంటారు. లో-ఫ్యాట్ డైట్‌గా కూడా బార్లీ ఇటీవల బాగా ప్రాచుర్యం పొందుతోంది.



- చెడు కొలెస్ట్రాల్ పెరుగుతోందన్నా, గ్లూకోజ్ నిలువలు పెరుగుతున్నాయన్నా మనసు వెంటనే వైద్య చికిత్సల మీదికే వెళుతుంది. కానీ, ఆ అవసరం లేకుండా, ప్రకృతి సహజమైన ఆహార పదార్థాలు కూడా వాటి నియంత్రణకు తోడ్పడతాయనే అంశం మాత్రం మన దృష్టికే రాదు. నిజానికి ఈ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిండంలోనూ, ప్రి- డయాబెటిక్ స్థాయికి వెళ్లిన గ్లూకోజ్ నిలువలను సాధారణ స్థాయికి తీసుకు వెనక్కడంలోనూ బార్లీ బాగా తోడ్పడుంది. అందుకే టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు బార్లీని తమ ఆహారంలో ఒక ప్రధాన భాగంగా చేర్చుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- మూత్ర విసర్జన సాఫీగా లేక శరీరం ఉబ్బిపోతున్న వారికి బార్లీ ధాన్యం గొప్ప ఔషధంగా (డ్యూరెటిక్) పనిచేస్తుంది.
- బార్లీ ధాన్యంలో మరో విశేషం కూడా ఉంది. ముఖ్యంగా ఓట్లు, గోదుమల వంటి ధాన్యాన్ని శుద్ధి చేసినప్పుడు వాటిలోని పీచుపదార్థం హరించుకుపోతుంది. కానీ, బార్లీలో ఉండే బీటా - గ్లూకన్ అనే ప్రత్యేక పీచుపదార్థం శుద్ధి చేసిన తర్వాత కూడా స్థిరంగా ఉంటుంది.

మీకు మీరే డాక్టర్

కసింతలో బోలెడు సుగుణాలు

- కసింత వేరును పుల్లని పండ్ల రసంతో గానీ, పుల్లటి మజ్జిగతో గానీ మెత్తగా నూరి, పూస్తే, సెబ్బెం, తామర, గజ్జి తగ్గిపోతాయి.



- వేరు రసాన్ని వెన్నతో కలిపి మర్దన చేస్తే పక్షవాత వైద్యంలో ఉపయుక్తంగా ఉంటుంది. నరాలు కూడా పటుత్వం పొందుతాయి.
- దీని గింజల చూర్ణాన్ని ఒక స్పూను తేనెతో కలిపి తీసుకుంటే అతి మూత్రం వ్యాధి హరిస్తుంది.
- నీడకు ఎండించిన ఆకుపొడిని తేనెతో తీసుకుంటే, దగ్గు, నులిపురుగులు, ఆయాసం, పలురకాల చర్మరోగాలు తగ్గుతాయి.
- ఆకులను వెచ్చచేసి రసం పిండి 3 చుక్కలు చెవిలో వేస్తే, చెవిపోటు తగ్గుతుంది.
- నాలుగు గ్రాముల మెత్తటి చూర్ణానికి 10 గ్రాముల తేనె కలిపి రెండు పూటలా తీసుకుంటూ పాలు తాగుతూ ఉంటే, వీర్యపుష్టి కలుగుతుంది,
- 40 నుంచి 60 గ్రాముల పంచాంగ కషాయం (వేళ్లు, కాండం-బెరడు, ఆకులు, పూలు, కాయలు) తాగుతూ ఉంటే, రక్తశుద్ధి జరిగి చర్మరోగాలు తగ్గుతాయి.
- ఆకును మెత్తగా నూరి గానీ, లేదా రసాన్ని తీసి గానీ రాస్తే పురుగు కాటుతో వచ్చే సమస్యలు నివారించబడతాయి.

కౌన్సెలింగ్ కార్నర్

వాహనాలే కనిపించడం లేదు...



నా వయసు 52. డ్రైవర్‌ను. 6 మాసాలుగా, రాత్రిపూట డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు దృష్టి చెదిరిపోతోంది. దీనివల్ల ఎదురుగా ఉన్న వాహనాలు ఆ కాసేపు స్పష్టంగా కనిపించడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరిగిపోతుందోనని ఆందోళన. ఈ సమస్యకు గల కారణమేమిటి? ఈ సమస్యకు ఎలాంటి వైద్య చికిత్సలు ఉంటాయి?

- ఎన్ ప్రకాశ్, కరీంనగర్

సహజంగా ఎంతో స్పష్టంగా ఉండే కంట్లోని కటకం, 50 ఏళ్లు దాటాక కొన్ని మార్పులకు లోనవుతుంది. ఈ కారణంగానే ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు దృష్టి చెదురుతుంది. ఇది మరీ ఎక్కువై, ఎదురుగా వచ్చే వాహనాలు అసలే కనపడకుండాపోయే స్థితి ఏర్పడితే దాన్ని తీవ్రమైన విషయంగానే పరిగణించాల్సి ఉంటుంది. ఈ పరిణామం కంట్లో శుక్లం ఏర్పడటం వల్ల కావచ్చు. కంటి పరీక్ష చేయిస్తే సరైన వైద్య చికిత్సలు లభిస్తాయి. ఈ సమస్యకు దృష్టిలోపం ఒక్కటే కారణమైతే దాన్ని కంటి అద్దాలతో సరిచేయవచ్చు. ఒకవేళ శుక్లం పెరిగితే సర్జరీ తప్పనిసరి. ఆ తర్వాత యథావిధిగా మీరు డ్రైవింగ్ చేసుకోవచ్చు.

● **డాక్టర్ మురళీ కృష్ణమాచారి ఆసూరి**
కన్సల్టెంట్ ఆప్తమాలజిస్టు, సులోచనా ఐ సెంటర్,
బషీర్‌బాగ్, హైదరాబాద్.

శ్రీ సుడోకు - 120

		9				3		5
7				3		2		
		2	7			6	9	
8					2			
	4						2	
			1					4
	2	6			5	7		
		4		1				9
1		7				4		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 119 సమాధానం

6	7	8	4	9	5	1	2	3
1	2	4	7	3	6	5	9	8
5	3	9	2	1	8	7	4	6
7	5	2	1	8	4	3	6	9
8	4	6	9	5	3	2	7	1
9	1	3	6	2	7	4	8	5
3	6	7	8	4	1	9	5	2
4	9	5	3	6	2	8	1	7
2	8	1	5	7	9	6	3	4

వినూత్నం



ఇది హోమ్‌లీ సినిమా

కాస్తంత రిచ్ పీపుల్ ఇంటికి వెళ్ళగానే ముందుగా చక్కగా అలంకరించిన పూజ గదినో, సువిశాలమైన డైనింగ్ టేబుల్‌నో చూపించరు. 'మా హోమ్ థియేటర్ చూద్దురు గాని రండీ' అంటూ డి.టి.ఎస్.ను తలపించే సౌండ్ సిస్టమ్ ఉన్న హోమ్ థియేటర్ హాల్‌ను చూపిస్తారు. కొత్తగా బ్లూ రే ప్రింట్ ఉన్న వీసీడీని ప్లే చేసి మనం అబ్బురపడుతుంటే వాళ్లు ఆనందిస్తుంటారు. అదే హాలులో టిఫిన్లూ, టీలూ సరఫరా చేసేస్తారు. హోమ్ థియేటర్ ఉండటం అనేది వారికి ఓ గౌరవం, ఓ ప్రతిష్ఠ. అలాంటి వారి కోసమే హెచ్.టి.ఓ. క్లబ్ (హోమ్ థియేటర్ ఓనర్స్ క్లబ్) అనేది ఏర్పడింది. విశేషం ఏమంటే ప్రపంచవ్యాప్తంగా ఇలా హోమ్ థియేటర్ ఓనర్స్ కోసం ప్రత్యేకంగా నిర్మితమవుతున్నవి తెలుగు చిత్రాలు కావడం గర్వకారణం.

సినిమా పంపిణీ వ్యవస్థలో గుత్తాధిపత్యం ఉందని, మొత్తం చిత్రసీమను 'ఆ నలుగురే' శాసిస్తున్నారన్నది ఎంతోకాలంగా వినిపిస్తున్న మాట. అందులో వాస్తవం ఎంత అనేది పక్కన పడితే నానా కష్టాలు పడి థియేటర్లను పొంది, లక్షల అద్దె చెల్లించి, అందులో ప్రదర్శించే బదులు హోమ్ థియేటర్లలోనే డైరెక్ట్‌గా సినిమాలు ఎందుకు విడుదల చేయకూడదనే ఆలోచన హెచ్.టి.ఓ. క్లబ్ ప్రమోటర్ కమ్ సినిమా డైరెక్టర్ వీరశంకర్‌కు వచ్చింది. దాదాపు రెండేళ్ళ పాటు దీనిపై పరిశోధన చేసి, యునిక్ కాన్సెప్ట్ థియేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో భాగంగా 2017 ఆగస్ట్ 17న హెచ్.టి.ఓ. క్లబ్ (హోమ్ థియేటర్ ఓనర్స్ క్లబ్)ను స్థాపించారు. వివిధ దేశాలలో ఉన్న తెలుగువారిలో హోమ్ థియేటర్లున్న వారికి ఒరిజినల్ కంటెంట్ అందించడమే దీని ప్రధాన లక్ష్యం.

ఈ సంస్థ జరిపిన సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 13 లక్షల తెలుగు కుటుంబాల్లో హోమ్ థియేటర్లు ఉన్నాయి. వారందరినీ లక్ష్యంగా చేసుకుని వారానికి రెండు గంటల పాటు ఉచితంగా వినోదాన్ని అందించే ఏర్పాట్లు హెచ్.టి.ఓ. క్లబ్ చేస్తోంది. ఇప్పటికే ఈ సంస్థకు భారత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 3 వేల మంది, విదేశాలలో 3 వేలమంది సభ్యులు ఉన్నారు. వచ్చే రెండేళ్ళలో లక్షన్నర సభ్యత్వాలు చేయించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు.

తొలిసారిగా ఓ తెలుగు సినిమా!

నాటకాల స్థానంలోకి థియేటర్లు, ఆ థియేటర్ల స్థానంలోకి మల్టీప్లెక్సులు వచ్చినట్టే మారుతున్న సమాజంలో కొత్త కొత్త ప్రయోగాలకు తగినంత స్పేస్ ఉంటుంది. దానిని గ్రహించి, చక్కగా వినియోగించుకోవడమే మనం చేయాల్సిన పని అని వీరశంకర్ చెబుతున్నారు. అలా హోమ్ థియేటర్ల ఓనర్ల కోసం మరెక్కడా దొరకని, ఎక్కడా ఉపయోగించని, వారి కోసం మాత్రమే వినోదాన్ని అందించే ప్రయత్నం తాము చేస్తున్నామన్నారు. అందులో



భాగంగానే దాదాపు కోటి డెబ్బై అయిదు లక్షల రూపాయల బడ్జెట్ తో 'అలా నేను... ఇలా నువ్వు' అనే సినిమాను ఇప్పుడు నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వి.ఎన్. ఆదిత్య నిర్దేశకత్వం వహించే ఈ చిత్రానికి వీరశంకర్ కథ, కథనం అందిస్తున్నారు. రాజ్ కందుకూరి సమర్పణలో వీరశంకర్ సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై ఈ చిత్రం నిర్మాణం కానుంది. దర్శక, నిర్మాత మారుతి ఇష్టపడి రాసిన టైటిల్ లోగోను, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవల విశాఖపట్నంలో ఆవిష్కరించారు. శనివారం నాడు ఈ సినిమాను పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్‌లోని సారథీ స్టూడియోస్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. సాయి రోనక్, అమృతా అయ్యర్ ఈ చిత్రంలో జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం రేపు పోలవరంలో హీరో హీరోయిన్ల ఇంటి సెట్‌ను భారీ వ్యయంతో నిర్మిస్తుండడం విశేషం. ఈ వేసవిలో చిత్రం షూటింగ్ పూర్తి చేసి, రానున్న జూలై నాలుగున విడుదల చేయాలన్నది మా ప్రయత్నం అని వీరశంకర్ చెప్పారు.

హోమ్ థియేటర్లలోనే రిలీజ్!

ఇలా మొదటి ఏడాది ఏకంగా నాలుగు చిత్రాలను హెచ్.టి.ఓ. వారి కోసం ప్రత్యేకంగా రూపొందించాలని ప్రయత్నం. వీటి శాటిలైట్ హక్కులు టీవీ ఛానెల్స్ కు అమ్మబోమనీ, అలానే యుట్యూబ్ లోనూ ఈ చిత్రాలను అప్‌లోడ్ చేయబోమనీ, మెయిన్ థియేటర్లలోనూ వీటిని ప్రదర్శించబోమనీ వీరశంకర్ తెలిపారు. 'ఇది కేవలం మా చిత్రం' అని హెచ్.టి.ఓ. క్లబ్ సభ్యులు గర్వపడేలా కంటెంట్‌కూ, క్వాలిటీకీ ప్రాధాన్యమిచ్చి వీటిని రూపొందిస్తామని ఆయన చెప్పారు. ఈ విధంగా మొదటి ఏడాది నాలుగు, రెండో ఏడాది తొమ్మిది, మూడో ఏడాది పన్నెండు చిత్రాలను రూపొందించాలన్నది వీరశంకర్ బృందం పెట్టుకున్న బృహత్తర ప్రణాళిక. "ఇప్పటికే పలువురు ప్రముఖ దర్శకులతో పాటు యంగ్ డైరెక్టర్స్ సైతం మాకు సినిమా చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కొందరు సీనియర్ నిర్మాతలూ కేవలం హెచ్.టి.ఓ. క్లబ్ కోసం సినిమాలు నిర్మించేందుకు ముందుకు వస్తున్నారు. అలా దీపావళికి రెండో చిత్రాన్ని, వచ్చే ఏడాది శివరాత్రికి మూడో సినిమాను, సమ్మర్‌లో నాలుగో చిత్రాన్ని విడుదల చేయాలన్నది మా ప్రయత్నం" అని ఆయన చెప్పారు. ఈ సినిమాల స్క్రిప్టులను పరిశీలించేందుకు నిపుణులతో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం. సినీ ప్రముఖులు సత్యానంద్, అనూరాధా ఉమర్జీ, దేవీప్రసాద్, మదన్, రఘునాథ్ సముద్రాల, హాస్సేన్ షా కిరణ్‌ల నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తుంది.

ఒరిజినల్ కంటెంట్ వ్యూహం

హెచ్.టి.ఓ. క్లబ్ కేవలం సినిమా, ఎంటర్ టైన్‌మెంట్‌కు మాత్రమే పరిమితం కావడం లేదు. మరో పది విభాగాలలో తన సభ్యులకు కంటెంట్‌ను అందించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈవెంట్స్, కల్చరల్, ఎడ్యుకేషన్, ట్రావెల్, కిడ్స్, బిజినెస్, లిటరేచర్, సైన్స్ న్యూస్ రంగాల్లోనూ ఒరిజినల్ కంటెంట్‌ను సభ్యులకు అందించనుంది. ఈ రంగాలకు సంబంధించి ఇప్పటికే



'అలా నేను... ఇలా నువ్వు' చిత్ర బృందంతో నిర్మాత వీరశంకర్

తమ వద్ద దాదాపు 20 గంటలకు పైగా కంటెంట్ ఉందని వీరశంకర్ తెలిపారు. రానున్న మే 31వ తేదీ వరకూ సభ్యులకు ఉచితంగానే తమ కంటెంట్‌ను అందిస్తున్నామని, ఆ తర్వాత ప్రాథమికంగా సభ్యుడి నుండి 2 వేల రూపాయల రుసుము, జి.ఎస్.టి.ని వసూలు చేస్తామని చెప్పారు. ఇవాళ కుటుంబంతో కలిసి ఒక సినిమాకు వెళితే రెండు వేల రూపాయలు ఇట్టే ఖర్చైపోతున్నాయి. ఆ రకంగా చూసినప్పుడు ఏడాదికి మా సంస్థ వసూలు చేస్తోంది నామమాత్రపు రుసుమే అని ఆయన అన్నారు. హెచ్.టి.ఓ. క్లబ్‌కు 'లా మెక్లిన్' కంపెనీ సపోర్టింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. టెక్నికల్ సపోర్ట్‌ను టెక్ డేటమ్ అండ్ ఓమ్నస్ సంస్థ ఇస్తోంది. డిజిటల్ ప్రమోషన్‌ను ఇల్యూజనైజ్ కంపెనీ, డిజిటల్ మార్కెటింగ్‌ను ట్రూటర్స్ ప్రైడ్ అండ్ లుకాజా అనే సంస్థ చేస్తున్నాయి.

ప్రజలకు వినోదాన్ని అందించే తొలి వేదిక రంగస్థలం, రెండవది రేడియో, మూడోది సినిమా, నాలుగోది టీవీ ఈ వరుసలోనే ఐదవ వేదికగా హోమ్ థియేటర్స్ నిలుస్తాయన్నది వీరశంకర్ బృందం నమ్మకం. రెగ్యులర్ ఫీచర్ ఫిల్మ్ తరహాలో రొటీన్ కథలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ఒరిజినల్ కంటెంట్‌ను మాత్రమే తమ వీక్షకులకు అందించడం ఈ బృందం పెట్టుకున్న వ్యూహం. టార్గెట్ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందించే ఈ చిత్రాలు, కార్యక్రమాలు తప్పకుండా ఆదరణ పొందుతాయనే నమ్మకం ఆయన వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రపంచంలోనే తొలిసారి హోమ్ థియేటర్స్ ఓనర్స్ కోసం నిర్మితమవుతున్న ఈ సరికొత్త తెలుగు సినిమాలకు ఎలాంటి ఆదరణ లభిస్తుందో వేచి చూడాలి.

● **వడ్డి ఓంప్రకాశ్ నారాయణ**

రౌడీయిజమ్ చూపిస్తా



- రజనీకాంత్

రజనీకాంత్ హీరోయిజమ్ ఎలా ఉంటుందో ప్రేక్షకులు చూశారు. మరి, రౌడీయిజమ్ ఎలా ఉంటుంది? 'కాలా'లో చూపిస్తా అంటున్నారు. 'కబాలి' ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా, ఆయన అల్లుడు ధనుష్ నిర్మిస్తున్న సినిమా 'కాలా'. కరికాలన్... అనేది ఉపశీర్షిక. శుక్రవారం ఉదయం టీజర్ విడుదల చేశారు. అందులో కథేంటో క్లారిటీగా చెప్పేశారు. 'కాలా అంటే ఎవరు? కాలుడు... కరికాలుడు! గొడవ పడైనా కాపాడేవాడు' అనే డైలాగ్‌లోనే కథంతా దాగుంది. ఈ సినిమాలో ముంబయ్‌లోని ఓ వాడలో శ్రమజీవుల కోసం గొడవపడే నాయకుడిగా రజనీకాంత్ కనిపించనున్నారు. కథ తెలిస్తే కిక్ ఏముంటుంది? అనుకుంటున్నారా! టీజర్‌లో ఆయన్ను చూపించిన తీరు, నటన... అభిమానులను, ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా 'క్యారే.. సెట్టింగా! వీరయ్య బిడ్డనురా. ఒక్కడినే ఉన్నా. దిల్లుంటే గుంపుగా రండిరా' అనే డైలాగ్, తర్వాత వచ్చే ఫైట్... టీజర్ చివర్లో 'ఈ కరికాలుడి పూర్తి రౌడీయిజాన్ని ఎప్పుడూ చూడలేదు కదూ! ఇప్పుడు చూపిస్తా' డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచాయి. హిందీ నటుడు నానా పటేకర్ ప్రతినాయక ఛాయలున్న పాత్ర చేసిన ఈ సినిమాలో నటి హ్యూమా ఖురేషి కీలక పాత్ర చేశారు. దక్షిణాది నటి ఈశ్వరీరావు రజనీ సతీమణి పాత్రలో కనిపించనున్నారు. వచ్చే నెల 27న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



అనుష్క అంగీకరిస్తేనే...

విలక్షణ చిత్రాలు దర్శకుడు బాలా తమిళంలో రూపొందించిన తాజా సినిమా 'నాచియార్'. జ్యోతిక, ఏఆర్ రెహమాన్ మేనల్లుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇటీవల తమిళంలో విడుదలైన ఈ సినిమా రీమేక్ రైట్స్‌ని నిర్మాత కోనేరు కల్పన సొంతం చేసుకున్నారు. విడుదలకు ముందు ఈ సినిమాలోని జ్యోతిక ఆహార్యం విభిన్నంగా ఉండటంతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే, ప్రచార చిత్రాల్లో ఆమె పలికిన సంభాషణలు వివాదస్పదం కావడం, కొందరు పోలీస్ కేసులు పెట్టడం వంటి అంశాలు సంచలనం అయ్యాయి. అందువల్ల, తెలుగు రీమేక్‌లో జ్యోతిక పాత్ర ఎవరు చేస్తారనే ఆసక్తి నెలకొంది. ఫిల్మ్‌నగర్ సమాచారం ప్రకారం... అనుష్క అంగీకరిస్తే ఆమె ముఖ్యతారగా తెలుగులో సినిమా చేయాలనుకుంటున్నారు. ఒకవేళ 'నో' చెప్తే రీమేక్ ఆలోచనలు విరమించుకుని, డబ్బింగ్ చేయాలనుకుంటున్నారట! తెలుగులో సినిమా రీమేక్ చేస్తే బాగుంటుందనే ఆలోచన దర్శకుడు బాలా ఇచ్చారని సమాచారం. ఇప్పుడు అనుష్కను సంప్రతించే పనిలో ఉన్నారు నిర్మాత కోనేరు కల్పన. 'భాగమతి' తర్వాత అనుష్క మరో సినిమాకు సంతకం చేయలేదు. కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మరి, 'నాచియార్' రీమేక్ అంగీకరిస్తారా? లేదా? వెయిట్ అండ్ సీ!



కేన్వాస్ రంగులు

- రాశీ ఖన్నా

"ఇంట్లో అమ్మాయిలు ఉంటే ఆ సందడే వేరుగా ఉంటుంది. ప్రతి పండుగకు కొత్త కళ వస్తుంది.. అని మా తల్లిదండ్రులు తరచూ అంటుంటారు. అన్ని పండుగల సంగతేమో కానీ, నాకు హోలీ అంటే చాలా ఇష్టం. మనసంతా ఉత్సాహంతో నిండిపోతుంది" అని అంటున్నారు రాశీ ఖన్నా. ఇటీవల 'తొలి ప్రేమ'తో సక్సెస్ అందుకున్న రాశీ ఖన్నా ట్విట్టర్‌లో హోలీ శుభాకాంక్షలు చెప్పారు. "మీ జీవితం అనే కేన్వాస్ మీద భగవంతుడు అన్ని రంగులు చల్లాలి. ఆనందాన్ని ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నా. అందరికీ హోలీ శుభాకాంక్షలు. దయచేసి మూగప్రాణులకు మాత్రం హాని కలిగించవద్దు" అని అందులో పేర్కొన్నారు.















హోలీ.. తారల నవ్వుల కేళీ!

జీవితం రంగులమయం. ప్రశాంతతను తెలుపు రంగుతో పోలిస్తే.. చీకటిని దిగులుతో, అభివృద్ధిని ఆకుపచ్చతో, కోపాన్ని, శృంగారాన్ని ఎరుపుతో సూచించవచ్చు. అంతేనా.. ఒక్కో మానసిక రూపాన్ని ఒక్కో రంగు ప్రతిబింబిస్తుంది. మరి అన్ని రంగులను కలిపి చల్లుకుని ఆత్మీయతను చాటుకునే వేళ ముఖంపై చిగురించే రంగు పేరు ఏంటి..? చిరునవ్వు. నిత్యం ప్రేక్షకలోకానికి వినోదాన్ని పంచే నటీనటులందరూ ఆ చిరునవ్వును పూసుకోవడానికి హోలీ ఆడారు. ఆ నవ్వుల రంగులను ట్విట్టర్ సాక్షిగా పంచుకున్నారు. ఈ సందర్భంగా హోలీ శుభాకాంక్షలు చెబుతూ వాళ్లేమన్నారంటే...







రంగులమయం కావాలి!

హోలీ సందర్భంగా అమితాబ్ బచ్చన్ నుదుట జయా బచ్చన్ రంగుతో బొట్టు పెడుతున్న దృశ్యం ఆకట్టుకుంది. 'అందరికీ హోలీ శుభాకాంక్షలు. జీవితంలోని రంగులు ఎప్పటికీ మీతోనే ఉండాలి' అని అమితాబ్ ట్వీట్ చేశారు. తన తల్లిదండ్రులు లత, రజనీకాంత్‌తోనూ, సోదరి ఐశ్వర్య ధనుష్‌తోనూ కలిసి రంగులు పూసుకుని హోలీని జరుపుకొన్న ఫొటోలను సౌందర్య రజనీకాంత్ ట్వీట్ చేశారు. 'సహజ సిద్ధమైన రంగులతో సంతోషంగా, జాగ్రత్తగా ఆడండి' అని అల్లు అర్జున్, వరుణ్ తేజ్ తెలిపారు. రంగుల పండుగ అని నీహారిక కొణిదెల సామాజిక మాధ్యమంలో ఫొటో పోస్ట్ చేశారు. 'హ్యాపీ హోలీ' అని రంగులు పూసుకున్న వదనాన్ని అను ఇమ్మాన్యుయేల్ పోస్ట్ చేశారు. 'అంధకారంలో ఉన్న ప్రపంచాన్ని రంగులమయం చేసే శక్తి మీకుంది. హోలీ సందర్భంగా నేత్రదానం చేయండి' సాయిధరమ్‌తేజ్ తెలిపారు. 'కష్టాలు శాశ్వతం కాదు.. సంతోషకరమైన క్షణాలు ఎదురుచూస్తున్నాయి. మీరు చేయాల్సింది పాజిటివ్‌గా ఉండటమే. జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించండి. ఈ హోలీ మీ జీవితాన్ని మరోసారి రంగులతో, సంతోషంతో నింపాలి' ఖుష్బూ ట్వీట్ చేశారు. ఈ ఏడాది రంగులమయం కావాలని, జంతువులకు హాని చేయవద్దని హన్సిక తెలిపారు. రామ్‌చరణ్, అఖిల్ అక్కినేని, రేణూదేశాయ్, రాయ్‌లక్ష్మీతో పాటు దక్షిణాది, ఉత్తరాది తారలు పలువురు హోలీ శుభాకాంక్షలను సామాజిక మాధ్యమాల్లో తెలిపారు.

సినిమాల సందడి

నాని హీరోగా నటిస్తోన్న 'కృష్ణార్జున యుద్ధం', నితిన్ హీరోగా రూపొందుతోన్న 'చల్ మోహన్‌రంగా' స్టిల్స్ హోలీ సందర్భంగా విడుదలయ్యాయి. ఈ నెల 16న విడుదల కానున్న నిఖిల్ 'కిరాక్ పార్టీ' యూనిట్ హోలీ సంబరాలను నిర్వహించుకుంది.











బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ @ 5

వసంత పంచమి (హోలీ) రోజున కొత్త చిత్రీకరణకు శ్రీకారం చుట్టారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన హీరోగా వంశధార క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, నవీన్ శొంటినేని (నాని) నిర్మిస్తోన్న సినిమా చిత్రీకరణ శుక్రవారం మొదలైంది. హీరోగా సాయి శ్రీనివాస్‌కి ఐదో చిత్రమిది. తొలి రోజు ఫైట్‌మాస్టర్ 'స్టంట్' శివ ఆధ్వర్యంలో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ప్రొఫెషనలిజం ఉన్న హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. విరామం తీసుకోకుండా చిత్రీకరణ చేస్తున్నారు. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లుంటారు. వారెవరన్నది త్వరలో వెల్లడిస్తాం. రచయిత అబ్బూరి రవి, ఛాయాగ్రహకుడు చోట కె. నాయుడు, సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ మా చిత్రానికి పని చేయడం చాలా సంతోషంగా ఉంది" అన్నారు. ఇది కాకుండా శ్రీవాస్ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న 'సాక్ష్యం' చిత్రీకరణ చివరి దశలో ఉంది.



తనివి తీరలేదు



శ్రుతిహాసన్

మనసుకు నచ్చింది ఎదురుగా ఉంటే చూస్తూ ఊరకుండటం ఎంత కష్టమో అనుభవజ్ఞులకే తెలుస్తుంది. ఎదురుగా ఉన్నది తిండి అయినా వస్త్రాలైనా.. ఆఖరికి చెప్పులైనా... సరే. ఈ విషయం గురించి శ్రుతి హాసన్ మాట్లాడుతూ "నా ఫ్రెండ్స్ ఒక్కొక్కరూ ఒక్కో విషయాన్ని ఇష్టపడుతుంటారు. నాకు మాత్రం చెప్పులంటే ప్రాణం. హీల్స్ ఉన్న శాండిల్స్, ఫ్లాట్ చెప్పులు, షూస్.. ఒకటేంటి రకరకాలను సేకరించాను. ఒకానొక సందర్భంలో అవి 100 జతలయ్యేసరికి ఇక చాలు అని అనుకున్నా. కానీ ఆ తర్వాత మరలా ఎక్కడికో షాపింగ్ వెళ్లినప్పుడు టెంప్టింగా కొన్ని జతలు కనిపించాయి. అలా మళ్లీ సేకరణ మొదలైంది. ఇప్పుడైతే ఎన్ని జతలున్నాయో లెక్క కూడా లేదు. ప్రతి డ్రస్‌కీ మ్యాచ్ అయ్యేలా కనీసం నాలుగైదు పెయిర్స్ అయినా ఉంటాయంటే నమ్మాల్సిందే. అయినా వాటి పట్ల నాకు ఎందుకో తనివితీరడం లేదు" అని చెప్పారు.

ఆటో విడిభాగాల పరిశ్రమకు మంచి రోజులు

ముంబై : దేశంలో ఆటో విడిభాగాల పరిశ్రమ ఆదాయాలు వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 13 నుంచి 15 శాతం వరకు పెరిగే ఆస్కారం ఉన్నట్టు ఇక్రా అంచనా వేసింది. అన్ని రకాల వాహనాలకు డిమాండు పెరిగినందు వల్ల గతంలో ప్రకటించిన 9 నుంచి 11 శాతం వృద్ధి అంచనాను ఎగువకు సవరించింది. ప్రధానంగా రవాణా, ప్రయాణికుల వాహనాలు, టూవీలర్ విభాగాలు మంచి వృద్ధి సాధించనున్నట్టు పేర్కొంది. పరిశ్రమ టర్నోవర్‌లో 26 శాతం వాటా ఉన్న 48 ఆటో విడిభాగాల పరిశ్రమలు మూడో త్రైమాసికంలో 18.5 శాతం ఆదాయాల వృద్ధిని నమోదు చేసినట్టు తెలిపింది. ఏప్రిల్-డిసెంబరు నెలల మధ్య కాలంలో ఆటో విడిభాగాల రంగం స్థూలంగా 12.3 శాతం వృద్ధిని సాధించిందని పేర్కొంది.

ఏమో.. చెప్పలేం!

» నీరవ్ న్యూయార్క్‌లో ఉన్నాడన్న వార్తలను

ధ్రువీకరించలేమన్న అమెరికా ప్రభుత్వం



వాషింగ్టన్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ను నిలువునాముంచిన వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ న్యూయార్క్‌లో తలదాచుకున్నాడన్న వార్తలు తమ ప్రభుత్వం దృష్టికి వచ్చాయని అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు చెప్పారు. కానీ ఆ వార్తలను ధ్రువీకరించలేమన్నారు. మోదీని వెతికి పట్టుకునే విషయంలో మీ శాఖ ఏమైనా సాయం చేస్తోందా అన్న ప్రశ్నకు అధికారి సమాధానమిస్తూ..న్యాయ శాఖను సంప్రదించాల్సిందిగా కోరారు. అమెరికా న్యాయ విభాగం మాత్రం ఈ విషయంపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించింది. పిఎన్‌బి నుంచి పొందిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు)ల ద్వారా రూ.12,800 కోట్ల మేర రుణాలు తీసుకొని మోసగించిన కేసులో నీరవ్ మోదీతోపాటు గీతాంజలి జెమ్స్ ఓనర్ మెహుల్ చోక్సీ ఇంకా ఇతరులపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)దర్యాప్తు చేస్తున్నాయి.

పిఎన్‌బి కేసులో విచారణకు హాజరు కావాలంటూ నీరవ్ మోదీ అధికారిక ఇ-మెయిల్‌కు సిబిఐ లేఖ రాసింది. వ్యాపారాల్లో బిజీగా ఉండటం వల్ల ఇప్పట్లో ఇండియాకు రావడం కుదరదని నీరవ్ సమాధానమిచ్చాడు. దాంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దర్యాప్తు ఏజెన్సీ.. వచ్చేవారంలోగా విచారణకు ప్రత్యక్షంగా హాజరు కావాలని నీరవ్‌ను హెచ్చరించింది. ఇప్పటికే నీరవ్, చోక్సీలపై లుక్ ఔట్ నోటీసులు జారీ అయ్యాయి.

ఫైర్‌స్టార్ నుంచి బకాయిల వసూలుపై స్టే

నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ నుంచి బకాయిలు వసూలు చేయకుండా అమెరికన్ కోర్టు స్టే విధించింది. దీంతో రుణదాతలు తమ బకాయిలను వసూలు చేసుకునేందుకు రుణగ్రహీతతోపాటు అతని కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీలుండదు. ఇ-మెయిల్, ఫోన్ లేదా మరే ఇతర మాధ్యమం ద్వారానూ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేయడానికీ వీల్లేదు. తమ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే నష్టపరిహారంతోపాటు అటార్నీ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందని కోర్టు రుణదాతలను హెచ్చరించింది. ఫైర్‌స్టార్‌కు అప్పులిచ్చిన డజనుకుపైగా సంస్థలకు ఇందుకు సంబంధించిన ఆర్డరు కాపీలను పంపించింది. సంస్థ రుణదాతలు ఈనెల 30న న్యూయార్క్‌లో సమావేశం కావాలని కోరింది. కాగా ఫైర్‌స్టార్ డైమండ్ ఈ వారంలోనే సంస్థ దివాలా ప్రకటించింది. దివాలా కేసులను విచారించే న్యూయార్క్ సదరన్ బ్యాంక్‌రప్టసీ కోర్టులో చాప్టర్ 11 వాలంటరీ పిటిషన్‌ను ఫైల్ చేసింది. ఫైర్‌స్టార్, దాని అనుబంధ కంపెనీల్లో నీరవ్ మోదీ మెజారిటీ వాటా కలిగి ఉన్నారు.

డబ్బులివ్వకుండా వేధించేవారట!

నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల వ్యాపార తీరుపై డైమండ్ ఇండస్ట్రీ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీరవ్, చోక్సీలు తమ నుంచి వజ్రాలు కొనుగోలు చేశాక డబ్బులివ్వకుండా నెలలపాటు వారి చుట్టూ తిప్పుకునేవారని సూరత్ డైమండ్ మర్చంట్లు కొందరు ఆరోపించారు. అందుకే చాలాకాలంగా వారితో లావాదేవీలు జరపడం లేదని అన్నారు. డైమండ్ కటింగ్, పాలిషింగ్‌కు సూరత్ కేంద్ర బిందువు. ప్రపంచంలో 80 శాతం వజ్రాల కటింగ్, పాలిషింగ్ ఇక్కడే జరుగుతుంది.

ఎయిర్‌సెల్ కథ కంచికి ఇలా..

బెడిసి కొట్టిన ఆనంద్ కృష్ణన్ వ్యూహం.. రూ.45 వేల కోట్లు ఆవిరి

ఎన్నో ఆశలతో భారత టెలికాం మార్కెట్లో ప్రవేశించిన మలేషియా వ్యాపార దిగ్గజం ఆనంద కృష్ణన్ దేశంలోని సంక్లిష్ట వ్యాపార వాతావరణం ముందు ఓడిపోయారు. మలేషియాలో అత్యంత సంపన్నుడు, పెట్టుబడి వ్యూహాల్లో దిట్ట కృష్ణన్. కాని ఎయిర్‌సెల్ మాత్రం ఆయన పెట్టుబడుల అనుభవంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది.





» మార్కెట్ పోటీ, జియో దెబ్బతో ఉక్కిరి బిక్కిరి

ప్రపంచంలో త్వరితగతిన విస్తరిస్తున్న మొబైల్ నెట్‌వర్క్‌ల్లో ఒకటైన భారత మార్కెట్‌పై ఎన్నో ఆశలతో ఆనంద్ కృష్ణన్ (79) ఎయిర్‌సెల్‌లో 700 కోట్ల డాలర్లు (రూ.45,500 కోట్లు) గుమ్మరించారు. ఎయిర్‌సెల్ దివాలా ప్రకటించడంతో గత 12 సంవత్సరాల కాలంలో తన యాజమాన్యంలోని హోల్డింగ్ కంపెనీ మాక్సిస్ కమ్యూనికేషన్స్ బిహెచ్‌డి ద్వారా పెట్టిన పెట్టుబడి అంతా ఆవిరైపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ వారం ప్రారంభంలో ఎయిర్‌సెల్ దివాలా ప్రకటన చేసిన విషయం విదితమే. విదేశీ పెట్టుబడిదారులను విపరీతంగా ఆకర్షించిన భారత టెలికాం మార్కెట్లో తీవ్రమైన పోటీ, నియంత్రణాపరమైన అనిశ్చితుల కారణంగా చతికిలబడిపోయిన కంపెనీల సరసన అది కూడా చేరిపోయింది.

వంద కోట్లకు పైగా జనాభా కలిగి ఉండి విదేశీ ఇన్వెస్టర్లకు అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్న భారత మార్కెట్ వాస్తవంలో ఎంతో సంక్లిష్టమైనదని, ఇందుకు ఎయిర్‌సెల్ ఉదంతమే నిదర్శనమని పరిశీలకులంటున్నారు. 2006 సంవత్సరంలో అప్పటి దేశ జనాభా 110 కోట్లలో 10 శాతం కన్నా తక్కువ మందే మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్న సమయంలో ఆనంద్ కృష్ణన్ ఎయిర్‌సెల్ కొనుగోలుకు 80 కోట్ల డాలర్ల (రూ.5200 కోట్లు) పెట్టుబడి పెట్టారు. భారత్‌లో మొబైల్ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడం ఖాయమని, ఆ రంగంలో ప్రవేశానికి అదే సరైన సమయమని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ గ్రాడ్యుయేట్ అయిన కృష్ణన్ అంచనా వేశారు. అప్పటికే ఆయన మలేషియా టెలికాం విభాగంలో తిరుగులేని ఆధిపత్యంలో ఉన్నారు. దేశంలోని అతి పెద్ద మొబైల్ నెట్‌వర్క్‌లో కంట్రోలింగ్ వాటాలుండడంతో పాటు పే టెలివిజన్ ఆపరేటర్‌గా కూడా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఆయన యాజమాన్యంలోని మాక్సిస్ కమ్యూనికేషన్ బిహెచ్‌డి హోల్డింగ్ కంపెనీగా ఎయిర్‌సెల్‌లో 45 శాతం వాటా తీసుకుంది. 340 కోట్ల డాలర్లు షేర్‌హోల్డర్ అడ్వాన్స్‌గాను, 120 కోట్ల డాలర్లు కామన్ స్టాక్‌గాను, 160 కోట్ల డాలర్లు రిడీమబుల్ ప్రిఫరెన్షియల్ షేర్ల రూపంలోను ఇన్వెస్ట్ చేశారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భారీ పెట్టుబడులైతే పెట్టారు గాని భారత టెలికాం మార్కెట్‌లో పోటీ ఎంత తీవ్రంగా ఉంటుందనేది ఆయన అంచనా వేయలేకపోయారు. సుమారు 12 కంపెనీలు మార్కెట్ వాటా కోసం పడుతున్న పోటీలో భాగంగా కాల్ రేట్లు ప్రపంచంలోనే కనిష్ఠ స్థాయికి తీసుకువచ్చాయి. భారత టెలికాం రంగం పరిస్థితి అనిశ్చితంగా కనిపిస్తున్న తరుణంలో 2016 సంవత్సరంలో రిలయన్స్ జియో రాక ఆ రంగాన్ని మరింత సంక్లిష్ట స్థితిలోకి నెట్టింది.

ఇక పోటీని తట్టుకోవడం అసాధ్యం అని భావించిన తరుణంలో కంపెనీని బతికించుకునేందుకు చివరి ప్రయత్నంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్‌లో విలీనం చేసేందుకు ప్రయత్నం జరిగింది.

కాని టెలికాం కుంభకోణంలో భారీ మొత్తాలు చేతులు మారాయన్న కేసులను పరిశీలిస్తున్న అత్యున్నత న్యాయస్థానం ఎయిర్‌సెల్ చేతిలోని టెలికాం తరంగాల విక్రయం, లీజింగ్‌ను నిలువరించింది. దీంతో గత ఏడాది అక్టోబరులో విలీనం వ్యవహారం పూర్తిగా అటకెక్కేసింది. ఇంక కంపెనీని గట్టెక్కించడం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చిన ఎయిర్‌సెల్ గత బుధవారం నాడు దివాలా పిటిషన్ దాఖలు చేస్తున్నట్టు ప్రకటించింది. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్న పరిశ్రమలో కొత్త ఆపరేటర్ ప్రవేశం, చట్టపరమైన, నియంత్రణపరమైన సవాళ్లు, పీకల్లోతు అప్పులు, భారీగా పెరిగిపోయిన నష్టాలను ఇందుకు కారణంగా పేర్కొంది. ఎన్నో ఆశలతో భారత టెలికాంలో ప్రవేశించిన మాక్సిస్ కమ్యూనికేషన్స్‌కు ఎయిర్‌సెల్ ఒక పీడకలగా మిగిలిపోయింది.

ఉక్కు, అల్యూమినియం దిగుమతులకు

అమెరికా చెక్

సుంకాలు భారీగా పెంపు

» దేశీ కంపెనీల పరిరక్షణ కోసమే
» అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి
» చైనా, ఇయు అభ్యంతరం
» అంతర్జాతీయ వాణిజ్యానికి పెనుప్రమాదం



వాషింగ్టన్ : అమెరికా ఉత్పత్తిదారుల హక్కులను పరిరక్షించేందుకు ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. స్టీల్ దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం ఉత్పత్తులపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సుంకాల విధింపునకు సంబంధించి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే వారం అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రక్షణాత్మక ధోరణుల పేరిట దిగుమతుల సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించటంతో యూరోపియన్ యూనియన్‌లోని దేశాలతో పాటు చైనా కూడా అభ్యంతరం తెలిపాయి. గురువారం ఉక్కు, అల్యూమినియం కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన అనంతరం విలేకరుల సమక్షంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది దీర్ఘకాలం కొనసాగనుంది...అలాగే మీరు దీర్ఘకాలం రక్షణ పొందగలుగుతారు.. మీరు మీ పరిశ్రమలను మళ్లీ వృద్ధిపథంలోకి తీసుకుని వెళ్లండి అని తెలిపారు. దిగుమతి సుంకాల పెంపు కారణంగా అమెరికాలో ఉద్యోగాల కల్పనతో పాటు పరిశ్రమలకు లబ్ధి చేకూరనుందన్నారు. గతంలో అమెరికాకు ప్రాతినిధ్యం వారందరూ ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలు సహా ఇతర పరిశ్రమలను నాశనం చేశారని దుయ్యబట్టారు. ఎలాంటి కారణం లేకుండా అన్ని పారిశ్రామిక యూనిట్లు, కార్లు, ఆటోమొబైల్ ప్లాంట్లు అన్నీ మెక్సికోకు తరలిపోయాయని ఆయన ఆక్షేపించారు. పారిశ్రామిక రంగంలో అమెరికాను మళ్లీ అగ్రస్థానంలో నిలిపేందుకు తాము అన్ని రకాలైన చర్యలు తీసుకుంటామని, ఇందులోభాగంగానే అల్యూమినియం, ఉక్కు పరిశ్రమలను వెనక్కు తీసుకు రావాలని చూస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.

స్వాగతించిన పరిశ్రమ..

దిగుమతి సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని దేశీయ ఉక్కు, అల్యూమినియం పరిశ్రమతో పాటు పలువురు చట్ట సభల ప్రతినిధులు స్వాగతించారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం అత్యంత కీలకమైనదని కాంగ్రెస్ ప్రతినిధి మైక్ బోస్ట్ అన్నారు. సుదీర్ఘకాలంగా సతమతమవుతూ వస్తున్న దేశీయ పరిశ్రమకు ఇది అత్యంత ప్రోత్సాహకరంగా ఉండనుందని ఆయన తెలిపారు. చైనా తన ఉత్పత్తులను ముంచెత్తుతోందని, దీనికి అమెరికా కూడా మినహాయింపు కాదని డెమొక్రాటిక్ సెనేటర్ షెరాడ్ బ్రౌన్ అన్నారు. అమెరికా స్టీల్ రంగ ఉద్యోగాలను కాపాడాలనే లక్ష్యంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

అయితే ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఉక్కు పరిశ్రమ మరింత సంక్షోభంలోకి జారుకోవటమే కాకుండా పెద్ద ఎత్తున ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉందని రిపబ్లికన్ సెనేటర్ ఉటా మైక్ అన్నారు. ట్రంప్ అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ సహా ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్.. ప్రత్యామ్నాయాలను చూపిస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ట్రంప్ తీసుకున్న నిర్ణయం కొంతకాలం పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థపై కొంతకాలం పాటు ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాన్ని ఎదుర్కొనలేక ట్రంప్ ఆందోళనతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ వ్యాఖ్యానించింది. సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించటంతోనే డౌజోన్స్ ఇండస్ట్రియల్ సూచీ 400 పాయింట్లకు పైగా పడిపోవటం గమనార్హం.

చైనాదే అగ్రస్థానం..

అమెరికాకు ఉక్కు ఉత్పత్తులను దిగుమతి చేయటంలో చైనా అగ్రస్థానంలో ఉంది. వాణిజ్యపరంగా రక్షణాత్మక ధోరణుల పేరుతో అమెరికా ఇలాంటి చర్యలకు దిగటం మంచిది కాదని బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హు చున్‌యింగ్ అన్నారు. అమెరికాను ఉదాహరణగా చేసుకుని ప్రపంచంలోని అన్ని దేశాలు ఇలాగే వ్యవహరిస్తే అంతర్జాతీయ వాణిజ్యం పెను ప్రమాదంలో పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు అంతర్జాతీయ వాణిజ్యానికి గండి కొట్టే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరించారని యూరోపియన్ స్టీల్ అసోసియేషన్ ఆరోపించింది. ట్రంప్ తాజా నిర్ణయంతో యూరోపియన్ యూనియన్ నుంచి అమెరికాకు ఉక్కు ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు 50 శాతం వరకు పడిపోయే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని బ్రస్సెల్స్‌లో యూరోపియన్ కమిషన్ చీఫ్ జీన్ క్లాడ్ జంకర్ వెల్లడించారు.

ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు

జాయింట్ వెంచర్

» నిప్పన్ స్టీల్‌తో ఆర్సెలార్ మిట్టల్ జట్టు

న్యూఢిల్లీ : ఎస్సార్ స్టీల్ కొనుగోలు కోసం జపాన్‌కు చెందిన నిప్పన్ నేషనల్ స్టీల్ అండ్ సుమిటోమో మెటల్ కార్పొరేషన్‌తో (ఎన్ఎస్ఎస్ఎంసి) జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయనున్నట్టు ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ ప్రకటించింది. ఈ మేరకు తమ మధ్య ఒక ఒప్పందం కుదిరినట్టు తెలిపింది. ఎస్సార్ స్టీల్ పునరుద్ధరణకు ఫిబ్రవరి 12వ తేదీన సమర్పించిన ప్రణాళికలో ఆ కంపెనీ కొనుగోలుకు ఎన్ఎస్ఎస్ఎంసి తమతో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉన్నదన్న విషయం తెలియచేసింది. దివాలాచట్టం కింద ఇన్‌సాల్వెన్సీ చర్యల కోసం ఆర్‌బిఐ ప్రాథమికంగా గుర్తించిన 12 కంపెనీల్లో ఎస్సార్ స్టీల్ ఒకటి. తాము సమర్పించిన పునరుద్ధరణ ప్రణాళికను ఎంపిక చేసి లాంఛనంగా ఆమోదించినట్టయితే ఆ సంస్థ నిర్వహణకు తమ ఉభయ సంస్థలు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది. కంపెనీ పునరుద్ధరణ, దాని పూర్తి సామర్థ్యాలు వినియోగంలోకి తీసుకురావడం, భారత్‌లో భవిష్యత్తులో ఏర్పడనున్న స్టీల్ డిమాండ్‌లో చురుకైన భాగస్వామిగా నిలవడం అన్న అంశాలన్నీ ఆ పునరుద్ధరణ ప్రణాళికలో ఉన్నట్టు ఆర్సెలార్ మిట్టల్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఎన్ఎస్ఎస్ఎంసితో తాము భాగస్వాములు కావడంపై ప్రస్తావిస్తూ ఉభయులకు గల అనుభవం, నైపుణ్యాలు ఆ భాగస్వామ్యాన్ని శక్తివంతమైనదిగా నిలుపుతుందని ఆ ప్రకటనలో విశ్వాసం ప్రకటించారు. అమెరికాలో తమ మధ్యన ఇప్పటికే మూడు జాయింట్ వెంచర్ భాగస్వామ్యాలు విజయవంతంగా నడుస్తున్నాయని ఆర్సెలార్ మిట్టల్ ఛైర్మన్, సిఇఒ లక్ష్మీ మిట్టల్ అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ ప్రపంచంలో స్టీల్, మైనింగ్ విభాగాల్లోని దిగ్గజాల్లో ఒకటి. 60 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ 18 దేశాల్లో ఉత్పత్తి కేంద్రాలు కలిగి ఉంది.

భారత మార్కెట్లోకి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫిల్మ్ స్కూల్ అయిన న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ (ఎన్‌వైఎఫ్ఎ) భారత్‌లోకి అడుగుపెట్టింది. అమెరికాలోని క్యాంపస్‌లో అందిస్తున్న మూడు పూర్తి స్థాయి ప్రోగ్రామ్స్‌ను, ఇకపై భారత్‌లో అందించనున్నట్లు ఎన్‌వైఎఫ్ఎ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ క్లీన్ వెల్లడించారు. యాక్టింగ్, స్టోరీ రైటింగ్, డైరెక్షన్ విభాగాల్లో ఈ కోర్సులను ఆఫర్ చేయనున్నట్లు ఆయన చెప్పారు. 2011లో తొలిసారిగా భారత్‌లో వర్క్ షాప్‌ను నిర్వహించామని, దీనికి మంచి స్పందన లభించిందన్నారు. 4 వారాలు, 8 వారాల పాటు ఈ విభాగాల్లో శిక్షణను అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో 4 వారాల శిక్షణకు 3.17 లక్షల రూపాయలు, ఎనిమిది వారాల శిక్షణకు 5.25 లక్షల రూపాయల ఫీజును వసూలు చేయనున్నట్లు డేవిడ్ తెలిపారు. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన తరుణ్ భాస్కర్ దాస్యం, నాగ చైతన్య, నారా రోహిత్, క్రిష్ జె సత్తార్, పన్నాగ భరణ, రాకేష్ వర్రె.. ఎన్‌వైఎఫ్ఎలో శిక్షణ పొందిన వారేనని డేవిడ్ తెలిపారు.

ఏ దేశంతోనైనా వాణిజ్యానికి సై

» భారత్.. అత్యంత స్వేచ్ఛా విపణి
» కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు

సింగపూర్: ప్రపంచంలోని అత్యంత స్వేచ్ఛాయుత మార్కెట్లలో భారత్ ఒకటని కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు అన్నారు. అన్ని దేశాలతో వాణిజ్య సంబంధాలు, ఒప్పందాలు కోరుకుంటున్నామని సింగపూర్ పారిశ్రామిక ప్రతినిధులతో ఆయన అన్నారు. అత్యంత చురుకైన ప్రపంచ వాణిజ్య వ్యవస్థ అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక సహకారం (ఆర్‌సిఇపి) సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి సింగపూర్ వెళ్లారు. స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించి మహా ఒప్పందం కోసం జరుగుతున్న ఆర్‌సిఇపి సమావేశంలో 10 మంది సభ్యుల ఆగ్నేయాసియా దేశాల కూటమి(ఆసియాన్)తో భారత్ కలిసి పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో భాగంగా పలు దేశాలతో వీలైనన్ని ద్వైపాక్షిక, బహుముఖ ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు మంత్రి చెప్పారు. తద్వారా ఇతర దేశాలతోపాటు తమ దేశం కూడా లబ్ధి పొందడే ఈ ఒప్పందాల ముఖ్యోద్దేశమన్నారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,330	---	31,280	31,380	30,4900
క్రితం ముగింపు	31,330	---	31,280	31,350	30,380
22 క్యారెట్లు	29,010	---	28,770	29,090	29,040
క్రితం ముగింపు	29,010	---	28,770	29,500	28,930
వెండి (కిలో)	39,200	---	39,200	39,700	41,400
క్రితం ముగింపు	39,200	---	39,200	39,400	41,100

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	72.00	విజయవాడ	73.00
కరీంనగర్	73.00	గుంటూరు	72.00
వరంగల్	72.00	ఒంగోలు	75.00
మహబూబ్‌నగర్	72.00	చిత్తూరు	68.00
కర్నూలు	72.00	నెల్లూరు	70.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	67.00
గోదావరి	72.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	345.00	చిత్తూరు	378.00
వరంగల్	347.00	చెన్నై	385.00
విజయవాడ	340.00	నమక్కల్	370.00
గోదావరి	340.00	బెంగళూరు	375.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00

దేశీ ఐటిలో అప్రమత్త ఘంటికలు!

» అమెరికా, ఐరోపాకు తరలిపోతున్న ఉద్యోగాలు!!
» భారత్‌లో 8000 తగ్గిన కాగ్నిజెంట్ సిబ్బంది..
» యుఎస్‌లో 50,400కు పెరిగిన సంస్థ ఉద్యోగులు
» ఇతర కంపెనీల్లోనూ ఇంచుమించు ఇదే ట్రెండ్
» ఆటోమేషన్.. ఆధునిక టెక్నాలజీల ప్రభావమేనా?





దేశీయ ఐటీ కంపెనీలు ఉద్యోగుల నియామకం విషయంలో వ్యూహాన్ని మార్చాయా..? అవుననే అనిపిస్తోంది. భారత్‌లో కార్యకలాపాలను క్రమంగా తగ్గించుకుంటూ.. అదే సమయంలో అగ్రరాజ్యాల్లో విస్తరణపై సంస్థలు దృష్టిసారించినట్లు గోచరిస్తోంది. అందులోభాగంగానే ఇక్కడి సిబ్బందికి స్వస్తి పలుకుతూ ఇతర దేశాల్లో నియామకాలను పెంచుకునే ట్రెండ్ మొదలైంది. అమెరికా కేంద్రంగా వ్యాపారం కొనసాగిస్తున్న కాగ్నిజెంట్.. యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు ఈమధ్య సమర్పించిన వివరాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. గత ఏడాది చివరినాటికి భారత్‌లో ఈ సంస్థ సిబ్బంది సంఖ్య 8,000 తగ్గింది. అదే సమయంలో అమెరికాలోని కంపెనీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 2,900 పెరిగి 50,400కు చేరుకుంది. అలాగే, యూరప్‌లో కంపెనీ ఉద్యోగులు 2,300 మేర పెరిగారు. మొత్తంగా చూసుకుంటే.. 2016 చివరినాటికి 2,60,200గా ఉన్న కాగ్నిజెంట్ హెడ్‌కౌంట్.. గత ఏడాది ముగిసేసరికి 2.60 లక్షలకు తగ్గింది. అందులో 1.80 లక్షల మంది భారత్‌లోని కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు.

టెక్ ఉద్యోగాలకు టెక్నాలజీ గండం!

గత రెండేళ్ల నుంచి ఐటి రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. వ్యాపారంలో అనిశ్చితి నేపథ్యంలో సంస్థలు వ్యయాలను తగ్గించుకునే పనిలో ఉన్నాయి. ఇందులో భాగంగానే ప్రాధాన్యేతర కార్యకలాపాల ఆటోమేషన్ పెరిగింది. అంతేకాదు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషిన్ లర్నింగ్, అగ్‌మెంటెడ్ లేదా వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక టెక్నాలజీల వినియోగం గణనీయంగా పెరిగింది. వాటిలో ప్రావీణ్యం కలిగిన వారు భారత్‌లో డిమాండ్ తగ్గ స్థాయిలో అందుబాటులో లేకపోవడమే ఐటి ఉద్యోగాలు అమెరికా, యూరప్‌లకు తరలిపోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

ఇతర ఐటి కంపెనీల్లోనూ పరిస్థితులు ఇంచుమించు ఇలాగే ఉన్నట్లు తెలుస్తోంది. దేశీ ఐటి దిగ్గజాలైన టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో కూడా అమెరికాలో నియామకాల పెంపుపై దృష్టి సారించాయి. హెచ్1బి వీసాలపై ట్రంప్ సర్కారు కఠిన ఆంక్షలు విధించిన నేపథ్యంలో సంస్థలు తమ క్లయింట్లకు ఉద్యోగులను సరఫరా చేసేందుకు స్థానికంగా, అందునా స్థానికుల నియామకాలపైనే ప్రధానంగా ఆధారపడాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

ట్రెండ్ ఇలాగే కొనసాగితే దేశంలో ఐటి ఉద్యోగావకాశాలు భారీగా తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఐటి ఉద్యోగం చేస్తున్న వారూ ఆధునిక టెక్నాలజీల్లో ప్రావీణ్యం పెంచుకోకపోతే ఉద్యోగంపై ఆశలు వదులుకోవాల్సిందేనని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

భారీగా తగ్గిన నియామకాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటి రంగం 1.50 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని గతంలో నాస్కామ్ అంచనాలు విడుదల చేసింది. కానీ ఈసారి నియామకాలు లక్షకు పరిమితం అయ్యే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19)నూ ఐటి సెక్టార్ మరో లక్ష మందిని నియమించుకునే అవకాశం ఉందని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఎన్‌సిఎల్‌టికి

ప్రజయ్ ప్రమోటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ప్రజయ్ ఇంజనీర్స్ సిండికేట్‌పై సంస్థకు చెందిన ప్రమోటర్ ఒకరు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో ఫిర్యాదు చేశారు. సంస్థకు చెందిన ప్రమోటర్లలో ఒకరు ఎన్‌సిఎల్‌టి హైదరాబాద్ బెంచ్‌ను ఆశ్రయించారని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పంపిన ఒక ప్రకటనలో ప్రజయ్ ఇంజనీర్స్ తెలిపింది. అయితే సదరు ప్రమోటర్.. ఎన్‌సిఎల్‌టిని ఎందుకు ఆశ్రయించారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. సంస్థ చేపట్టిన ప్రాజెక్టుల విషయంలో కొన్ని భూ వివాదాలు తలెత్తటంతో కొంతకాలంగా కంపెనీ ఆర్థిక పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదు. 2017 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 56.74 కోట్ల రూపాయల టర్నోవర్‌పై 19 కోట్ల రూపాయల నష్టాలను మూటగట్టుకుంది. చెల్లింపుల్లో జాప్యం నెలకొనటంతో పాటు ఇతరత్రా కారణాలు కంపెనీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపించాయి.

ప్రభుత్వ బడులకు మాట్లాడే పుస్తకాలు



- పైలట్ ప్రాజెక్టుగా 200 పాఠశాలల ఎంపిక
- ప్రత్యేక టెక్నాలజీతో పుస్తకాల రూపకల్పన

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు కార్పోరేట్ స్కూళ్లతో పోటీ పడుతున్నాయి. విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యే విధానాలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా నూతన సాంకేతికతతో కూడిన మాట్లాడే పుస్తకాలను విద్యార్థులకు అందజేసేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతానికి 200 పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించారు. ప్రత్యేక టెక్నాలజీతో రూపొందించిన ఈ పుస్తకాలు మాట్లాడుతూ పాఠ్యాంశాలను చెప్పడం విశేషం. ఇప్పటికే పుస్తకాలను ఆయా జిల్లాలకు పంపించేశారు. ఒక్కో పాఠశాలకు రెండు సెట్లు అందజేయనున్నారు. ఒక్కో సెట్లో 100 పుస్తకాలు ఉంటాయి. విద్యార్థులకు సులభంగా పాఠాలు బోధించాలనే ఉద్దేశంతో గతేడాది యూనిసెఫ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ ఈ ప్రాజెక్టును చేపట్టింది. సుమారు యేడాదిన్నర నుంచి ఈ పుస్తకాలను రూపొందించేందుకు పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేయడం గమనార్హం. టెక్నాలజీని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ అందించింది. వచ్చే విద్యా సంసవత్సరానికి అన్ని పాఠశాలలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎలా చదివి వినిపిస్తాయి?

ప్రత్యేక టెక్నాలజీతో రూపొందించిన పుస్తకాలు మాట్లాడుతూ పాఠాలు చెబుతాయి. ఇందుకు ఒక ప్రత్యేకమైన రీడర్‌ను వినియోగిస్తారు. దీనిని పుస్తకంలోని అక్షరాలపై ఉంచితే చాలు..



వాటిని చదివి వినిపిస్తుంది. పదం, వాక్యం, పేరా ఒకేసారి వినొచ్చు. పుస్తకంలో పేజీలకు సెన్సార్ ఉండడం, ప్రతి పాఠ్యాంశాన్ని చిన్న చిప్‌లో అమర్చి రీడర్‌లో పొందుపరచడంతో ఇది సాధ్యమవుతుంది. ఈ పుస్తకాలను 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు అందజేయనున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపే నీతి కథలతో ఈ పుస్తకాలను రూపొందించారు.

మూసివేతకు 11 ఇంజనీరింగ్ కాలేజీల దరఖాస్తు

- కోర్సుల మూసివేతకు మరికొన్ని..
- మరింత తగ్గనున్న ఎంటెక్ సీట్లు
- అదే బాటలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్లు ఈ ఏడాది కూడా భారీగా తగ్గనున్నాయి. 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు ఇంజనీరింగ్ కాలేజీలు మూసివేతకు దరఖాస్తుకు చేసుకోవడమే ఇందుకు కారణం. జేఎన్టీయూ పరిధిలో ఈ ఏడాది ఇప్పటికే 11 ఇంజనీరింగ్ కాలేజీలు మూసివేతకు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ కాలేజీల్లో సుమారు 3 వేల వరకు సీట్లు ఉన్నాయి. కాగా కొన్ని కాలేజీలు పలు కోర్సుల మూసివేతకు దరఖాస్తు చేసుకున్నాయి. 8 కాలేజీలు 11 కోర్సుల మూసివేతకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో సుమారు వెయ్యి వరకు సీట్లు ఉండే అవకాశం ఉంది. అంటే ఈ ఏడాది ఇప్పటికే 4వేల సీట్లు తగ్గడం ఖాయమైంది. ఇంజనీరింగ్ కాలేజీల బాటలోనే ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు నడుస్తున్నాయి. 28 ఎంటెక్ కాలేజీలు.. 77 కోర్సుల మూసివేతకు, ఒక ఎంబీఏ కాలేజీ, 3 ఎంసీఏ కాలేజీలు మూసివేతకు దరఖాస్తు చేసుకున్నాయి.

మే 5వరకు అఫిలియేషన్ పూర్తి

ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను మే 5వ తేదీ వరకు పూర్తి చేయనున్నట్లు జేఎన్టీయూ వీసీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు ప్రారంభించినట్లు తెలిపారు.

రాజకీయ ధూం ధాం..!

అన్ని పార్టీలకూ సాంస్కృతిక విభాగాలు.. కాంగ్రెస్‌లో సాంస్కృతిక సేన ఏర్పాటు

- టీఆర్ఎస్‌కు అండగా అనుబంధ విభాగం
- బీజేపీకి జనచైతన్య కళామండలి
- టీడీపీ కళాజాతలు.. సీపీఐ సాంస్కృతిక దళం
- బీఎల్ఎఫ్, ఇంటి పార్టీలకు సాంస్కృతిక సైన్యం



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ ధూం ధాం జరగనుంది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆయా పార్టీలు తమ విధానాలను కళాకారుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ఈ మేరకు అన్ని పార్టీలూ సాంస్కృతిక విభాగాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. జాతీయ పార్టీలు మొదలుకొని.. కొత్త పార్టీలు, ఆవిర్భావానికి సిద్ధమవుతున్న పక్షాలు కూడా కళాకారులను ప్రచారాస్త్రాలుగా చేసుకోబోతున్నాయి. కొన్ని పార్టీలు ఇప్పటికే కళాబృందాలకు శిక్షణ ప్రారంభించగా, మరికొన్ని వాటి ఏర్పాటులో నిమగ్నమయ్యాయి. అధికార టీఆర్ఎస్‌కు ఓవైపు సాంస్కృతిక సారథి అండ ఉండగా.. మరోవైపు పార్టీ సాంస్కృతిక విభాగం కూడా పనిచేయనుంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ఇటీవలే సాంస్కృతిక సేనను ఏర్పాటు చేసుకుంది. బీజేపీ సైతం జనచైతన్య కళామండలి పేరుతో సాంస్కృతిక విభాగాన్ని నియమించుకుంది. టీడీపీ-టీఎస్.. కళాజాతల పేరుతో కార్యక్రమాలకు సిద్ధమవుతుండగా.. టీజేఏసీ, సీపీఎం నేతృత్వంలోని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ కూడా అదే పనిలో ఉన్నాయి.

పార్టీలకు వెన్నుదన్నుగా..

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేసేందుకు టీఆర్ఎస్ సర్కారు సాంస్కృతిక సారథిని అధికారికంగా ఏర్పాటు చేసింది. దీని ద్వారానే అధికార టీఆర్ఎస్‌కు ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వరకూ సారథి కార్యక్రమాలు కొనసాగించుకోవచ్చు. దీంతో ఎన్నికల నాటికి పార్టీ సాంస్కృతిక విభాగాన్ని టీఆర్ఎస్ రంగంలోకి దించనుంది. ఈ విభాగానికి జిల్లా స్థాయిలో ఒక్కో బృందం చొప్పున, రాష్ట్ర స్థాయిలో మరో బృందం పనిచేస్తున్నాయి. ఇక కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రచారం చేసేందుకు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ 'సాంస్కృతిక సేన' పేరిట విభాగాన్ని ఏర్పాటు చేసింది. గతంలోనూ కాంగ్రెస్‌కు సాంస్కృతిక విభాగం ఉన్నా.. అందులో ప్రజల్లో పాపులారిటీ ఉన్న కళాకారులు ఉండేవారు కాదు. ఈ లోటును పూడ్చుతూ గాయకుడు ఏపూరు సోమన్న ఆధ్వర్యంలో డిసెంబరు 29న కొత్త విభాగాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు బీజేపీ జనచైతన్య కళామండలి పేరిట సాంస్కృతిక విభాగాన్ని పునరుద్ధరించి 80 బృందాలను ఏర్పాటు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయడం ప్రధాన లక్ష్యంగా వీటిని ఏర్పాటుచేస్తున్నా, టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. మార్చిలో బిల్లెం బల్లెం పేరిట ఒగ్గుకథ రూపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనుంది. మేలో 10 వేల డప్పులతో తీన్మార్ తడాఖా పేరిట ఎల్బీ స్టేడియంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ కోసం పార్లమెంటులో పోరాడిన కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌ను గానీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను గానీ ఆహ్వానించనుంది. ఈ భారీ కార్యక్రమం ద్వారా గిన్నిస్ రికార్డుకెక్కాలని, ఆ సర్టిఫికెట్లు డప్పు కళాకారులకు అందించాలని నిర్ణయించింది.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా..

ప్రతిపక్ష పార్టీలు తమ సాంస్కృతిక విభాగాలతో ప్రధానంగా టీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగానే ప్రచారం చేయించనున్నాయి. టీడీపీ-టీఎస్ కళాజాతల పేరుతలో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతోంది. ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని టీజేఏసీ త్వరలో ఏర్పాటు చేయనున్న పార్టీ కూడా తమకు అనుబంధంగా సాంస్కృతిక విభాగం ఉండాలని భావిస్తోంది. సీపీఎం నేతృత్వంలో ఏర్పాటైన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రజా గాయకుడు గద్దర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక సైన్యం ఏర్పాటుకు యోచిస్తోంది. తనతో కలిసివచ్చే పార్టీలకు సాంస్కృతిక మద్దతు ఇస్తానని గద్దర్ ఇప్పటికే ప్రకటించారు. కాగా సీపీఐకి ఇప్పటికే ప్రత్యేకంగా సాంస్కృతిక దళం కొనసాగుతోంది. చెరుకు సుధాకర్ ఏర్పాటు చేసిన తెలంగాణ ఇంటి పార్టీ కూడా సాంస్కృతిక సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంది. కళాకారుల బృందాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది.

ఆధార్ ఇవ్వరు!

- మొబైల్ నెంబర్లూ అందజేయరు
- భూముల రిజిస్ట్రేషన్లకు అవే కీలకం.. 'ధరణి'కీ ఇబ్బందులే!

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం భూరికార్డుల నిర్వహణకు ఉద్దేశించిన 'ధరణి' వెబ్‌సైట్‌లో కోర్ బ్యాంకింగ్ సాంకేతికతను వినియోగించుకోనుంది. సాధారణంగా కోర్ బ్యాంకింగ్ అనగానే బ్యాంకులు గుర్తొస్తాయి. ఏటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చిన బ్యాంకులు ఈ విధానాన్నే ఉపయోగించుకుంటున్నాయి. ఖాతాలో నుంచి డబ్బు తీసుకోగానే ఎప్పటికప్పుడు మిగిలిన నిల్వ సమాచారాన్ని తెలియజేసేదే కోర్ బ్యాంకింగ్! బ్యాంకులో నగదు డ్రా చేసినా, జమ చేసినా క్షణాల్లో ఆ సమాచారం ఖాతాలతో అనుసంధానంచేసిన వినియోగదారుల మొబైల్ ఫోన్లకు చేరిపోతుంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో నిర్వహించే సరికొత్త వెబ్‌సైట్‌కు, వ్యవసాయ భూముల క్రయవిక్రయాలకు ఆధార్, మొబైల్ నెంబర్లే ప్రామాణికం. భూముల రిజిస్ట్రేషన్‌కు ముందు.. రికార్డుల మ్యుటేషన్ కోసం మొబైల్ నెంబర్‌కు వచ్చే ఎస్ఎంఎస్సే కీలకం. రికార్డుల నవీకరణలో భాగంగా ఖాతాలకు మొబైల్, ఆధార్‌నెంబర్లను అనుసంధానం చేసుకోవడానికి యజమానులెవరూ ముందుకు రాకపోవడంతో ఆ భూముల రక్షణ దైవాధీనం కానుంది. తెలంగాణలో 72,20,601 కమతాలు (ఖాతాలు) ఉండగా 52,37,621 మందే ఆధార్‌ను అనుసంధానం చేసుకున్నారు. అందులోనూ 34,73,633 ఖాతాలకే మొబైల్‌నెంబర్ లింకయింది. మార్చి 12 నుంచి తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ల బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఆ భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ కోసం 'సమీకృత భూ రికార్డుల నిర్వహణ విధానం(ఐఎల్ఆర్ఎంఎస్)'ను అమలు చేయనుంది. రికార్డుల నిర్వహణకు ఆధార్, మొబైల్‌నెంబరే కీలకంగా మారడం.. ఆ రెండింటినీ చాలా మంది ఇవ్వకపోవడంతో ఏం చేయాలో అధికారులకు అర్థం కావడం లేదు. కాగా, ఆధార్‌లో ఉన్న ఫొటోనే ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ పట్టాదార్ పాస్‌పుస్తకం ముద్రణలో వినియోగించనున్నారు. ఫొటోలేవీ తీసుకోకుండా ఆధార్‌నే ప్రామాణికం చేసుకున్నారు. దీంతో ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోని వారికి పాస్‌పుస్తకాలు వచ్చే అవకాశాల్లేవు. తెలంగాణలో 30 జిల్లాల్లో 19,82,980 ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదు. ఆయా ఖాతాదారులెవరూ ఆధార్ నెంబర్లు ఇవ్వలేదు. ఆధార్ ఇవ్వకపోతే బినామీ ఆస్తులుగా గుర్తిస్తామని సీఎం హెచ్చరిక చేసినప్పటికీ ఆధార్ నెంబర్లు ఇచ్చేవారి సంఖ్య పెరగలేదు. ఆధార్ ఇవ్వనివారికి పాస్‌పుస్తకాలతో పాటు పంట సాయం అందే అవకాశం లేదు. వాస్తవానికి ఆధార్ ఇవ్వాలా వద్దా అనేది పట్టాదారు విచక్షణకు సంబంధించినదే. దీంతో ఆధార్ అనుసంధానంలో వేగం తగ్గింది.

కాంగ్రెస్ యాత్రలో కుదుపులు

- నేతల మధ్య భగ్గుమంటున్న విభేదాలు
- చేవెళ్లలో సమన్వయ లోపం
- వికారాబాద్‌లో చంద్రశేఖర్ అలక
- తాండూరులో రేవంత్ రగడ
- ఇది 'కామన్' అంటున్న సీనియర్లు

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 'ఐక్యతా రాగం' చాటేందుకు ప్రారంభించిన కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్రలో యథావిధిగా నేతల మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. ఫిబ్రవరి 26న చేవెళ్లలో యాత్ర ప్రారంభం కాగా, తొలి రోజు నుంచి ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వాస్తవానికి బస్సు యాత్రకు ముందు నుంచే సీనియర్ నేతల మధ్య విభేదాలు పొడసూపాయి. కొందరు నేతలు బస్సు యాత్రపైనే అభ్యంతరం తెలపగా, మరి కొందరు తేదీల విషయంలో విభేదించారు. ఇదిలాఉండగానే బీజేపీ నేత నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారన్న వార్తతో సీనియర్ల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఈ విషయంలో జైపాల్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌పై డీకే అరుణ వర్గం మండిపడుతున్నారు. ఈ పరిణామాల ప్రభావం బస్సు యాత్రలో స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ పార్టీ సెంటిమెంట్‌గా భావించే చేవెళ్లలో ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం కాగా, తొలి సభలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఖుంటియాకే వేదికపై సీటు దక్కలేదు. దీంతో ఆయన మీడియా గ్యాలరీలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ నేతలు క్షమాపణ చెప్పి వేదికపైకి తీసుకెళ్లినా.. ఈ ఘటన చర్చనీయాంశమైంది. సభలో ఎవరెవరు ప్రసంగించాలనే విషయంలోనూ స్పష్టత లేకపోవడం గందరగోళానికి దారి తీసింది. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి అయిన డీకే అరుణకు మాట్లాడే అవకాశం రాకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడిన తర్వాత జనం లేచి వెళ్లిపోవడంతో ఆ తర్వాత మాట్లాడాల్సిన ముఖ్య నాయకులంతా అలకపూనినట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. వికారాబాద్ సభలో దీన్ని సవరించే ప్రయత్నం చేసినా, అక్కడ మరో వివాదం తెరపైకి వచ్చింది. వికారాబాద్ నుంచి మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ పోటీ చేస్తారని, మంత్రి అవుతారని ఉత్తమ్ ప్రకటించడంతో మరో సీనియర్ నేత చంద్రశేఖర్ వేదిక దిగి వెళ్లిపోయినట్లు చెప్పుకుంటున్నారు. ఇక.. తాండూరులో సీనియర్ నేత వీహెచ్ మాట్లాడుతుండగానే రేవంత్‌తో మాట్లాడించాలని కార్యకర్తలు పట్టుపట్టారు. జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడే సమయంలో ఇదే పరిస్థితి తలెత్తడంతో సీనియర్లు విసుగు చెందినట్లు సమాచారం. జహీరాబాద్‌లో సభ ఆలస్యంగా ప్రారంభమవడంతో త్వరగా ముగించి నారాయణఖేడ్ చేరుకోవాలని నిర్వాహకులు వక్తల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేశారు. దీంతో సీనియర్లు నిరాశకు గురైనట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్‌లో ఇలాంటి చిన్న చిన్న సంఘటనలు మామూలేనని, ప్రజా చైతన్య యాత్ర ఉద్దేశం మాత్రం నెరవేరుతోందని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు అభిప్రాయపడ్డారు. పార్టీలో నేతలంతా ఏకతాటిపైకి వస్తున్నారని, 4వ తేదీ నుంచి జరిగే సభల్లో ఇది మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తుందని వ్యాఖ్యానించారు.

చందనవెల్లిలో టెక్స్‌టైల్స్ పార్కు

- యూనిట్ల ఏర్పాటుకు అంతర్జాతీయ సంస్థల ఆసక్తి
- 600 ఎకరాల ప్రభుత్వ భూముల సేకరణకు ప్లాన్
- పరిహారంపై తకరారు.. రైతులకు అధికారుల బుజ్జగింపు



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానికి సమీపంలో పెట్టుబడులకు అనుకూల ప్రదేశాలకు డిమాండ్ పెరిగింది. దీంతో రంగారెడ్డి జిల్లా చందనవెల్లి ప్రాంతంలో సుమారు 600 ఎకరాల స్థలాలను సేకరించే పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ భూమిని మెరుగైన ఉపాధి అవకాశాలు లభించే అవకాశం గల టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు కేటాయించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తున్నప్పటికీ హైదరాబాద్ పరిసరాల్లో యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలు కేటాయించాలని కొరియా, జపాన్‌లతో పాటు గుజరాత్, ముంబైకి చెందిన టెక్స్‌టైల్స్ పరిశ్రమల దిగ్గజాలు ఇటీవల మంత్రి కేటీఆర్‌ను కోరారు. దీంతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 2,200 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూములను గుర్తించిన ప్రభుత్వం రైతులతో సంప్రదింపులు జరిపాలని నిర్ణయించింది. ఆ స్థలాల్లో పంటలు పెద్దగా పండించే అవకాశం లేకపోవడంతో స్థానిక రైతులు భూములను అప్పగించడానికి అంగీకరించినట్లు తెలిసింది. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న చందనవెల్లిని పరిశీలించిన పరిశ్రమాధిపతులు యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి కనబర్చినట్లు తెలిసింది. దీంతో తొలి దశలో సర్వే నెంబర్ 190లో సుమారు 600ఎకరాల స్థలాన్ని సమీకరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీఎస్ఐఐసీ అధికారుల ప్రతిపాదనల ఆధారంగా గుర్తించిన స్థలాల రైతులకు జిల్లా రెవెన్యూ అధికారులు భూసేకరణ నోటీసులు జారీ చేశారు. నష్టపరిహారాన్ని సంబంధిత రైతుల ఖాతాలోకి మార్కెట్‌ధర ప్రకారం జమ చేస్తున్నట్టు ప్రకటించడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఎకరాకు కనీసం రూ.20-25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో భూ సేకరణ వివాదాస్పందంగా మారకుండా రైతులను బుజ్జగించే బాధ్యతను జిల్లాకు చెందిన మంత్రి మహేందర్ రెడ్డికి ప్రభుత్వం అప్పగించింది. ఆయన రైతులు, రెవెన్యూ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.9 లక్షల చొప్పున ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. తమ భూములను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగిస్తున్నట్లు రైతులు అంగీకార పత్రాన్ని సమర్పించిన 15రోజుల్లో వారి ఖాతాల్లో పరిహారం జమచేస్తామని ప్రకటించింది. ఈ పార్కు వల్ల 10-12 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని తెలిపారు. నిర్వాసిత రైతు కుటుంబాలకు చెందిన యువకులకు ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు అధికారులు హామీ ఇచ్చారు. 600 ఎకరాల పక్కన మరో 500 ఎకరాల్లో ఫర్నీచర్ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు.



మోదీ గారు అనే సందర్భంలో
కేసీఆర్ పొరబడ్డారు

- ప్రధానిని కించపరిస్తే మనల్ని అవమానించుకున్నట్టే!
- బీజేపీ నేతలు హుందాగా వ్యవహరించాలి : ఎంపీ కవిత



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): "మోదీ గారు అనే సందర్భంలో దొర్లిన చిన్న పొరపాటు తప్పితే.. ప్రధానిని అవమానించే సంకుచిత స్వభావం సీఎం కేసీఆర్‌కు లేదు. ప్రధానిని కించపరచడమంటే మనల్ని మనమే అవమానించుకోవడం. అటువంటి ఆలోచన ఆయనకు లేదు. ఏదో రొటీన్‌గా జరిగిన పొరపాటది" అని నిజామాబాద్ ఎంపీ కవిత తెలిపారు. బంజారాహిల్స్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. "దావోస్‌లో ప్రసంగిస్తున్న సమయంలో 600 కోట్ల ప్రజలు మాకు ఓటేశారు అని మోదీ అన్నారు. అసలు దేశంలో ఉన్నదే 135 కోట్ల మంది... మోదీకి భారత జనాభా ఎంతో కూడా తెలియదని అనొచ్చు కదా? మేమేమైనా అన్నామా? ప్రజాక్షేత్రంలో ఉపన్యసించే సమయంలో పొరపాట్లు జరుగుతాయి" అని పేర్కొన్నారు. రైతులకు బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏం చేయలేదనే అంశాన్ని నొక్కి చెప్పే సందర్భంలో కేసీఆర్ ఘాటుగా మాట్లాడారే కానీ వ్యక్తిగతంగా విమర్శించే ఉద్దేశం లేదన్నారు. ఆయన మాటలకు పెడర్థాలు తీసి కోడిగుడ్డు మీద ఈకలు పీకొద్దని విమర్శలు చేస్తున్న నేతలకు హితవు పలికారు. బీజేపీ నేతలు హుందాగా వ్యవహరిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో గళం విప్పుతామని, తమ అధినేత సూచన మేరకు కేంద్రాన్ని నిలదీస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత తమపై లేదనేలా బీజేపీ మాట్లాడటం సరికాదని అభిప్రాయపడ్డారు. కాగా, ప్రజాసంక్షేమం, మహిళలు, యువత కోసం పనిచేస్తున్న సన్ ఫౌండేషన్‌కు తన వంతు సహకారం అందిస్తానని కవిత హామీ ఇచ్చారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమిర్‌తో కలిసి సన్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆమెను కలిశారు. యూనిసెఫ్‌తో కలిసి పనిచేస్తున్న సన్ ఫౌండేషన్ నిజామాబాద్ పరిధిలో పనిచేయడం సంతోషకరమని కవిత పేర్కొన్నారు.

కేటీఆర్ మాటల్లో తప్పేముంది? :జగదీశ్



హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్ష నేత జానారెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదని, అసెంబ్లీ రికార్డుల్లోంచి కూడా తొలగించలేనంత పద్ధతిగా ఉన్నాయని మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేటీఆర్ ఉన్న మాటే అన్నారని... అంతదానికి జానారెడ్డి ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. మోరీల్లో మొండాలు నిండుతాయని, కేసీఆర్‌ను బట్టలూడదీసి కొట్టాలని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించినప్పుడు సంస్కారం, భాష గుర్తుకు రాలేదా? అని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ఎల్పీలో శుక్రవారం మంత్రి జగదీశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై ఇష్టారీతిన నోరు పారేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు.. మంత్రి కేటీఆర్ గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవాచేశారు. 15 ఏళ్లు మంత్రిగా పనిచేసిన జానారెడ్డి నల్లగొండ జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఎన్నడైనా వెళ్లారా? అని నిలదీశారు. జానాను ఎన్నోసార్లు పరాభవానికి గురిచేశారని, సొంత పార్టీ నేతలే గౌరవం ఇవ్వరని ఎద్దేవా చేశారు. 40 మంది కాంగ్రెస్ నేతలు చేపట్టిన బస్సు యాత్రకు కనీసం వంద మందైనా ఎదురు వస్తున్నారా? అని ప్రశ్నించారు. కాగా ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ ఎలాంటి పరుష వ్యాఖ్యలు చేయలేదని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.తెలంగాణ జాతిపిత సీఎం కేసీఆర్ అయితే.. మంత్రి కేటీఆర్ తెలంగాణ భవిష్యత్తు అని టీఎస్ ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్ అన్నారు. తెలంగాణభవన్‌లో వారు మాట్లాడుతూ ఐటీ రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘతన కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ యాత్ర ఓ బూటకమని టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ అన్నారు.

తిట్ల పురాణంలో కేటీఆర్‌కు పీహెచ్‌డీ: వీహెచ్

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : తిట్ల పురాణంలో కేటీఆర్ పీహెచ్‌డీ చేశారని, తండ్రి బాటలోనే తనయుడు నడుస్తున్నారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. ప్రధానిని సీఎం కేసీఆర్ తిడితే రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంత్రి కేటీఆర్‌ను వివరణ అడగడమేమిటని ప్రశ్నించారు. ఆదిభట్ల సభకు వెళ్లకుండా సీఎం కేసీఆర్‌నే నిలదీసి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీఆర్ఎస్, బీజేపీ పరస్పరం విమర్శించుకోవడం ఓ డ్రామా అని ధ్వజమెత్తారు. తెలంగాణ ఆకాంక్షలు నెరవేరుతాయనే భ్రమతో ప్రజలు టీఆర్ఎస్‌కు ఓటేశారని, అలా జరగని పక్షంలో గద్దె దింపుతారని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ బస్సు యాత్ర చేస్తే కేటీఆర్‌కు వచ్చిన బాధేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం ఆలీబాబా-నలుగురు దొంగల్లా తయారైందని విమర్శించారు.

నిరుద్యోగ సమస్యపై వెనక్కి తగ్గం: కోదండ



హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, దాన్ని పరిష్కరించేదాకా వెనక్కి తగ్గేది లేదని టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజేఏసీ చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమం తెలంగాణలో విస్తృతంగా జరిగిందని, నియోజకవర్గాల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగామన్నారు. నిరుద్యోగ సమస్యపై టీజేఏసీ చేస్తున్న డిమాండ్లు పరిష్కరించాల్సిందేనని అన్నారు. ఖాళీలన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలన్నారు.



నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన లక్ష్మణ, కిషన్ రెడ్డి, చింతల తదితరులు

క్షేత్రస్థాయికి కేంద్ర మంత్రులు!

- పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వ వివరాలపై సమీక్ష
- త్వరలో బ్యాంకర్లతో నిర్మలా సీతారామన్ సమావేశం
- బీజేపీ నేతల భేటీలో నిర్ణయం

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను టీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని, దుర్వినియోగం చేస్తోందని ఇప్పటివరకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆరోపిస్తూ వచ్చిన నేపథ్యంలో, ఆయా పథకాల అమలును కేంద్ర మంత్రులు శాఖలవారీగా సమీక్షించనున్నారు. తద్వారా మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రచారం లభించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న వివరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవచ్చన్న నిర్ణయానికి కమలనాథులు వచ్చారు. ఇందులో భాగంగా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్.. త్వరలో ఆదిలాబాద్ లేదా ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం అమలుచేస్తున్న ముద్ర, జనధన్‌యోజన, బీమా వంటి పథకాలపై ఆమె బ్యాంకర్లతో సమీక్షించనున్నారు. ఇదే తరహాలో, కేంద్రం అమలు చేస్తున్న ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలునూ సంబంధిత కేంద్ర మంత్రులు సమీక్షిస్తారు. పార్టీ సీనియర్ నేత స్వర్గీయ వి.రామారావు నివాసంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్రనాయకులకు మంత్రి నిర్మల హామీ ఇచ్చారు. కేంద్ర పథకాల నిధుల మళ్లింపుపై పదేపదే ఆరోపణలు చేస్తున్న రాష్ట్రపార్టీ నేతలు, ఈ అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె పైవిధంగా స్పందించారు. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై కొద్దిసేపు చర్చించారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రధానిపై చేసిన వ్యాఖ్యలను తాను మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా దృష్టికి తీసుకెళతానని నిర్మల పేర్కొన్నట్లు నేత ఒకరు తెలిపారు.


భద్రాద్రికొత్తగూడెం జిల్లా సారపాక ఐటీసీ నుంచి గోదావరిలో కలుస్తున్న రసాయన వ్యర్థాలు

గరళ గోదావరి

నదిలోకి మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు.. నీళ్లలో ప్రమాదకర కోలీఫాం బ్యాక్టీరియా

- ఆ నీరే మిషన్ భగీరథ ద్వారా తాగునీరుగా..
- ప్రజారోగ్యానికి పెను ముప్పు వాటిల్లే ప్రమాదం
- కానరాని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు

కరీంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి నీళ్లను తలపించే జలం.. భూమికి పచ్చలహారం తొడిగేందుకు అన్నట్టుగా పోటెత్తే నీరు.. నెత్తిన చల్లుకున్నంతనే పాపాలు హరించుకుపోతాయని భక్తులు విశ్వసించే పవిత్రోదకం.. ఆ గోదారమ్మ.. మనం చూస్తున్న గోదారమ్మేనా? కచ్చితంగా కాదు. నీళ్లలో రూపాయి సిక్క వేస్తే.. స్పష్టంగా కనిపించేంత స్వచ్ఛంగా ఉండే నీళ్లు.. ఆకుపచ్చ రంగులోకి మారుతున్నాయి. నల్లని రంగుతో నురగలు గక్కుతున్నాయి. నానా వ్యర్థాలతో దుర్వాసన వెదలజల్లుతున్నాయి.గోదావరి నదీమతల్లిని కాలుష్య రక్కసి పట్టిపీడిస్తోంది. నది పొడవునా మురుగునీటి కాలువల్లోంచి చెత్తాచెదారం, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి చేరుతుండడంతో నది కాలుష్య కాసారంగా మారుతోంది. ప్రమాదకరమైన కోలీఫాం బ్యాక్టీరియా ఉండడంతో నీళ్లు విషతుల్యంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా ఎత్తిపోసి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు, అక్కడ నుంచి మిడ్ మానేరు ద్వారా దక్షిణ తెలంగాణ జిల్లాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. మిషన్ భగీరథ ద్వారా ఈ నీటినే పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, సిద్దిపేట, జనగామ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరానికి అందించాలని నిర్ణయించారు. ఈ పరిస్థితుల్లో గోదావరి జాలాలను వాడితే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. దాదాపుగా మిషన్ భగీరథ పనులు పూర్తికావస్తున్నాయి. అయితే.. గోదావరి జలాలు అందుబాటులోకి వస్తే దాహార్తి పరంగా ప్రజలకు అది పెనంలోనించి పొయ్యిలోకి పడ్డ చందంగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు. నది పరీవాహక పట్టణ ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు లేకపోవడం, పరిశ్రమలు కూడా వ్యర్థ, కలుషిత జలాలను శుద్ధి చేయకుండానే గోదావరి నదిలో వదలడంతో ఈ నదిలో కోలీఫాం బ్యాక్టీరియా వృద్ధి చెందుతోంది. పారేనీటితో పోల్చితే నిల్వ ఉన్న నీటిలో ఈ బ్యాక్టీరియా వేగవంతంగా వృద్ధి చెందే అవకాశం ఉన్నందున బ్యారేజీల వద్ద నీరు అత్యంత కలుషితంగా మారే ప్రమాదం నెలకొంది. మిషన్ భగీరథలో కూడా సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లను నిర్మించా లనే ప్రతిపాదనలేవీ లేకపోవడంతో గోదావరి జలాల స్వచ్ఛత ఎంత వరకు అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సారపాక ఐటీసీ వ్యర్థాలు

గలగల పారే గోదారి అనే మాట భావుకతకు మాత్రమే ఎందుకు పరిమితమవుతోందని ప్రశ్నించుకుంటే ఇలాంటి కారణాలే కనిపిస్తాయి. ఈ రసాయన వ్యర్థాలన్నీ నురగలు గక్కుకుంటూ నేరుగా గోదావరిలోకి వచ్చేస్తున్నాయి. భద్రాద్రికొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ కర్మాగారం నుంచి రసాయన వ్యర్థాలను నేరుగా పైప్‌లైన్ ద్వారా నదిలోకి వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో కిలోమీటర్ల మేర నీరు తారు రంగులోకి మారిపోయింది. నీళ్లు విషపూరితంగా మారడంతో ఆ ప్రాంతాల్లో చేపలు లేకుండా పోయాయి. ఈ నీటిని తాగుతున్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

మంచిర్యాల, రామగుండం నుంచి వ్యర్థాలు

మంచిర్యాల జిల్లా కేంద్రంతోపాటు రామగుండం పారిశ్రామిక ప్రాంతం, ధర్మపురి, మంథని పట్టణాల నుంచి గోదావరిలోకి మురికినీరు ఎక్కువగా వచ్చి చేరుతోంది. రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అత్యంత ఎక్కువగా 40 ఎంఎల్‌డీల డ్రైనేజీ, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి నదిలో కలుస్తున్నాయి. మంచిర్యాల పట్టణం నుంచి 10 ఎంఎల్‌డీల మురికినీరు గోదావరిలో కలుస్తోంది. రామగుండం మురికినీటిలో 890 ఎంపీ (నీటి నాణ్యత కొలమానం), మంచిర్యాలలో 375 ఎంపీ, మంథనిలో 847 ఎంపీ స్థాయిలో కోలీఫాం బ్యాక్టీరియా ఉన్నట్టు పర్యావరణ శాఖ గుర్తించింది. ఇప్పుడు ఈ నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎగువకు ఎత్తిపోయడంతో అన్ని ప్రాంతాలకు బ్యాక్టీరియా విస్తరించే ప్రమాదం ఉంది.


మల్లాపూర్(రామగుండం) వద్ద ఉన్న ఎస్టీపీ ప్లాంట్ (ప్రస్తుతం పనిచేయడం లేదు)

మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తేనే..

పదిహేనేళ్ల క్రితం జాతీయ నది పరిరక్షణ పథకం కింద మంచిర్యాల, రామగుండం పట్టణాల వద్ద గోదావరి నది ఒడ్డున సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించారు. రామగుండంలో రెండు 18 ఎంఎల్‌డీ ప్లాంట్లను, మంచిర్యాలలో 10 ఎంఎల్‌డీ నీటిని శుద్ధిచేసే ఎస్‌టీపీలను 15 కోట్లు వెచ్చించి నిర్మించారు. అవేవీ ఇప్పుడు పనిచేయడంలేదు. రామగుండం ప్రాంతంలో ఉన్న ఎన్‌టీపీసీ, జెన్‌కో పరిశ్రమల్లో వినియోగించిన నీటిని గోదావరిలోకి వదులుతున్నారే తప్ప నీటిశుద్ధి చేసే ప్లాంట్లను నిర్మించలేదు. ప్రస్తుతం రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్మాణంలో ఉండగా ఇక్కడి నుంచి అమ్మోనియా అవశేషాలు ఉన్న నీరు నదిలో కలిసే ప్రమాదముంది. ఈ నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఉన్నందున నది పరీవాహక ప్రాంతంలోని అన్ని పట్టణాలలో, పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో మురికి నీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


మట్టి కింద మహాన్వేషణ!


కర్ణమామిడిలో పురావస్తు శాఖ తవ్వకాలు జరుపుతున్న స్థలం

- శాతవాహనుల ఆనవాళ్ల కోసం తవ్వకాలు
- వ్యాపార కేంద్రంగా విలసిల్లిన కర్ణమామిడి!
- బయటపడుతున్న చారిత్రక అవశేషాలు
- మరిన్ని ఆధారాల సేకరణలో పురావస్తుశాఖ

(ఆంధ్రజ్యోతి, మంచిర్యాల)

ఏదైనా ఓ ప్రాంతం ప్రాశస్త్యం తెలియాలంటే.. దాని చరిత్ర తెలియాలి. ఆ చరిత్రను తెలుసుకోవాలంటే అన్వేషణ జరగాలి. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో అదే అన్వేషణ.. మట్టికింద మహాన్వేషణ సాగుతోంది. క్రీ.పూ. 210 నుంచి క్రీ.శ. 220 వరకు దక్షిణ భారతదేశాన్ని 400 ఏళ్లకు పైగా పాలించిన శాతవాహనుల తొలి రాజధాని గోదావరికి ఆవలి ఒడ్డున ఉన్న జగిత్యాల జిల్లాలోని కోటిలింగాల అని ఇప్పటికే తేలింది. కాగా మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని కర్ణమామిడిలో శాతవాహన రాజుల కీలక పరిపాలనా కేంద్రం ఉండేదని తెలుస్తోంది. దీంతో చారిత్రక అవశేషాల కోసం కర్ణమామిడి సమీపంలోని పాటిగడ్డలోనూ పురావస్తుశాఖ తవ్వకాలు జరుపుతోంది. ఈ తవ్వకాల్లో.. వేల ఏళ్ల కిందటి చారిత్రక అవశేషాలు, నాటి ప్రజలు వాడిన ఇటుకలు, కుండలు, మట్టి పాత్రలు, పూసలు మొదలైన అలంకరణ సామగ్రి బయటపడుతున్నాయి.


తవ్వకాల్లో బయటపడిన దిమ్మిస లాంటి రాయి


బయటపడ్డ నల్లరాయి

తొలి రాజధాని కోటిలింగాల..

ప్రస్తుత జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలలో 1979-84 మధ్య కాలంలో జరిగిన తవ్వకాల్లో 100 ఎకరాల్లో విస్తరించిన అతి ప్రాచీన కోట బయటపడింది. ఇక్కడ ఆరు పొరల్లో జరిపిన తవ్వకాల్లో ఇటుక గోడలు, బురుజులు, ముద్రణా యంత్రాలతోపాటు కత్తులు, కటార్లు, పూసలు, ఇతర వస్తు సామగ్రి బయటపడ్డాయి. తొలి శాతవాహన రాజు శ్రీముఖుడితోపాటు అంతకుముందున్న ఆంధ్రరాజుల నాణేలు కూడా వెలుగుచూశాయి. దీంతో ఇది శాతవాహన రాజుల తొలి రాజధాని అని నిర్ధారణ అయింది. ఇంకా పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండంలోని ధూళికట్ట (ధూళికోట), పెద్దపల్లి సమీపంలోని పెద్దబొంకూర్ గ్రామం కూడా వెలుగుచూశాయి. గోదావరికి ఆవల ఉన్న కోటిలింగాల ఒక రేవు పట్టణం కాగా, నదికి ఇవతల ఉన్న కర్ణమామిడి సైతం శాతవాహనుల కీలక స్థావరంగా వర్ధిల్లిందని పురావస్తు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక్కడి 40 ఎకరాల్లో పట్టణం, అదీ వర్తక వాణిజ్య కేంద్రంగా ఉండేదని, తవ్వకాల ద్వారా దీనిని రుజువు చేయాలని భావిస్తున్నారు. కర్ణమామిడిలో తవ్వకాల్లో బయటపడుతున్న అప్పటి తేలికపాటి ఇటుకలు, శివలింగానికి ఉపయోగించే రాయి, మట్టి పూసలు, కుండల అంచుల భాగాలు, వంట పాత్రలు, ఎముకలు, నాణేలు, అప్పటి హనుమాన్ విగ్రహం, అన్నీ కూడా అక్కడ శాతవాహనుల పాలన ఆనవాళ్లను చాటుతున్నాయని పురావస్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇంతే కాకుండా దిమ్మిస లాంటి వస్తువులు, అప్పటి నాణేలు కొన్ని లభించినట్లు తెలిపారు.

చీటీల వ్యాపారానికి చీకట్లు!

- దివాలా తీస్తున్న ఫైనాన్స్ వ్యాపారులు
- నమ్మి.. రోడ్డున పడుతున్న అమాయకులు
- అనుమతుల్లేకుండానే చిట్‌ఫండ్ కంపెనీలు

(ఆంధ్రజ్యోతి, కామారెడ్డి)

చీటీల వ్యాపారానికి చీకట్లు అలముకుంటున్నాయి. చీటీల వ్యాపారులు దివాలా తీస్తూ ఐపీలు పెడుతున్నారు. కొందరు బోర్డు తిప్పేసి.. బిచాణా ఎత్తేస్తున్నారు. మరికొందరు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీంతో.. వీరిని నమ్మి వీరి వద్ద డబ్బు దాచుకున్న చిరుద్యోగులు, చిన్నా చితకా పనులు చేసుకునే వారు రోడ్డున పడుతున్నారు. కామారెడ్డి జిల్లాలో ఇటీవల ఈ ఘటనలు పెరిగిపోతున్నాయి. కొత్త జిల్లాగా మారిన కామారెడ్డి రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఫైనాన్స్ రంగంలో వ్యాపారులు పెట్టుబడులు భారీగానే పెట్టారు. ఈ క్రమంలో లాభాలు గడించడంతోపాటు అదే స్థాయిలో అప్పులు కూడా చేస్తూ వచ్చారు. కానీ, చివరికి ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాలు దెబ్బతినడంతో వ్యాపారులు చతికిలబడుతున్నారు. ప్రధానంగా చీటీలకు సంబంధించి నెల నెలా డబ్బులు కట్టాల్సినవారు కట్టకపోవడం, డబ్బులు తీసుకున్నవారు తిరిగి చెల్లించకపోవడంతో ఫైనాన్స్, చీటీల వ్యాపారం దివాలా తీస్తోంది. దీంతో వ్యాపారులు అప్పులు కట్టలేక చివరకు కోర్టుకెళ్లి ఐపీలు పెడుతున్నారు.

3వేల మంది నుంచి 40 కోట్లు వసూలు..

పట్టణానికి చెందిన ఓ ఫైనాన్స్ వ్యాపారి 41 మంది వద్ద రూ.2 కోట్ల వరకు అప్పులు చేసినట్లు, వాటిని తీర్చలేక చివరకు కోర్టును ఆశ్రయించి ఐపీ పెట్టుకున్నట్లు తెలిసింది. అంతకుముందు మరో ఫైనాన్స్ వ్యాపారి చీటీల పేరుతో రూ.5 కోట్ల వరకు వసూలు చేసి.. బిచాణా ఎత్తేశాడు. చివరకు అప్పుల పాలయ్యానంటూ ఐపీ దాఖలు చేశాడు. ఇలా ఇప్పటివరకు పట్టణంలో 50 మందికి పైగా ఫైనాన్స్, చీటీల వ్యాపారులు ఐపీ పెట్టడం, బోర్డు తిప్పేయడం జరిగింది. వీరు ఫైనాన్స్, చీటీల పేరిట దాదాపు రూ.40 కోట్ల వరకు టోకరా వేశారు. వీరిని నమ్మి చీటీలు వేసిన సుమారు 3వేల మంది బాధితులు మోసపోయి రోడ్డున పడ్డారు. మరోవైపు ఫైనాన్స్, చీటీల వ్యాపారంలో నష్టాలు రావడంతో మాచారెడ్డి మండలం వాడి గ్రామానికి చెందిన నర్సారెడ్డి, కామారెడ్డి మండలానికి చెందిన సతీష్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనుమతులు లేకుండా జరిగే ఫైనాన్స్ వ్యాపారాన్ని అరికట్టకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

డొల్ల నేలలు



విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులతో నిస్సారం

- మరింత ప్రమాదంలో ఎర్రనేలలు.. పెరుగుతున్న భాస్వరం నిల్వలు
- క్షీణిస్తున్న సూక్ష్మధాతువులు.. పత్తిసాగుకు అనుకూలించని భూములు
- సాగు పెట్టుబడులు మట్టిపాలు.. తీవ్ర నష్టాల్లో రైతాంగం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 2: బంగా రం పండే తెలంగాణ రాష్ట్రంలోని నేలలు నానాటికి నిస్సారమవుతున్నాయి. ఏ పంట వేసినా ఇబ్బడిముబ్బడిగా దిగుబడులు రాల్చిన భూములే రైతన్నకు పెట్టుబడి సొమ్మును కూడా మిగలకుండా చేస్తున్నాయి. దీంతో పంటలు చేతికి అందక రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. అయితే, ఇదంతా స్వయంకృత ఫలితమే. ఎరువులు, పురుగుల మందుల వాడకం రాష్ట్రంలో ఏటికేడు పెరుగుతోంది. ఈ ఎరువులు, పురుగుల మందులే భూముల్లోని సారాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయి. ప్రత్యేకించి ఎర్రనేలలకు ఇది మరింత ముప్పుగా పరిణమిస్తోంది. భాస్వరం నిల్వ లు పెరిగిపోతుండడంతో ఎర్రనేలలు డొల్లగా మారుతున్నాయి. సాక్షాత్తు వ్యవసాయ శాఖ మోగిస్తున్న ప్రమాద ఘంటికలివి! రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన భూ సార పరీక్షల్లో భూములు అంతకంతకూ సారాన్ని కోల్పోతున్నట్టు తేలింది. ఎరువుల వినియోగ భారాన్ని తగ్గించి.. భూ స్వభావానికి అనుగుణంగా పంటలు సాగు చేసేలా రైతుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వ్యవసాయ శాఖ ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ భూసార పరీక్షలు నిర్వహించారు. పంటల సస్యరక్షణ చర్యలపై రైతుల్లో అవగాహన లేకపోవడం వల్ల మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులను వాడుతున్నారు. దీంతో భూముల్లో సూక్ష్మ ధాతువులు క్షీణించి, భాస్వరం నిల్వలు పెరుగుతున్నాయని పరీక్షల్లో తేలింది. సూక్ష్మధాతువులైన జింక్, ఐరన్‌లోపం యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని సాగుభూముల్లో కనిష్ఠస్థాయిలో నమోదవుతున్నట్టు అధికారులు గుర్తించా రు.

నష్టపోతున్న పత్తి రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికంగా విస్తరించి ఉన్న ఎర్రనేలల్లో లవణ సూచిక తక్కువ స్థాయిలో ఉండగా, రసాయనాల్లో భాస్వరం నిల్వ ఎక్కువగా నమోదవుతోంది. పొటాష్, నత్రజని, సేంద్రియ కర్బనం మధ్యస్థంగా ఉన్నట్టు భూసార పరీక్షలు చెబుతున్నాయి. ఎర్రనేలల్లో ఉదజని సూచిక తక్కువ స్థాయికి పడిపోయి నిస్సారంగా మారుతున్నాయి. తేలిక స్వభావాన్ని కలిగి ఉన్న ఈ తరహా క్షేత్రాల్లో వర్షాధార పంటలను సాగు చేస్తున్న రైతులు.. ప్రధానంగా పత్తిసాగుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4,44,637 హెక్టార్లలో సాగుభూములు విస్తరించి ఉండగా ఇందులో 3లక్షల, 46,844 హెక్టార్ల విస్తీర్ణంలో ఎర్రనేలలు ఉన్నాయి. కాగా నల్లరేగడి భూముల్లో సాగవుతున్న పత్తి దిగుబడులు సాధారణ స్థాయిని అధిగమిస్తూ 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండగా, ఎర్రనేలల్లో పత్తి పంట దిగుబడులు క్షీణించి 10 క్వింటాళ్లకే పరిమితమవుతున్నాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. మొత్తంగా జిల్లాలో 78 శాతం ఎర్రనేలలు విస్తరించి ఉన్నట్టు, ఈ నేలల్లో పత్తిని సాగు చేస్తూ రైతులు అప్పులపాలవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం!

రైతులకు అందుబాటులో ఉంటూ శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు గ్రామానికో అధికారిని నియమించినా.. వారి సేవలు నామమాత్రంగానే అందుతున్నాయి. ఇదే అదనుగా స్థానిక ఫర్టిలైజర్ డీలర్లు తమకు అందుబాటులో ఉన్న ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దిగుబడి ఎక్కువగా వస్తోందన్న భావనతో రైతులు రసాయన ఎరువులను విచ్చలవిడిగా ఉపయోగిస్తుండటంతో అవి పుడమితల్లి పొట్టలో ఉంటూ సారాన్ని పెంచే సూక్ష్మధాతువులను ఏటేటా తగ్గిస్తున్నాయి.



అమ్మలేరు.. దాచలేరు!

పత్తి రైతులకు కొత్త తంటా.. నిల్వ చేసిన ఇళ్లలో చర్మవ్యాధులు.. విక్రయిద్దామంటే ధర రాని పరిస్థితి

మోత్కూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు పెద్ద చిక్కే వచ్చిపడింది. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాట ధర రాకపోవడంతో రైతులు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరే.. మంచి ధర వచ్చినప్పుడే అమ్ముకుందామనే ఉద్దేశంతో పత్తిని ఇంట్లో నిల్వచేసుకుందామంటే అది మరింత ఇబ్బందిరకంగా పరిణమిస్తోంది. పత్తి పంటను నిల్వచేసుకున్న ఇళ్లలో అందరూ చర్మవ్యాధులకు గురవుతున్నారు. దీంతో తక్కువ ధరకు అమ్ముకోలేక.. పంటను నిల్వచేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో గత ఖరీఫ్‌లో సుమారు 1.7 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. తొలుత చక్కగా వర్షాలు కురిసి పంట ఏపుగా పెరిగినా.. తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పూతకాత దశలో వరుణుడు మొహం చాటేయడంతో పత్తి చేలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎకరాకు పది, పదిహేను క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఐదు నుంచి పది క్వింటాళ్లే వచ్చింది. ఆ పంటనైనా అమ్ముకుందామంటే ప్రభుత్వం సకాలంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను తెరవలేకపోయింది. దీంతో క్వింటాకు మద్దతు ధర రూ.4320 రావాల్సిన చోట.. రైతులు రూ.3200కే అమ్ముకున్నారు. కొన్నాళ్లకు సీసీఐ కేంద్రాలను తెరిచినా.. అక్కడి కొనుగోలుదారులు రైతులకు కొర్రీలు పెట్టారు. దీంతో అక్కడా రైతులకు క్వింటాకు రూ.3500 ధర మాత్రమే వచ్చింది. తీరా రైతులు 60% పత్తి అమ్ముకున్నాక బహిరంగ మార్కెట్లో పత్తి ధర క్వింటాకు రూ.5500 వరకు పెరిగింది. తర్వాత వారం, పది రోజుల్లోనే ధర పడిపోవడంతో రైతులు మళ్లీ పెరుగుతుందేమోనన్న ఆశతో పంటను విక్రయించలేదు.

మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం)తో పాటు జిల్లాలోని పలు మండలాల్లో రైతులు పంటను తమ ఇళ్లలోనే నిల్వ చేశారు. అడ్డగూడూరు మండలంలోని ఒక్క లక్ష్మీదేవికాల్వ గ్రామంలోనే సుమారు 4 వేల క్వింటాళ్ల పత్తి నిల్వ ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా రైతుల ఇళ్లలో ఇప్పటికీ సుమారు 25% (సుమారు 2.55 లక్షల క్వింటాళ్లు) పత్తి నిల్వ ఉంది. పత్తి నిల్వ చేయడంతో రైతుల కుటుంబ సభ్యులకు చర్మంపై దద్దుర్లు వస్తున్నాయి. ఈ బాధ భరించలేక కొందరు రైతులు.. ఎంతో కొంత ధరకు పంటను అమ్ముకుంటున్నారు. అయితే, దురద భయంతో పంటను వాహనాల్లో లోడ్ చేసేందుకు హమాలీలు కూడా ముందుకు రావడం లేదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి చర్మ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించాలని రైతులు కోరుతున్నారు.


పత్తి కొనుగోలు చేసి లోడ్ చేస్తున్న దృశ్యం


యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వలో ఓ ఇంట్లో నిల్వ చేసి ఉన్న పత్తి

పత్తి లోడ్ చేస్తుంటే భరించలేని దురద



"పత్తి కాంటా వేసి వాహనంలోకి లోడ్ చేస్తుంటే విపరీతమైన దురద వస్తోంది. ఎక్కడ గోకితే అక్కడ దద్దుర్లు వస్తున్నాయి. ఇన్ని సంవత్సరాల్లో ఎన్నడూ ఇలా జరగలేదు. వచ్చిన కూలి డబ్బంతా చికిత్సకే సరిపోయేలా ఉంది"

- కాపర్తి నర్సయ్య, హమాలీ, లక్ష్మీదేవికాల్వ

పత్తి నిల్వతో స్కిన్ ఎలర్జీ



"ధర పెరుగుతుందేమోనన్న ఆశతో ఇంట్లో పత్తిని నిల్వ చేశాం. మా బాబు రాకేశ్‌కు స్కిన్ ఎలర్జీ వచ్చింది. చికిత్స చేయిస్తే ఐదారు వందలు ఖర్చయ్యాయి. ప్రతిఏటా మేము ఇళ్లలో పత్తి నిల్వ చేసి అమ్ముతున్నాం. ఇలా ఎప్పుడూ జరగలేదు"

- కన్నెబోయిన రేణుక, లక్ష్మీదేవికాల్వ



స్కూల్ ఎడ్యుకేషన్

వికాస విద్యకు..
కేంద్రీయ విద్యాలయాలు

విద్యార్థి జీవితంలో పాఠశాల జీవితం కీలకమైంది. ఈ దశలో వేసే పునాదే భావి భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. అందుకే పాఠశాల ఎంపికలో విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు వంటి ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే విద్యార్థిలో సర్వోతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రస్తుత ప్రపంచం కోరుకుంటున్న విలువైన నైపుణ్యాలు అలవడతాయి. ఈ విషయంలో కేంద్రీయ విద్యాలయాలు ముందజలో నిలుస్తున్నాయి. ప్రస్తుతం పట్టణం, పల్లె అనే తేడా లేకుండా కార్పొరేట్ సంస్కృతి విస్తరిస్తున్నప్పటికీ, కేవీలు తమ ప్రాధాన్యాన్ని కోల్పోకుండా విద్యార్థి బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దే నిలయాలుగా మన్ననలు పొందుతున్నాయి. కేంద్రీయ విద్యాలయాల్లో 2018-19 సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో ఆ వివరాలను చూద్దాం..

ఆధునాతన సాంకేతిక విద్యను అందించడంలో కేంద్రీయ విద్యాలయాలు (కేవీ) ముందంజలో ఉంటున్నాయి. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేవీలు పని చేస్తాయి. ఈ పాఠశాలలను 1963లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల (రక్షణ రంగంలో పని చేసే ఉద్యోగులు సహా)కు తరచుగా బదిలీలు జరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో ఉద్యోగుల పిల్లల చదువుకు ఇబ్బంది కలగకుండా ఉండటం కోసం కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ వ్యవస్థను ప్రారంభించింది. మొదట్లో వీటిని సెంట్రల్ స్కూల్స్‌గా పిలిచేవారు. తరవాతి కేంద్రీయ విద్యాలయాలుగా మారాయి. వీటిలో ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రాధాన్య క్రమాన్ని అనుసరించి మిగతా కుటుంబాలకు చెందిన పిల్లలకు కూడా ప్రవేశం కల్పిస్తారు. ప్రస్తుతం దేశంలో 1136 కేవీ స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 12,57,099 మంది విద్యార్థులు చదువుతున్నారు.

పోటీ పెరిగింది

తల్లిదండ్రుల ఆలోచన సరళిలో వచ్చిన మార్పు, విద్యతోపాటు క్రీడలు వంటి ఇతర వ్యాపకాలకు ఇస్తున్న ప్రాధాన్యంతో కేంద్రీయ విద్యాలయాలకు డిమాండ్ పెరిగింది. గతంతో పోల్చితే కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం పోటీ పెరిగింది. కేంద్రీయ విద్యాలయాల్లో 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం మార్చి 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మొదలైంది. అవసరమనుకుంటే ఒకటి కంటే ఎక్కువ విద్యాలయాలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఖాళీలు సంబంధిత వివరాలను ఆయా పాఠశాలల నుంచి పొందొచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో 68

తెలుగు రాష్ట్రాల్లో 68 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. అవి.. ఆదిలాబాద్, అనంతపురం, భీమునిపట్నం (ఐఎన్ఎస్ కళింగ), బోధన్, ఏలూరు, గుంతకల్, గుత్తి, గుంటూరు, కడప, కాకినాడ, కరీంనగర్, ఖమ్మం, కర్నూలు, జారసంగం (మెదక్ జిల్లా), మచిలీపట్నం, మిర్యాలగూడ, నెల్లూరు, నల్లగొండ. తిరుపతి - 1, 2; విజయవాడ - 1, 2; ఎన్‌టీపీసీ రామగుండం, ఓఎన్‌జీసీ రాజమండ్రి, ఒంగోలు, రాజంపేట, సిరిసిల్ల, శ్రీకాకుళం, సూర్యలంక (బాపట్ల), తెనాలి, మహబూబ్‌నగర్, వాల్తేర్, విశాఖపట్నం - ఎన్ఏడీ, విశాఖపట్నం - మల్కాపురం, విశాఖపట్నం - నెం.1 నౌసేనాబాగ్, విశాఖపట్నం - నెం. 2 నౌసేనాబాగ్, విశాఖపట్నం - నెం.1 శ్రీవిజయ్‌నగర్, విశాఖపట్నం - నెం.2 శ్రీవిజయ్‌నగర్, విశాఖపట్నం - స్టీల్ ప్లాంట్, వరంగల్, మహబూబాబాద్, భువనగిరి, రాజంపల్లి, సత్తెనపల్లి, వెంకటగిరి.

- హైదరాబాద్‌లోని కేవీలు: ఎఎఫ్ఎస్ బేగంపేట్, హకీంపేట, బొల్లారం, బోయిన్‌పల్లి, సీఆర్‌పీఎఫ్, గచ్చిబౌలి, కంచన్‌బాగ్, ఎన్ఎఫ్‌సీ నగర్ - ఘట్కేసర్; 1, 2 ఏఎఫ్ఏ, గోల్కొండ - 1, 2; ఉప్పల్ - 1, 2; శివరాంపల్లి, ఎద్దుమైలారం (మెదక్ జిల్లా), పికెట్, తిరుమలగిరి.
- వీటికి అదనంగా మరికొన్ని కేంద్రీయ విద్యాలయాలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

సీబీఎస్ఈ సిలబస్

కేంద్రీయ విద్యాలయాల్లో దేశ వ్యాప్తంగా ఒకే రకమైన పాఠ్యప్రణాళిక అమల్లో ఉంటుంది. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో బోధిస్తారు. కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతులు ఉంటాయి. ఈ పాఠశాలలు సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)కి అనుబంధంగా ఉంటాయి.

ఖాళీలు ఉంటేనే

రెండో తరగతి, అంతకంటే పైతరగతుల్లో ఆయా విద్యాలయాల్లో ఉన్న ఖాళీల మేరకే ప్రవేశాలను కల్పిస్తారు. 10వ తరగతిలో ప్రవేశం పొందాలంటే 9వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. 11వ తరగతి దరఖాస్తులను 10వ తరగతి ఫలితాల తరవాత అందుబాటులో ఉంచుతారు. 11వ తరగతిలో కూడా ఆయా విద్యాలయాల్లోని ఖాళీల ప్రకారమే అడ్మిషన్లు కల్పిస్తారు. 12వ తరగతిలో ప్రవేశానికి 11వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించాలి.

రిజర్వేషన్లు ఇలా

15 శాతం సీట్లను ఎస్సీలకు.. 7.5 శాతం సీట్లను ఎస్టీలకు, 3 శాతం సీట్లను దివ్యాంగులకు రిజర్వు చేస్తారు. మిగిలిన సీట్లు ఇతరులకు కేటాయిస్తారు. జాతీయ విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) నిబంధనల మేరకు 10 సీట్లను ఉచిత బోధనా పద్ధతిలో భర్తీ చేస్తారు. లాటరీ ద్వారా వీరి ఎంపిక ఉంటుంది. ఒకటో తరగతిలో ఆర్‌టీఈ కింద ప్రవేశం పొందితే పాఠశాల చదువు పూర్తయ్యేవరకు ఉచిత బోధన లభిస్తుంది.

ఒత్తిడి లేని విద్య

కార్పొరేట్ సంస్కృతికి భిన్నంగా పిల్లలపై ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుత వాతావణంలో నాణ్యమైన విద్యను కేంద్రీయ విద్యాలయాలు అందిస్తాయి. ఒకటో తరగతి నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో పరిచయం.. శాస్త్ర సాంకేతికతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు ఉంటాయి. మిగిలిన పాఠశాలలకు భిన్నంగా దీని పనివేళలు, సెలవులు ఉంటాయి. విద్యతోపాటు ఆటపాటకు తగిన ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తు ఇలా

ముందుగా ఆసక్తి ఉన్న కేంద్రీయ విద్యాలయాలను ఎంచుకోవాలి. తరవాత kvadmissiononline2018.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ముందు ప్రవేశ మార్గదర్శకాలను (అడ్మిషన్ గైడ్‌లైన్స్) క్షుణ్నంగా చదవడం మంచిది. దరఖాస్తును సమర్పించిన తరవాత యునిక్ అప్లికేషన్ నెంబర్ వస్తుంది. ఇదే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్‌గా ఉపయోగపడుతుంది. ప్రవేశాలకు సంబంధించిన అన్ని రకాల వివరాలను తెలుసుకోవడానికి ఈ నెంబర్ ఆధారంగా ఉంటుంది. కాబట్టి దీన్ని భద్రపరుచుకోవాలి. దరఖాస్తులో ఏవైనా పొరపాట్లు ఉంటే గడువు తేదీలోపు ఎడిట్ ఆప్షన్ ద్వారా ఎన్నిసార్లయినా సరి చేసుకోవచ్చు. వెబ్‌సైట్‌లోని అప్లికేషన్ స్టేటస్ లింక్ లేదా దరఖాస్తు చేసుకున్న పాఠశాల నోటీస్ బోర్డ్ ద్వారా అడ్మిషన్ ఖరారుకు సంబంధించిన సమాచారాన్ని పొందొచ్చు.

వీరికి ప్రాధాన్యం

దరఖాస్తు చేసుకున్న అందరికీ ప్రవేశాలు కల్పించరు. కేవీఎస్ నిబంధనల మేరకు ప్రాధాన్య క్రమాన్ని అనుసరిస్తారు. దాని ప్రకారం సీట్లను కేటాయిస్తారు. ప్రాధన్య క్రమం ఈ విధంగా ఉంటుంది.

- కేటగిరీ-1: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు
- కేటగిరీ-2: కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పిల్లలు
- కేటగిరీ-3: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు
- కేటగిరీ-4: రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పిల్లలు
- కేటగిరీ-5: ప్రైవేట్ ఉద్యోగులు / స్వయం ఉపాధి పొందుతున్నవారు / తదితర వర్గాల పిల్లలు.
- ఒకే సంతానం (అమ్మాయి) కలిగిన కుటుంబాల్లోని వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మావన వనరుల మంత్రిత్వశాఖ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఉన్నతాధికారులు సిఫార్సు చేసిన విద్యార్థులకు ప్రవేశాల్లో ప్రాధాన్యం కల్పిస్తారు.

విద్యార్థి సర్వోతోముఖాభివృద్ధి

విద్యతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థి సర్వోతోముఖ అభివృద్ధికి తోడ్పడే విధంగా అన్ని రకాల కార్యకలాపాలు కేంద్రీయ విద్యాలయాల్లో ఉంటాయి. సీబీఎస్ఈ సిలబస్‌ను బోధిస్తాం. నిబంధనల్లో పేర్కొన్న ప్రాధాన్య క్రమాన్ని అనుసరించి సీట్ల కేటాయింపు ఉంటుంది. ఒకటో తరగతిలో జాతీయ విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) నిబంధనల మేరకు 10 సీట్లను లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో ఎవరికైనా అవకాశం రావచ్చు. రెండు నుంచి అటుపై తరగతుల్లో మాత్రం అందుబాటులో ఉన్న ఖాళీల మేరకే ప్రవేశాలు కల్పిస్తాం.



- పి. శ్రీనివాస రాజు
ప్రిన్సిపల్, కేంద్రీయ విద్యాలయ - ఉప్పల్ (నెం.1), హైదరాబాద్.

ప్రవేశాలు ఇలా

- ఒకటి నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలు ప్రాధాన్యత క్రమం ఆధారంగా చేపడతారు. ఎక్కువగా సీట్లు ఖాళీ ఉండి వెయిటింగ్‌లో విద్యార్థులుంటే లాటరీ పద్ధతిలో అర్హుల ఎంపికను చివరిదశలో నిర్వహిస్తారు.
- రెండు నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రాధాన్య క్రమం ఆధారంగా అడ్మిషన్లను చేపడతారు. ఖాళీల కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే లాటరీ ద్వారా ప్రవేశాలను ఖరారు చేస్తారు.
- తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో 100 మార్కులకు పరీక్ష రాయాలి. హిందీ, ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ పాఠ్యాంశాల్లో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతి సబ్జెక్ట్ నుంచి 20 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షలో కనీసం 33 మార్కులు సాధిస్తేనే అర్హులుగా పరిగణిస్తారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 25 మార్కులు సాధిస్తే చాలు.
- ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అంటే 11వ తరగతిలో ప్రవేశాలు 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటాయి. 11వ తరగతిలో సైన్స్, కామర్స్, హ్యూమానిటీస్ గ్రూప్‌లు ఉంటాయి. ఇందులో సైన్స్ స్ట్రీమ్‌లో ప్రవేశానికి 10వ తరగతిలో 60 శాతం మార్కులు, కామర్స్ స్ట్రీమ్ కోసం 50 శాతం మార్కులు రావాలి. హ్యూమానిటీస్ కోసం కనీస ఉత్తీర్ణత సరిపోతుంది. అయితే ఈ నిబంధనలు కేంద్రీయ, కేంద్రీయేతర విద్యార్థులకు వేర్వేరుగా ఉంటాయి. ఖాళీలతో పాటు అదనపు సీట్ల భర్తీని జులై 31వ తేదీలోపు చేపడతారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు గడువు : ఒకటో తరగతిలో ప్రవేశాలకు మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు.
- మిగిలిన తరగతులకు: రెండో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు ఏప్రిల్ 2వ తేదీ నుంచి 9 వరకు.
- వయసు అర్హత: ఒకటో తరగతిలో ప్రవేశానికి మార్చి 31వ తేదీ నాటికి ఐదేళ్లు నిండి ఉండాలి. ఏడేళ్లలోపు వారికే ప్రవేశం ఉంటుంది.
- రెండో తరగతికి ఆరేళ్లు, మూడో తరగతికి ఏడేళ్లు, నాలుగో తరగతికి ఎనిమిదేళ్లు, ఐదో తరగతికి తొమ్మిదేళ్లు, ఆరో తరగతికి పదేళ్లు, ఏడో తరగతికి 11 సంవత్సరాలు, ఎనిమిదో తరగతికి 12 సంవత్సరాలు, తొమ్మిదో తరగతికి 13 సంవత్సరాలు, పదో తరగతికి 14 ఏళ్లు నిండి ఉండాలి (మార్చి 31వ తేదీ నాటికి).
- వెబ్‌సైట్లు: kvadmissiononline2018.in
  http://kvsangathan.nic.in

ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం విజేతల నిలయంగా మారింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ఈ మండలానికి చెందిన నలుగురు డిప్యూటీ తహశీల్దార్‌లుగా ఎంపికవ్వడం విశేషం. వీరిలో దేవరశెట్టి భాగ్యలక్ష్మి మహిళల కేటగిరీలో 3వ ర్యాంక్ సాధించింది. కర్నాటి రవీంద్రారెడ్డి, మంజునాథరెడ్డి, మద్దుల వెంకట కృష్ణారెడ్డి వరుసగా 19, 22, 27 ర్యాంకులు సాధించారు. ఈ నేపథ్యంలో నలుగురి విజయ ప్రస్థానం వారి మాటల్లోనే..

టాపర్స్ వాయిస్

బేస్తవారపేట..
గ్రూప్-2 విజేతల కోట

భర్త ప్రోత్సాహంతో..
- దేవరశెట్టి భాగ్యలక్ష్మి



గిద్దలూరు మండలం తిమ్మాపురం గ్రామంలో ప్రస్తుతంఒ వీఆర్వోగా ఉద్యోగం చేస్తున్నాను. అయితే ఉన్నత స్థాయికి చేరుకోవాలన్న లక్ష్యానికి తోడు భర్త చైతన్య కుమార్, నా ఇద్దరు అన్నయ్యల ప్రోత్సాహంతో గ్రూప్-2లో విజయం సాధించాను.

- ఒక వైపు వీఆర్వోగా ఉద్యోగం, మరో వైపు మూడేళ్ల పాప బాధ్యతలు.. రెంటినీ సమన్వయం చేసుకుంటూ గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమయ్యాను. రోజుకు 10 గంటలు చదివా. గ్రూప్-2 నోటిఫికేషన్ రాక ముందే ప్రిపరేషన్ ప్రారంభించాను. దాంతో పరీక్ష నాటికి అన్ని అంశాలను పునశ్చరణ చేసుకునే అవకాశం లభించింది. ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం చదవడానికి ప్రాధాన్యం ఇచ్చాను. అప్లికేషన్ ఓరియెంటేషన్‌లో చదవటంతో సిలబస్ పూర్తి చేయగలిగాను. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠ్యపుస్తకాల నుంచి సొంతంగా నోట్స్ రూపొందించుకున్నా. దాంతోపాటు ఆయా అంశాలను అనుసరించి తెలుగు అకాడమీ పుస్తకాలను ఎక్కువగా అధ్యయనం చేశా. జనరల్ స్టడీస్ కోసం పాఠశాల స్థాయిలో ఉండే పుస్తకాలపై ఆధారపడ్డాను. కరెంట్ అఫైర్స్‌పై ప్రధానంగా దృష్టి సారించా. ఇందుకోసం యూట్యూబ్‌లో కాకతీయ కరెంట్ ఎఫైర్స్, తెలుగు దిన పత్రికలు ప్రతిరోజు చదివాను.

ఉద్యోగానికి సెలవు పెట్టి...

2012లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చైతన్య కుమార్‌తో వివాహం జరిగింది. గ్రూప్-2పై ఆసక్తి ఉండటంతో ఉద్యోగానికి ఆరు నెలలు సెలవు పెట్టి ఇంటి వద్దనే చదివాను. ఆ సమయంలో చైతన్య ఎంతో ప్రోత్సహించారు. పాప, కుటుంబ బాధ్యతలు చూసుకోవడంతో ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రిపేర్ అయ్యాను. అదే విజయానికి దోహదం చేసింది.

అందరూ ఉద్యోగులే

బేస్తవారపేట మండలంలోని శింగరపల్లె గ్రామం మా స్వస్థలం. రైతు కుటుంబం. నాన్న చిన్న చెన్నయ్య, అమ్మ చెన్నమ్మ. నాకు ఇద్దరు అన్నయ్యలు. పెద్దన్నయ్య గలిజేరగుళ్ళ లోని పశువైద్యశాలలో వైద్యాధికారిగా, రెండో అన్న బేస్తవారపేట ఆరోగ్య వైద్యశాలలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ స్కూళ్లోనే..

10వతరగతి వరకు గలిజేరుగుళ్ళ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివా. బేస్తవారపేటలోని గౌతమి కళాశాల నుంచి ఇంటర్ పూర్తి చేశాను. ఎంసెట్‌లో బీడీఎస్ సీటు వచ్చింది. కానీ చేరలేదు. విజయవాడలో బి.ఫార్మసీ చేశాను. తరవాత జెఎన్‌టీయూ - కాకినాడ నుంచి ఎం. ఫార్మసీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ స్కూల్‌లో ఉద్యోగంలో చేరాను. ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే తపనతో 2014లో వీఆర్వో, గ్రామ పంచాయతీ సెక్రటరీ రెండు పరీక్షలు రాశాను. రెండు ఉద్యోగాలకూ ఎంపికయ్యాను. ఆ రెంటిలో వీఆర్వోను ఎంచుకున్నా.

సివిల్స్ ప్రిపరేషన్ ద్వారానే...
- కర్నాటి రవీంద్రా రెడ్డి

మా స్వస్థలం ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలంలోని పందిళ్ళపల్లె గ్రామం. రైతు కుటుంబం. నాన్న కర్నాటి వెంకటరెడ్డి, అమ్మ వెంకటమ్మ. పాఠశాల విద్య మొత్తం మా ఊర్లోని ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. బేస్తవారపేట గౌతమి కళాశాలలో ఇంటర్మీడియట్, కంభం యస్.వి.కె.పి కళాశాలలో డిగ్రీ, కడప కెఎస్ఆర్ఎం కళశాల నుంచి ఎంసీఏ పూర్తి చేశాను. 2014లో జరిగిన ఎస్ఐ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ వచ్చింది. అయితే సెలవు పెట్టి సివిల్స్‌కు ప్రిపరేషన్ ప్రారంభించాను. ఆ క్రమంలో గ్రూపు-2 పరీక్షలు రాశాను. గ్రూప్-2 ముగిసిన తరవాత ఎస్ఐ శిక్షణ కోసం వెళ్లాను.



స్నేహితుడే స్ఫూర్తి

నా స్నేహితుడు చిలకల రాజేశ్వరరెడ్డి హైదరాబాద్‌లో ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. తానే నాకు స్ఫూర్తి. అతణ్ని ఆదర్శంగా తీసుకొని విజయం సాధించా. మొదటి నుండి మంచి ఉద్యోగం సాధించాలనే తపన ఉండేది. దీంతో గతేడాది నుంచి సివిల్స్‌కు ప్రిపేరవ్వడం ప్రారంభించాను. ఆ ప్రిపరేషన్ ప్రస్తుత గ్రూప్-2 విజయానికి దోహదం చేసింది. లక్ష్మీకాంత్, తెలుగు అకాడమీ పుస్తకాలు, ఎకనమిక్స్ చిరంజీవి సార్ నోట్స్ కూడా చాలా ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం అనంతపురం పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్నా. గ్రూప్‌లో జోనల్ స్థాయిలో 333.9 మార్కులతో 19వ ర్యాంకు వచ్చింది. దీంతో డిప్యూటీ తాహశీల్దార్‌గా పోస్టు వచ్చింది. ఎస్ఐ పోస్టు వదులుకొని డిప్యూటీ తహశీల్దార్‌గా వెళ్తాను.

వర్తమానంతో విజయం..
- దుంప మంజునాథరెడ్డి

మా స్వస్థలం ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలంలోని పూసలపాడు గ్రామం. నాన్న దుంప నారాయణరెడ్డి, అమ్మ నారాయణమ్మ. రైతు కుటుంబం. 10వ తరగతి వరకు బేస్తవారపేటలోని శుభోదయ స్కూల్‌లో, ఒంగోలు ప్రతిభ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివాను. తరవాత బీటెక్ పూర్తి చేశాను. 2014లో గ్రామ పంచాయతీ సెక్రటరీగా ఎంపికయ్యాను. అర్ధవీడు మండలంలోని బోగోలులో ఉద్యోగం చేస్తూ సెలవు పెట్టి సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. ఈ క్రమంలోనే గ్రూప్-2 రాశా. జోనల్ స్థాయిలో 331.9 మార్కులు సాధించి 22వ ర్యాంకు తెచ్చుకున్నాను.



అన్వయంతో ప్రయోజనం

ఉద్యోగానికి సెలవుపెట్టి గ్రూప్-2కి ప్రిపేర్ అవుతా అని చెప్పినప్పుడు తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారు. ప్రిపరేషన్ కోసం హైదరాబాద్ వచ్చా. అక్కడ నలుగురు స్నేహితులతో కలిసి ఉండేవాణ్ని. ఆ సమయంలో వారందరితో కలిసి నోట్స్ తయారు చేసుకోవడం, సిలబస్‌ను వర్తమాన అంశాలతో అన్వయించడం చేసి చదివేవాణ్ని. తెలియని విషయాలపై చర్చించుకునే వాళ్లం. ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించేవాణ్ని. ఏపీ ఎకనామికల్ సర్వే కూడా బాగా ఉపయోగపడింది.

తహశీల్దార్ కావాలనే...
- మద్దుల వెంకట కృష్ణారెడ్డి

మా స్వస్థలం ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలంలోని ఒందుట్ల గ్రామం. నాన్న మద్దుల సదాశివారెడ్డి, అమ్మ వెంకట సుబ్బమ్మ. 10వ తరగతి వరకు పూసలపాడులో చదివాను. ఇంటర్మీడియట్ బేస్తవారపేట విజ్ఞాన్ కళాశాలలో, కందుల ఓబుల్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఆంధ్రా యూనివర్సిటీ కాకినాడ క్యాంపస్‌లో ఎంఎస్సీ పూర్తి చేశాను.

10వ తరగతిలోనే

రైతు కుటుంబం కావడంతో పొలంలో పండించిన కూరగాయలు మార్కెట్‌కు తరలించి వచ్చిన డబ్బుతో నన్ను చదివించారు. నా కోసం వారు పడుతున్న కష్టాలు చూసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఎక్కువైంది. 10వ తరగతిలో ఉన్నప్పుడే తహశీల్దార్ కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. ప్రస్తుత గ్రూప్-2లో 326.8 మార్కులు సాధించి జోనల్ స్థాయిలో 27వ ర్యాంకు సాధించా. దీంతో డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంపికయ్యాను. నేను హైదరాబాద్‌లో మరో ఇద్దరు స్నేహితులతో కలిసి గ్రూపు-2కు ప్రిపేర్ అయ్యాను. మేము ముగ్గురం తెలియని విషయాలు ఒకరికొకరం చర్చించుకునేవాళ్లం. ముగ్గురం విజయం సాధించాం. కరెంట్ అఫైర్స్ రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవాణ్ని. ఒక సబ్జెక్ట్ కోసం అనేక పుస్తకాలు కాకుండా ఒక్కటే ప్రామాణిక పుస్తకం చదివేవాణ్ని.



- పాపిశెట్టి వీరయ్య, ఆంధ్రజ్యోతి, బేస్తవారపేట (ప్రకాశం జిల్లా).

జాబ్ కార్నర్

టెక్నికల్ అసిస్టెంట్లు

నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (నీరీ) టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **15**
- పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్లు 10, టెక్నికల్ ఆఫీసర్ 1, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ 4
- నెలవారీ వేతనం: టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.35,400 టెక్నికల్ ఆఫీసర్లకు రూ.49,900 సీనియర్ టెక్నికల్ ఆఫీసర్లకు రూ.56,100
- అర్హత: పోస్టును అనుసరించి బిఎస్సీ / ఎమ్మెస్సీ (ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రికల్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ / ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) / బిఈ / బిటెక్/ ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: జనవరి 31 నాటికి 28 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు ఫీజు: రూ.100
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 2
- వెబ్‌సైట్: www.neeri.res.in

ప్రపంచ స్నూకర్ ఫైనల్లో భారత్ X పాక్

దోహా : ఐబీఎస్ఎఫ్ ప్రపంచకప్ స్నూకర్ టీమ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత జట్టు.. పాకిస్థాన్‌ను ఢీకొననుంది. శుక్రవారం జరిగిన పోరులో భారత్ 3-2 తేడాతో ఇరాన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. హాకాంగ్‌ను 3-2 తేడాతో ఓడించిన పాకిస్థాన్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఇరాన్‌తో పోరులో సింగిల్స్‌లో పంకజ్ అడ్వాణీ, మనన్ తమ మ్యాచ్‌లను గెలుచుకుని శుభారంభం అందించారు. అయితే డబుల్స్‌లో అడ్వాణీ - చంద్ర జోడి ఓడిపోవడంతోపాటు రివర్స్ సింగిల్స్‌లో అడ్వాణీ ఓడిపోవడంతో స్కోరు సమమైంది. విజేతను తేల్చే చివరి సింగిల్స్‌లో మనన్ తన అనుభవాన్నంతా రంగరించి విజయం సాధించడంతో భారత్ ఫైనల్‌కు చేరింది.


నవజోత్ కౌర్


సాక్షి మాలిక్

నవజోత్ పసిడి పట్టు

ఆసియా రెజ్లింగ్‌లో స్వర్ణంతో చరిత్ర • సాక్షికి కాంస్యం

న్యూఢిల్లీ: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ నవజోత్ కౌర్ పసిడి 'పట్టు' పట్టింది. కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నవజోత్ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. 65 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్లో నవజోత్ 9-1 స్కోరుతో జపాన్‌కు చెందిన మియా ఇమాయిని చిత్తు చేసి విజేతగా నిలిచింది. దీంతో సీనియర్ ఆసియా రెజ్లింగ్‌లో స్వర్ణం సాధించిన తొలి మహిళా రెజ్లర్‌గా నవజోత్ చరిత్ర సృష్టించింది. ఇక కచ్చితంగా స్వర్ణం సాధిస్తుందనుకున్న రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ 62 కిలోల విభాగంలో కాంస్యంతో సరిపెట్టుకుంది. హోరాహోరీగా సాగిన కాంస్యపతక పోరులో సాక్షి 10-7తో అయాయులిమ్ కసిమోవాపై గెలిచింది. దీంతో ఈ టోర్నీలో భారత్ పతకాల సంఖ్య ఆరుకు చేరింది.

మ.1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ -1లో

భారత్ షెడ్యూల్

మార్చి 3 : అర్జెంటీనాతో (మ.1.30కు)
మార్చి 4 : ఇంగ్లండ్‌తో (మ. 1.30కు)
మార్చి 6 : ఆస్ట్రేలియాతో (మ 3.30కు)
మార్చి 7 : మలేసియాతో (సా.6.05కు)
మార్చి 9 : ఐర్లండ్‌తో (మ.3.35కు)


సర్దార్ సింగ్

భారత్‌కు సవాల్

- తొలి మ్యాచ్‌లో అర్జెంటీనాతో ఢీ
- నేటి నుంచి అజ్లాన్ షా కప్

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీకి శనివారం ఇక్కడ తెరలేవనుంది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు ప్రపంచ రెండో ర్యాంకర్ అర్జెంటీనాతో తలపడనుంది. గురువారం జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో ప్రపంచ నెంబర్ వన్ ఆస్ట్రేలియా చేతిలో భారత్ 1-2తో పోరాడి ఓడింది. ఈ పోటీలో పరాజయం పాలైనా టోర్నీలో జట్టు సత్తా చాటగలదని చీఫ్ కోచ్ జోర్డ్ మార్జిన్ ఆశాభావం ప్రకటించాడు. భువనేశ్వర్‌లో గత డిసెంబరులో జరిగిన వరల్డ్ హాకీ లీగ్ ఫైనల్స్ టోర్నీలో చివరిసారి అర్జెంటీనాతో భారత్ తలపడింది. ఆ టోర్నీ సెమీఫైనల్లో 0-1తో ఓడిన భారత్ టైటిల్ రేస్ నుంచి నిష్క్రమించింది. కోచింగ్‌లో ప్రసిద్ధుడైన కార్లోస్ రెటెగ్యూ రాజీనామా చేయడంతో అతడి సేవలు లేకుండానే అర్జెంటీనా ఈ టోర్నీ బరిలో దిగుతోంది. ఇక సర్దార్ సింగ్ కెప్టెన్సీలో అజ్లాన్ షా కప్‌లో భారత్ ఒక్కసారి కూడా పతకం లేకుండా తిరిగి రాలేదు. 2008లో అతడి సారథ్యంలోనే రజత పతకం కైవసం చేసుకున్న భారత్.. 2015, 2016లో కాంస్య, రజత పతకాలు చేజిక్కించుకోవడం విశేషం. కానీ ఈసారి ఫార్వర్డులు ఆకాశ్‌దీప్ సింగ్, ఎస్వీ సునీల్, మన్‌దీప్ సింగ్, మిడ్‌ఫీల్డ్‌లో మన్‌ప్రీత్ సింగ్, గోల్‌కీపర్ శ్రీజేష్, డ్రాగన్‌ఫ్లిక్ నిపుణులు రూపిందర్‌పాల్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్ లేకుండానే భారత్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఈ నేపథ్యంలో యువ ఆటగాళ్లతో కూడిన భారత్.. ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనాతో ఆరంభ మ్యాచ్‌ను ఎలా ఎదుర్కొంటుందో ఆసక్తికరంగా మారింది. 'విజయంతో టోర్నీని ఆరంభించాలని పట్టుదలగా ఉన్నాం. వ్యూహాలను అమలు పరచడం, అందుకనుగుణంగా ఆడడం ముఖ్యం. అర్జెంటీనా లాంటి బలీయమైన జట్టుతో మ్యాచ్‌లో పొరపాట్లకు తావుండకూడదు. ప్రత్యర్థి ఒలింపిక్ చాంపియన్ అన్న భయం మాకు లేదు. జట్టు చక్కటి ఆటతీరు ప్రదర్శిస్తుందన్న నమ్మకం ఉంది' అని 31 ఏళ్ల సర్దార్ సింగ్ అన్నాడు. ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను భారత్ ఢీకొననుంది.

కొరియాకు మహిళల జట్టు: బెంగళూరు: కెప్టెన్ రాణి సారథ్యంలోని భారత మహిళల జట్టు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కోసం శుక్రవారం కొరియా బయలు దేరింది. 20 మంది సభ్యులుగల జట్టుకు సునీత లక్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది. మార్చి 5 నుంచి 11 వరకూ ఈమ్యాచ్‌లు జరగనున్నాయి.

ప్రపంచ అత్యుత్తమ ఫినిషర్లలో ఒకడిగా ఖ్యాతిగాంచిన ఎంఎస్ ధోనీ బ్యాటింగ్‌లో మునుపటి దూకుడు లేదని, జట్టుకు భారంగా మారుతున్నాడనే విమర్శలు సహజంగా వినిపిస్తున్నా టీమిండియా కోచ్ రవిశాస్త్రి మాత్రం అతడిపై అపార నమ్మకాన్ని ఉంచుతున్నాడు. ధోనీ అనుభవం అత్యంత విలువైనదని కోచ్ తేల్చాడు. అది మార్కెట్‌లో దొరికేదీ కాదని స్పష్టం చేశాడు. కచ్చితంగా అతను వన్డే క్రికెట్‌లో గొప్ప బ్యాట్స్‌మెన్‌లో ఒకడిగా నిలుస్తాడని అన్నాడు. అలాగే కెప్టెన్ కోహ్లీ ఆశావహ దృక్పథమే జొహాన్నెస్‌బర్గ్ టెస్టు విజయానికి కారణమని చెప్పాడు.


జార్జ్ కొరోనెస్

99 ఏళ్ల వయసులో..
ప్రపంచ రికార్డు బ్రేక్ చేసిన ఆసీస్ స్విమ్మర్

క్వీన్స్‌లాండ్: ఇతడి పేరు జార్జ్ కొరోనెస్.. వయస్సు 99 ఏళ్లు. అయితేనేం.. ప్రతిభకు వయసు అడ్డంకి కాదని నిరూపిస్తూ స్విమ్మింగ్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. అదీ.. ప్రపంచ రికార్డు ప్రదర్శనతో కావడం విశేషం. క్వీన్స్‌లాండ్‌లో జరిగిన ఓ అధికారిక టోర్నీలో 100-104 వయస్సు విభాగంలో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు చెందిన జార్జ్.. 50 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డును బద్ధలుగొట్టాడు. 56.12 సెకన్లలో గమ్యం చేరిన జార్జ్.. 35 సెకన్ల తేడాతో హారిసన్ అనే స్విమ్మర్ పేరిటనున్న గత ప్రపంచ రికార్డును తిరగరాశాడు. జార్జ్ వచ్చే ఏప్రిల్‌లో వందో ఏట అడుగుపెట్టనున్నాడు.

ఒకే గంటలో రెండు హ్యాట్రిక్‌లు

ఆక్లాండ్: న్యూజిలాండ్ దేశవాళీ టోర్నీ ప్లంకెట్ షీల్డ్ టోర్నమెంట్‌లో అరుదైన సంఘటన చోటు చేసుకుంది. రెండు వేర్వేరు చోట్ల గంట వ్యవధిలోపే హ్యాట్రిక్ నమోదవడమే కాకుండా ఈ ఇద్దరు బౌలర్లు కూడా తమ రెండేసి ఓవర్లలోనే ఇది సాధించడం విశేషం. 112 ఏళ్ల ప్లంకెట్ షీల్డ్ చరిత్రలో ఇలా ఒకే రోజు రెండు హ్యాట్రిక్‌లు రావడం ఇదే తొలిసారి. ముందుగా వెల్లింగ్టన్ ఆటగాడు లోగన్ వాన్ బీక్.. కాంటర్‌బరీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో తన నాలుగు, ఆరో ఓవర్‌లో ఈ ఫీట్ సాధించాడు. మరో గంటలోపే ఆక్లాండ్ ఆటగాడు మాట్ మెక్‌ఇవాన్.. నార్తర్న్ డిస్ట్రిక్ట్‌పై 26, 28వ ఓవర్లో హ్యాట్రిక్ పూర్తి చేశాడు. అంతే కాదు వీరిద్దరూ ఒకే పాఠశాలలో విద్యనభ్యసించడం మరో విశేషం.


మెక్‌ఇవాన్
లోగన్

కామన్వెల్త్‌లో స్వర్ణం కొడతా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగే కామన్వె ల్త్ క్రీడల్లో కచ్చితంగా స్వర్ణం సాధిస్తానని ప్రపంచ కప్ జిమ్నాస్టిక్స్‌లో కాంస్య పతక విజేత అరుణా రెడ్డి ధీమా వ్యక్తం చేసింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ జరిగిన ప్రపంచ టోర్నీలో కాంస్య పతకం గెలిచి చరిత్ర సృష్టించిన అరుణ శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా అరుణకు ఘన స్వాగతం లభిం చింది.


శుక్రవారం హైదరాబాద్ చేరిన జిమ్నాస్ట్ అరుణా రెడ్డికి అభిమానుల స్వాగతం

ఆ అనుభవానికి వెల కట్టగలమా!

- ధోనీ 'విలువ'ను మార్కెట్‌లో కొనలేం
- కోహ్లీ ఆత్మవిశ్వాసం అమోఘం
- టీమిండియా కోచ్ రవిశాస్త్రి





జూనియర్ సెలెక్షన్ కమిటీకి వెంకీ రాజీనామా


న్యూఢిల్లీ: జాతీయ జూనియర్ క్రికెట్ సెలెక్షన్ కమిటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న వెంకటేశ్ ప్రసాద్ తన పదవికి రాజీనా మా చేశాడు. ఇటీవల అండర్-19 ప్రపంచకప్ ను నెగ్గిన భారత కుర్రాళ్లను తన ఆధ్వర్యంలోని కమిటీయే ఎంపిక చేసింది. గత 30 నెలల నుంచి అతడు ఈ బాధ్యతల్లో ఉన్నాడు. అయితే ఇటీవలి కాలంలో బీసీసీఐ పెద్దలతో తనకు సరిగా పడడం లేదు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నానని, పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు రాకూడదని భావిస్తున్నట్టు తెలిపాడు. దీంతో తను ఐపీఎల్‌లో భాగస్వామ్యం కాబోతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అండర్-19 ప్రపంచకప్ నెగ్గిన జట్టుకు రివార్డులు ప్రకటించిన బోర్డు.. సెలెక్టర్లకు మాత్రం ఎలాంటి నజరానా ప్రకటించకపోవడం వివాదమైంది. అదే చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరినందుకు సీనియర్ జట్టు సెలెక్టర్లకు, ప్రపంచకప్ ఫైనల్‌కు చేరినందుకు భారత మహిళల జట్టు సెలెక్టర్లకు మాత్రం భారీ ప్రోత్సాహకాలను అందించడం గమనార్హం.

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో మాజీ కెప్టెన్ ధోనీ ది ప్రత్యేక ముద్ర. జట్టుకు రెండు ఫార్మాట్ల లో ప్రపంచకప్‌లు అందించిన ఏకైక నాయకుడిగా అతడి కీర్తి అజరామరం. 2004లో జట్టులోకి వచ్చింది మొదలు ఆపద సమయాల్లో తనే పెద్ద దిక్కుగా మారి ఎన్నో ఘన విజయాలందించాడు. గతేడాది చాంపియన్స్ ట్రోఫీ అనంతరం జట్టు విండీస్ పర్యటనకు వెళ్లగా అక్కడ ధోనీ ప్రదర్శన పలు విమర్శలకు దారి తీసింది. అయినా కెప్టెన్ కోహ్లీ తన మాజీ సారథి వెన్నంటి నిలిచాడు. ఆ తర్వాత జరిగిన సిరీస్‌లలోనూ జట్టుకు అండగా నిలిచాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లోనూ బౌలర్లకు మార్గనిర్దేశనం చేస్తూ ధోనీ కొత్తపాత్ర పోషించాడు. అందుకే ధోనీ అనుభవాన్ని అత్యంత విలువైన ఆస్తిగా కోచ్ రవిశాస్త్రి పేర్కొంటున్నాడు. 'నేను ఇంతకుముందే చెప్పినట్టు అనుభవానికి ప్రత్యామ్నాయం లేదు. అది మార్కెట్‌లో కొనుక్కుంటే దొరికేది కాదు.. అమ్మేదీ కాదు. వన్డేల్లో గొప్ప ఆటగాళ్లలో ధోనీ ఒకడు. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలోనూ అతడికతడే సాటి' అని శాస్త్రి ప్రశంసించాడు.

అలా చాలా కొద్ది మందే ఉంటారు: ప్రపంచ క్రికెట్‌లో ధోనీలాంటి ఫినిషర్లు చాలా కొద్దిమందే కనిపిస్తారని శాస్త్రి అభిప్రాయపడ్డాడు. డెత్ ఓవర్లలో కీలక ఇన్నింగ్స్ ఆడడం అందరికీ సాధ్యం కాదన్నాడు. 'మ్యాచ్‌ను ముగించడం లేదా చివరి ఓవర్లలో బ్యాటింగ్ చేయడంలో అతడిని మించిన వారు క్రికెట్ చరిత్రలో చాలా కొద్దిమందే కనిపిస్తారు. ఐదు, ఆరు లేదా ఏడో స్థానంలో ఇలాంటి బ్యాట్స్‌మన్ క్రీజులోకి దిగితే భారీ తేడా కనిపిస్తుంది' అని కోచ్ వెల్లడించాడు.

కోహ్లీ వల్లే ఆ విజయం: సఫారీలతో తొలి రెండు టెస్టులు ఓడినా కూడా మానసికంగా ధృడంగా ఉన్న కెప్టెన్ కోహ్లీ ధోరణి వల్లే మూడో టెస్టును గెలుచుకోగలిగామని కోచ్ అన్నాడు. 'మూడో టెస్టులో కచ్చితంగా భారత్‌దే విజయం అనే ధీమాతోనే కోహ్లీ ఉన్నాడు. ప్రొటీస్ 120/1తో ఉన్నదశలో కూడా కోహ్లీ ఆశలు వదులుకోలేదు. టీ విరామంలోనూ మనమే మ్యాచ్‌ను నెగ్గబోతున్నామన్నాడు. అలాంటి నమ్మకాన్ని వ్యక్తపరిస్తే అది ఇతరులకు కూడా వైరస్‌లాగా వ్యాప్తిస్తుంది' అని చెప్పాడు.

ధోనీ, బ్రేవోల సలహాలు స్వీకరిస్తా


మార్క్ ఉడ్

చెన్నై: క్లిష్ట పరిస్థితుల్లోనూ రాణించేందుకు సంయమనం పాటించాలంటే భారత మాజీ కెప్టెన్ ధోనీ, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రేవోల సలహాలు స్వీకరిస్తానని ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాడైన ఇంగ్లండ్ పేస్‌బౌలర్ మార్క్ ఉడ్ అన్నాడు. ఐపీఎల్‌లో తన కెప్టెన్ ధోనీనుంచి ఎంతో నేర్చుకుంటానన్న ఉడ్.. ఒత్తిడిలోనూ సంయమనం కోల్పోకుండా ఉండడమెలాగో ధోనీని చూసి నేర్చుకోవాలన్నాడు. నెమ్మదైన బంతులను వేయడమెలాగో బ్రేవోనుంచి నేర్చుకుంటానన్నాడు. ఐపీఎల్‌లాంటి టోర్నీలో అందునా చెన్నైవంటి మేటి జట్టుకు ఆడడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, జట్టుకు విజయాలు చేకూర్చడంలో తనవంతు పాత్ర పోషిస్తానని 28 ఏళ్ల ఉడ్ తెలిపాడు.

క్రీడా సంస్కృతి పెంపొందిస్తా


కోహ్లీ

పనాజీ: దేశంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడమే తన ధ్యేయమని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తెలిపాడు. క్రికెట్ ద్వారా తాను ఎంతో ఎదిగానని, అందువల్ల క్రీడా రంగ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని చెప్పాడు. ఇండియన్ సూపర్‌లీగ్ (ఐఎస్ఎల్) ఫ్రాంచైజీ ఎఫ్‌సీ గోవా సహ యజమాని అయిన కోహ్లీ.. తన జట్టుకు మద్దతుగా ఇక్కడ జరిగిన మ్యాచ్‌కు హాజరయ్యాడు. ఈ సందర్భంగా కోహ్లీ మాట్లాడుతూ..గోవా జట్టులో వాటాలు తీసుకోవడం వ్యాపారం ఎంతమాత్రం కాదని స్పష్టంజేశాడు. ఫుట్‌బాల్‌పట్ల తనకున్న అనురక్తే అందుకు కారణమని చెప్పాడు. తాను క్రికెటర్‌ను అయినా ఫుట్‌బాల్ ఆడడం ఎంతో ఎగ్జయిటింగ్‌గా ఉంటుందని తెలిపాడు. భారత క్రికెట్ జట్టు అంతా ఫుట్‌బాల్‌ను ఎంతో ప్రేమిస్తుందని చెప్పాడు. క్రికెట్ ట్రెయినింగ్‌లో 20 ల్యాప్‌లు పరిగెత్తడం తనకు బోరింగ్‌గా ఉంటుందని, అదే ఫుట్‌బాల్ మ్యాచ్ అంటే ఎగిరి గంతేస్తానన్నాడు.

ఏఆటకైనా వీక్షకులు ముఖ్యం: ఏ ఆటకైనా లేదా క్రీడాకారుడికైనా గుర్తింపు రావాలంటే అతడు లేదా ఆ ఆట టీవీల్లో ప్రసారం కావాల్సి ఉంటుందని కోహ్లీ అన్నాడు. అండర్-19 క్రికెట్ వరల్డ్‌కప్ కనుక ప్రత్యక్ష ప్రసారం కాకపోయి ఉంటే తాను కూడా ఇప్పుడు ఈ స్థితిలో ఉండేవాడిని కాదన్నాడు. ఏవైనా పోటీలను ప్రజలు పదేపదే వీక్షిస్తుంటే ఆ ఆటతో వారు పెనవేసుకు పోతారని తద్వారా ఆ క్రీడకు, ఆటగాళ్లకు ప్రాచుర్యం లభిస్తుందని తెలిపాడు. దేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ ఫుట్‌బాల్‌కు లేకపోవడానికి కొద్దికాలం కిందటి వరకూ పెద్ద లీగ్‌లు జరగకపోవడమేనని చెప్పాడు. ప్రస్తుతం ఐఎస్ఎల్ ఫుట్‌బాల్ పట్ల ప్రజల్లో ఎంతో క్రేజ్ పెంచుతోందని పేర్కొన్నాడు. ఇది ఆ క్రీడ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని కోహ్లీ అన్నాడు.

దిబాబా హ్యాట్రిక్

ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్‌లో స్వర్ణంతో రికార్డు



బర్మింగ్‌హామ్: ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఇథియోపియా దిగ్గజం గెంజెబే దిబాబా 3000 మీటర్ల రేసులో విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఈ రేసులో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన దిబాబా టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో పసిడి పతకం దక్కించుకోవడం దిబాబాకిది వరుసగా మూడో సారి కావడం విశేషం. ఈ విజయాన్ని తన దేశ ప్రజలకు అంకితమిస్తున్నట్టు దిబాబా తెలిపింది.

అందరూ 'దారి' తప్పారు!

ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన 400మీ. హీట్స్‌లో అరుదైన సంఘటన జరిగింది. ఇందులో పాల్గొన్న ఐదుగురు అథ్లెట్లపై కూడా అనర్హత వేటు పడడం సంచలనం రేపింది. ఇలా జరగడం అథ్లెటిక్స్ చరిత్రలోనే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో ఈ ఏడాది అత్యంత వేగంగా పరిగెత్తిన బ్రాలోన్ టాప్లిన్ (గ్రెనెడా)కూడా ఉన్నాడు. సెమీస్‌కు ముందు మూడో హీట్‌లో జరిగిన ఈ రేసులో మరో ముగ్గురు అథ్లెట్లతో కలిసి తను నిబంధనలకు విరుద్ధంగా లైన్ తప్పి పరిగెత్తడంతో క్వాలిఫై కాలేకపోయారు. ఖతర్‌కు చెందిన హరౌన్ ఇదే హీట్‌లో ఫాల్స్ స్టార్ట్ చేసినందుకు రెడ్ కార్డుకు గురయ్యాడు.

విమానంనుంచి రైలులోకి..


శార్దూల్ ఠాకూర్

ముంబై: విమానాల్లో తిరగాల్సిన వ్యక్తి హఠాత్తుగా రైలులో సాధారణ వ్యక్తిగా ప్రయాణిస్తుంటే తోటి ప్రయాణికుల్లో ఆసక్తితోపాటు అనుమానంకూడా కలుగుతుంది. భారత పేస్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ విషయంలోనూ ఇదే జరిగింది. దక్షిణాఫ్రికాలో వన్డే, టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులోని సభ్యుడైన శార్దూల్ స్వదేశానికి రాగానే ఇంటికి చేరుకునేందుకు విమానాశ్రయంనుంచి అంధేరి రైల్వే స్టేషన్‌కు చేరుకుని లోకల్ ట్రైన్‌లో ఎక్కగానే ప్రయాణికులు ఆశ్చర్యపోయారు. గతంలో గంటన్నర ప్రయాణం చేసి గ్రౌండ్‌కు చేరుకుని జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేసిన శార్దూల్‌ను పలువురు తోటి ప్రయాణికులు గుర్తించి అభినందనలు అందజేశారు. జాతీయ క్రికెటర్ అయినా నిరాడంబరంగా లోకల్ ట్రైన్‌లో ప్రయాణించడం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఎంత ఎత్తుకు ఎదిగినా తాను మూలాలను మర్చిపోలేదని శార్దూల్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు.

కుప్పకూలిన దక్షిణాఫ్రికా

- మొదటి ఇన్నింగ్స్ 162
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 351

డర్బన్: తొలి టెస్టులో ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. డివిల్లీర్స్ (127 బంతుల్లో 11 ఫోర్లతో 71 నాటౌట్) మినహా ఎవరూ రాణించలేకపోవడంతో దక్షిణాఫ్రికా తమ మొదటి ఇన్నింగ్స్‌లో 51.4 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. దీంతో ఆసీస్ 189 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. పేసర్ మిచెల్ స్టార్క్ (5/34), స్పిన్నర్ నాథన్ లియోన్ (3/50) ఆతిథ్య జట్టును వణికించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 225/5తో శుక్రవారం రెండోరోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ 110.4 ఓవర్లలో 351 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (173 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్‌తో 96) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఐదు వికెట్లతో చెలరేగగా.. ఫిలాండర్ మూడు, రబడా రెండు వికెట్లు తీశారు.

10 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్



సుశీల్ మృతదేహాన్ని మోస్తున్న భూపాలపల్లి జయశంకర్ జిల్లా ఎస్పీ భాస్కరన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఓఎస్‌డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ సునీల్‌దత్. (ఇన్‌సెట్లో) సుశీల్

కష్టాల కడలిని ఈదుతూ.. తిరిగి రాని లోకాలకు

▸▸ ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పుల్లో కానిస్టేబుల్ సుశీల్ మృతి

మోమిన్‌పేట, భద్రాచలంటౌన్, ఖమ్మం, మార్చి 2: కర్ణాటక నుంచి వలస వచ్చిన కుటుంబం. చిన్నతనం నుంచి కష్టాలే. ఉండేది కుగ్రామం కావడంతో.. చదువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అయినా.. మొక్కవోని దీక్షతో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. పోలీస్ కానిస్టేబుల్ అయ్యారు. 14 ఏళ్ల కానిస్టేబుల్‌గా సేవలందించి.. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడయ్యారు. ఇదీ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్ కుమార్ గాథ..!

కర్ణాటకలోని బీదర్‌కు చెందిన విజయ్, జహీరాబాద్‌కు చెందిన శారద దంపతులు ఉద్యోగరీత్యా వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లిలో స్థిరపడ్డారు. శారద తొలుత అంగన్‌వాడీ కార్యకర్తగా.. తర్వాత ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేసి, పదవీ విరమణ పొందారు. వీరి కుమారుడు బి. సుశీల్ కుమార్ (33) చిన్నతనం నుంచే పోలీస్ అవ్వాలని కలలుకన్నారు. సదాశివపేట్‌లో ఇంటర్ పూర్తయ్యాక.. 2004 పోలీసు రిక్రూట్‌మెంట్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తొలుత శంషాబాద్.. ఆ తర్వాత చందానగర్ పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుల్‌గా పనిచేశారు. 2014లో డిప్యూటేషన్‌పై గ్రేహౌండ్స్‌లో చేరారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడయ్యారు. సుశీల్‌కు మూడేళ్ల కూతురు సుశాల్ ఉంది. సుశీల్ మృతదేహానికి పోలీసు ఉన్నతాధికారులు నివాళులర్పించారు. శుక్రవారం మధ్యాహ్నానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి.. జాతీయ పతాకాన్ని జవాను మృతదేహంపై ఉంచారు. భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జయశంకర్ జిల్లాల ఎస్పీలు అంబరకిషోర్ ఝా, భాస్కరన్, భద్రాచలం, ఏటూరు నాగారం ఏఎస్పీలు సునీల్‌దత్, రాహుల్ హెగ్డే, కొత్తగూడెం ఓఎస్‌డీ ఉదయ్‌కుమార్‌రెడ్డిలు సుశీల్‌కు నివాళులర్పించారు.



● పోలీసులకు పౌరహక్కులు ఉండవా?:పోలీసుల సంఘం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మావోయిస్టుల దాడుల్లో సుమారు 500 మంది పోలీస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని, అందులో తెలంగాణ ప్రాంతానికి చెందినవారు 330 మంది ఉన్నారని పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి తెలిపారు. ఇంతమంది పోలీస్ సిబ్బంది చనిపోయినప్పుడు జరిగినవి కూడా బూటకపు ఎన్‌కౌంటర్లేనా.. అని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టులకు మాత్రమే పౌరహక్కులు ఉంటాయా? పోలీస్‌లకు పౌరహక్కులు ఉండవా? పౌరహక్కుల సంఘాల వైఖరి మారదా? అని నిలదీశారు. నిషేధిత సంస్థలకు పౌరహక్కుల సంఘాలు కొమ్ముకాయడం సరైంది కాదని ఒక ప్రకటనలో హితవుపలికారు. ఏకే 47, మందుగుండు సామాగ్రి, రాకెట్ లాంచర్లు పట్టుకుని మావోయిస్టులు దేనికోసం అడవుల్లో తిరుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టు కాల్పుల్లో మృతిచెందిన కానిస్టేబుల్ సుశీల్ కుమార్ కుటుంబసభ్యులకు రూ. 40లక్షల ఆర్థిక సాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడంలో సంఘం తరపున ప్రయత్నం చేస్తామని తెలిపారు.

● మూడు రాష్ట్రాల పోలీసుల నిఘా


కొత్తగూడెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల పోలీసులు మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టారు. గత నెలలో కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సమావేశమయ్యారు. మూడు రాష్ట్రాల మధ్య మావోయిస్టుల ప్రాబల్యం బాగా పెరిగిపోయినందున తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఐజీ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారులు పాల్గొన్నారు. వీరిలో పలువురు హెలికాప్టర్‌లో రావడం విశేషం. సుదీర్ఘంగా జరిగిన సమావేశం వివరాలను గోప్యంగా ఉంచారు.

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ప్రకారం.. ప్లీనరీ నిర్వహణలో భాగంగా అగ్ర నేతలతోపాటు పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఒకచోటకు వస్తున్నారనే సమాచారంతో రెండు రోజులుగా గ్రేహౌండ్స్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నారు. పూజారి కాంకేర్, చిన్న ఉట్లపల్లి మధ్య అగ్ర నేతలు సమావేశమయ్యారని పక్కా సమాచారం అందుకున్నారు. తెలంగాణ గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్, యూనిఫైడ్ కమాండ్‌కు సంబంధించి దాదాపు 800 మంది పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే-47, ఐదు ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్, 2 సింగిల్ బోర్ రైఫిళ్లు, 303 రైఫిల్, పిస్టల్, సోనీ రేడియో, రూ.41 వేల నగదు, 3 క్లెమోర్ మైన్స్, 6 రాకెట్ బాంబులు, 2 సోలార్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు.

అంతా గోప్యమే..!

భవిష్యత్తు కార్యాచరణపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మావోయిస్టులు పూజారి కాంకేర్ ప్రాంతంలో సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో, జయశంకర్ జిల్లా వెంకటాపురం నుంచి గురువారం రాత్రి తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు పూజారి కాంకేర్ అటవీ ప్రాంతానికి తరలి వెళ్లాయి. తెలంగాణ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఛత్తీస్‌గఢ్ బలగాలు చేరుకున్నాయి. అనంతరం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. మావోయిస్టు నేతలు చొక్కారావు, హరిభూషణ్, ఆయన భార్య సమ్మక్క మరణించినట్లు తొలుత ఛత్తీస్‌గఢ్ యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ డీఎం అవాస్తి ప్రకటించారు. కానీ, భద్రాచలం ఏరియా ఆస్పత్రికి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మూడు మృతదేహాలను మాత్రమే తీసుకొచ్చారు. వాటిలో రెండు మావోయిస్టులవి. అవి హరిభూషణ్, సమ్మక్కలవని ప్రచారం జరిగింది. ఆస్పత్రి, మార్చురీ వద్ద పోలీసుల హడావుడి కూడా ఇందుకు కారణమైంది. దీనిని తెలంగాణ పోలీసులు ధ్రువీకరించడం లేదు. మృతదేహాలు శనివారం మధ్యాహ్నానికి వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు ఏమీ చెప్పలేమని,



బాడే చొక్కారావు (ఫైల్)

కూంబింగ్ ఆపరేషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై పూర్తి గోప్యత పాటించారు. తెల్లవారుజామున 5 గంటలకు ఎన్‌కౌంటర్ జరగ్గా.. మృతుల వివరాలపై అధికారిక ప్రకటన వెలువడలేదు. భద్రాచలం నుంచి ఘటనా స్థలానికి 95 కిలోమీటర్లు ఉంటుంది. శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగితే మధ్యాహ్నానికి హెలికాప్టర్ వచ్చింది. సాయంత్రానికి ఒక విడత మూడు మృతదేహాలను తీసుకొచ్చింది. గతంలో మృతదేహాలను తీసుకొస్తున్న సమయంలో విశాఖకు చెందిన ఆర్ఎస్సై ప్రసాదరావును మావోయిస్టులు హతమార్చిన విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న పోలీసులు.. మిగిలిన మృతదేహలను తరలించే విషయంలో అచితూచి వ్యవహరిస్తున్నారు. మృతదేహాలు వేర్వేరు ప్రాంతాల్లో పడి ఉండటంతో వాటి తరలింపులో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. మావోయిస్టుల నుంచి ఎదురు దాడి కొనసాగవచ్చనే అనుమానంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు సంబంధించి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసు స్టేషన్లో శుక్రవారం సాయంత్రం కేసు నమోదైంది. ఎన్‌కౌంటర్ ఎక్కడ, ఎప్పుడు జరిగింది? ఎంతమంది మరణించారు? తదితర వివరాలను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

హరిభూషణ్ లేడనే మా నమ్మకం

ఎన్‌కౌంటర్లో తమ అన్న హరిభూషణ్ లేడనే నమ్మకం ఉందని మావోయిస్టు అగ్రనేత హరిభూషణ్ సోదరి యాపా భారతి, సోదరుడు అశోక్ తెలిపారు. శుక్రవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి వారు వచ్చారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "మా చిన్నతనంలోనే అన్న హరిభూషణ్ పేదల కోసం అడవికి వెళ్లాడు. ఎన్‌కౌంటర్లో అన్నావదినలు లేరని భావిస్తున్నాం. ఇక్కడ ఉన్న మృతదేహాలు వారివి కావు" అని తెలిపారు.

- భద్రాచలం, చింతూరు, చర్ల, నూగూరు వెంకటాపురం (భూపాలపల్లి జిల్లా)



మావోయిస్టు మృతదేహాన్ని భద్రాచలం ఆసుపత్రి మార్చురికి తీసుకొస్తున్న పోలీసులు

ఆత్మ రక్షణ కోసమే ఎదురు కాల్పులు: ఎస్పీ అంబర్ కిషోర్ ఝా

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులు జరిపారని, ఆత్మ రక్షణ కోసమే పోలీసులు ఎదురు కాల్పులకు దిగారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూజారి కాంకేర్ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారని సమాచారం అందడంతో సంయుక్త బలగాలు కూంబింగ్ నిర్వహించాయని, ఎదురు కాల్పుల్లో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు మరణించారని తెలిపారు. గ్రేహౌండ్స్ జవాను సుశీల్‌కుమార్ కూడా మరణించారని చెప్పారు. మూడు నెలలుగా సరిహద్దుల్లో మావోయిస్టులు అరాచకాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను ప్రాథమికంగా గుర్తించినా వాటిపై తుది నిర్ణయం వెలువరించాల్సి ఉందన్నారు. మిగతా మృతదేహాలను తరలించిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ విషయంలో ఎలాంటి గోప్యత లేదన్నారు.

ఫోరెన్సిక్ వైద్యుడి పర్యవేక్షణలో పోస్టుమార్టం చేయించండి

▸▸ ఆ ప్రక్రియను వీడియో రికార్డు చేయండి

▸▸ మృతదేహాలను బంధువులకు అప్పగించండి

▸▸ టి-సర్కారుకు ఉమ్మడి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తొండపాల్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో తెలంగాణ పరిధిలోకి తెచ్చిన మృతదేహాలకు ఫోరెన్సిక్ వైద్యుడి నేతృత్వంలో పోస్టుమార్టం చేయించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. పోస్టుమార్టం ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని.. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం మధ్యాహ్నం అత్యవసరంగా విచారించింది. ఎన్‌కౌంటర్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా హుసురు పోలీస్ స్టేషన్‌లో పరిధిలో జరిగిందని, ఈనేపథ్యంలో ఈ పిటిషన్‌ను విచారించే పరిధి ఈ కోర్టుకు లేదని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్‌రావు వాదించారు. ఎన్‌కౌంటర్ ఎక్కడ జరిగినా.. రెండు మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారని పిటిషనర్ తరఫున న్యాయవాది రఘునాథ్ ధర్మాసనానికి తెలిపారు. మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించిన నేపథ్యంలో ఈ పిటిషన్‌ను విచారించే పరిధి తమకుందని ధర్మాసనం స్పష్టం చేసింది. మృతుల్లో ఎవరైనా తెలంగాణకు చెందిన వారున్నారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. చనిపోయిన 12 మందిలో హరిభూషణ్ అనే వ్యక్తి తెలంగాణకు చెందిన వారని రఘునాథ్ కోర్టుకు తెలిపారు. ఇద్దరి మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారని, అయితే అక్కడ సరైన సౌకర్యాలు లేవని చెప్పారు. మృతదేహాలకు ఫోరెన్సిక్ వైద్యుడి పర్యవేక్షణలో వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. అయితే భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసేందుకు అన్ని సౌకర్యాలూ ఉన్నాయని, అక్కడికి తరలించిన మృతదేహాల్లో ఒకటి హరిభూషణ్‌దికాగా, మరో మృతదేహం పోలీసుదని అదనపు ఏజీ కోర్టుకు వివరించారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేయాల్సిందిగా ఆదేశించిన కోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎన్‌కౌంటర్ బూటకం: వరవరరావు



ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకిస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వరవరరావు

చిక్కడపల్లి/హైదరాబాద్/ఖమ్మం/కొత్తగూడెం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని విరసం నేత వరవర రావు ఆరోపించారు. మవోయిస్టులను పట్టుకొని వచ్చి.. ఇరు రాష్ట్రాల సరిహద్దులో చిత్రహింసలకు గురిచేసి చంపారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే న్యాయవిచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫాసిస్టు పాలనకు ఈ ఎన్‌కౌంటర్ పరాకాష్ట అని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) విమర్శించింది. మావోయిస్టు ఎజెండానే తమ ఎజెండా అని చెప్పి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్.. మావోయిస్టులను వేటాడి కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అని టీపీఎఫ్ నేతలు ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విరసం నేత వరవరరావు, టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీం న్యాయమూర్తితో విచారణ జరిపించాలని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీపై సర్కారు మాట ఇచ్చిందని.. ఆచరణ ఎప్పుడని ప్రశ్నిస్తున్నందుకే ఎన్‌కౌంటర్లు జరుగుతునున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఈ రక్తపాతాన్ని ఆపాలంటే రాష్ట్రంలో మావోయిస్టుల ఎజెండాను అమలు చేయాల్సిందేనన్నారు. ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ (ఎన్‌డీ) రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆ ముగ్గురూ లేనట్లే!

▸▸ హరిభూషణ్, సమ్మక్క, ఆజాద్ సేఫ్!!

▸▸ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఏర్పడి నాలుగేళ్లు

▸▸ ఈ నిర్వహణలో ప్లీనరీ నిర్వహణకు ఏర్పాట్లు

▸▸ పెట్రోలింగ్ బృందంపై దాడి చేసిన బలగాలు

▸▸ ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు కాల్పులు

భూపాలపల్లి, ఇల్లెందు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ నుంచి కేంద్ర కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్, ఆయన సహచరి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సమ్మక్క, కొత్తగూడెం, చర్ల ఏజెన్సీ కార్యదర్శి సాంబయ్య అలియాస్ గోపన్న అలియాస్ ఆజాద్ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలినా.. అగ్ర నేతలెవరూ లేకపోవడం వారికి ఊరటగా భావిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఏర్పడి నాలుగేళ్లు అవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్లీనరీ నిర్వహించాలని అగ్ర నేతలు భావించారు. ఇందుకు పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో సమావేశం కావాలని భావించారు. ఇందుకు హరిభూషణ్, సమ్మక్క కూడా అక్కడికి వెళ్లినట్లు చెబుతున్నారు. అయితే, రాష్ట్ర కమిటీ కార్యదర్శికి పెట్రోలింగ్ పార్టీ ఉంటుంది. కార్యదర్శి ముందుకు వెళుతున్న దిశ తప్పించి మిగిలిన మూడు దిశల్లోనూ ఈ పార్టీ పహరా కాస్తుంది. కాంకేర్ అడవుల్లో మావోయిస్టులను గుర్తించిన సంయుక్త బలగాలు తొలుత ఈ పెట్రోలింగ్ పార్టీపైనే దాడి చేసినట్లు తెలుస్తోంది. దీనినే మావోయిస్టుల ప్రధాన బృందంగా పొరబడినట్లు సమాచారం. రెండోసారి జరిగిన కాల్పుల్లో భారీఎత్తున కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా పెట్రోలింగ్ పార్టీలో ఉన్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కంకణాల రాజిరెడ్డితోపాటు మిలీషియా సభ్యులు మరణించినట్లు చెబుతున్నారు. కాల్పులు జరుగుతున్న సమయంలో వెనక్కి తగ్గుతూ హరిభూషణ్, సమ్మక్క, ఆజాద్ తదితరులు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. అగ్ర నేతలకు రక్షణగా వచ్చిన మిలిటెంట్లు, జిల్లా కమిటీ సభ్యులు మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఒకటే ఏకే 47 లభించిందని పోలీసులు ధ్రువీకరించడం, బడే చొక్కారావు మరణించినట్లు పోలీసు వర్గాలు అనధికారికంగా స్పష్టం చేస్తుండడంతో హరిభూషణ్ తదితరులు తప్పించుకున్నట్లు భావిస్తున్నారు.



ఎన్‌కౌంటర్ జరిగినట్లు భావిస్తున్న గుట్ట ఇదే...

పక్కా సమాచారమా..?

ఎన్‌కౌంటర్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టుల సమాచారం పోలీసులకు ఎలా వెళ్లిందనేది ప్రశ్నార్థకంగా మారింది. కోవర్టుల ద్వారా సమాచారం చేరిందా.. లేక ఆధునిక టెక్నాలజీ ఉపయోగపడిందా.. అనేది చర్చనీయాంశంగా మారింది. మూడు రోజులుగా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు మైదాన ప్రాంతాలకు వెళ్లే అంశంపై జరుగుతున్న కీలక సమావేశాలపై సమాచారం పోలీసులకు అంది ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, పోలీసులు డ్రోన్ కెమెరాలతో అడవిని బంధిస్తున్నారు. మూడో కన్నుతో అడవిలో అణువణువూ గాలిస్తున్న నేపథ్యంలో మావోయిస్టుల సమూహం డ్రోన్ కెమెరాకు చిక్కిందా.. అనే చర్చ సాగుతోంది. డ్రోన్ కెమెరా ఉపయోగించలేదని పోలీసులు చెబుతున్నా.. కాంకేర్ వంటి దట్టమైన అటవీ ప్రాంతానికి చేరుకుని దాడులు చేయడం ఎలా సాధ్యమైందనే చర్చ సాగుతోంది.

తెలంగాణలో అతి పెద్ద ఎన్‌కౌంటర్

ఇల్లెందు/చర్ల/భద్రాచలం: ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద ఎన్‌కౌంటర్. ఈ ఘటనలో పది మంది మావోయిస్టులు మృత్యువాతపడ్డారు. గత ఏడాది డిసెంబరులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మేడమడుగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మరణించారు. వీరంతా జనశక్తి అనుబంధంగా ఏర్పడిన సీపీఐ (ఎంఎల్) సీపీబాట దళానికి చెందిన వారు. సీపీబాట జిల్లా కార్యదర్శి, దళ కమాండర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఐదేళ్లలో సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరగడం ఇది మూడోసారి. 2013 ఏప్రిల్ 15న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని పువర్తిలో ఎన్‌కౌంటర్ జరిగింది. నాడు ఖమ్మం, కరీంనగర్, వరంగల్ (కేకేడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి సుధాకర్, ఆయన భార్య పుష్పక్కతో పాటు తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు. దానిని యునిఫైడ్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌గా పేర్కొంటారు. 2016 మార్చి 1న బీజాపూర్ జిల్లా పామేడు పోలీసు స్టేషన్ పరిధిలోని బొట్టితొంగు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్లకు చెందిన గొట్టిముక్కల రమేష్ అలియాస్ లచ్చన్నతో పాటు ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మళ్లీ రెండేళ్లకు సరిహద్దుల్లోని దండకారణ్యం మరోసారి తుపాకుల మోతతో దద్దరిల్లింది. పది మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ జవాను మృతి చెందారు. ఈ ఏడాది రెండు నెలల్లోనే వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 25 మంది మావోయిస్టులు మరణించారు. గడచిన 14 నెలల్లో చూస్తే... మొత్తం 23 ఘటనల్లో 88 మంది మావోయిస్టులు మృత్యువాతపడ్డారు.

కేంద్ర ఉద్యోగులకు హోలీ కానుక

▸▸ మూడు రెట్ల ఫిట్‌మెంట్‌కు సర్కారు నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 2: కేంద్ర ప్రభుత్వోద్యోగులకు శుభవార్త. ఏడో పే కమిషన్ సిఫారసుల కంటే ఎక్కువ మొత్తంలో కిందిస్థాయి ఉద్యోగులకు ఫిట్‌మెంట్‌ను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూల వేతనంలో 2.57 రెట్లు అధిక ఫిట్‌మెంట్ ఇవ్వాలని పే కమిషన్ సిఫారసు చేయగా.. కేంద్రం 3 రెట్లు ఇవ్వనుంది. వాస్తవానికి 3.6 రెట్లు ఇవ్వాలని ఉద్యోగుల సంఘాలు ముందు నుంచి డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిర్ణయంతో రూ.7 వేల మూల వేతనం ఉన్న ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి రూ. 21వేలు లభిస్తాయి. దీంతో 48 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని అంచనా. ఇప్పటికే ఏడో పే కమిషన్ సిఫారసులు అమలవుతున్న కర్ణాటకలో 30 శాతం, ఒడిసాలో 25 శాతం మేర ఫిట్‌మెంట్ ప్రకటించారు.

నేడే మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

న్యూఢిల్లీ, మార్చి 2: మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడికానున్నాయి. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నానికి పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

సుప్రీం కొలీజియంకు ఎదురుదెబ్బ

▸▸ రెండు సిఫారసులకు కేంద్రం తిరస్కారం

▸▸ జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌కు పదోన్నతి దక్కనట్లే!

న్యూఢిల్లీ, మార్చి 2: అంతర్గత కలహాలతో సతమతమవుతున్న సుప్రీం కోర్టు కొలీజియంకు ఎదురుదెబ్బ తగిలింది. ఇద్దరు న్యాయమూర్తులకు పదోన్నతి కల్పించాలన్న కొలీజియం సిఫారసులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. సీనియారిటీ నిబంధనను ఉల్లంఘించడాన్ని కారణంగా పేర్కొంటూ ఆ సిఫారసులను కేంద్రం తిరస్కరించింది. ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా; పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం జనవరి 10న సిఫారసు చేసింది. ఇది సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో నలుగురు న్యాయమూర్తుల విభేదాలు బయటపడటానికి రెండు రోజుల ముందు! జస్టిస్ కె.ఎం.జోసెఫ్ చాలా జూనియర్ అని సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్‌తో కూడిన కొలీజియంకు ప్రభుత్వం తెలియజేసినట్లు సమాచారం. 24 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల జాబితాలో ఆయన 12వ స్థానంలో ఉన్నారని పేర్కొన్నట్లు తెలిసింది. 2016 ఏప్రిల్‌లో ఎన్‌డీయే ప్రభుత్వం ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించగా, ఆ నిర్ణయాన్ని కొట్టివేసింది కె.ఎం.జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనమే కావడం గమనార్హం. జస్టిస్ సూర్యకాంత్‌కు సంబంధించిన సిఫారసు సైతం తిరస్కారానికి గురైంది. ఆయన కంటే సీనియర్ అయిన జస్టిస్ ఏకే మిట్టల్‌ను పక్కన పెట్టడం పక్షపాతంతో కూడినదేనని సిట్టింగ్, రిటైర్డ్ న్యాయమూర్తుల నుంచి విమర్శలు వచ్చాయి.

కశ్మీర్‌లో కల్లోలానికి భారీ కుట్ర

▸▸ ఏకమవుతున్న ఉగ్రవాద సంస్థలు

▸▸ నవీద్ జట్ వీడియో కలకలం



నవీద్ జట్

శ్రీనగర్, మార్చి 2: అగ్రనేతలను కోల్పోయిన లష్కరే తాయిబా తిరిగి పుంజుకొంటోందా? కశ్మీర్ లోయలో తిరిగి కల్లోలం సృష్టించేందుకు ఉగ్రవాద సంస్థలు ఏకమవుతున్నాయా? ఇటీవల పోలీసు కస్టడీ నుంచి పరారైన పాకిస్థానీ ఉగ్రవాది మహమ్మద్ నవీద్ జట్ ఈ గ్రూపులకు నాయకత్వం వహిస్తున్నాడా? ఈ ప్రశ్నలకు భద్రతా బలగాలు, నిఘా వర్గాలు అవుననే సమాధానమిస్తున్నాయి. లష్కరే ఉగ్రవాది నవీద్.. ఇటీవల హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ సమీర్ టైగర్, మరికొందరు సాయుధులను ఆలింగనం చేసుకుంటున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 'గత ఏడాది భద్రతా బలగాలు లష్కరే కీలక నేతలను తుదముట్టించాయి. ఈ నేపథ్యంలో.. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలన్నీ ఏకం అవుతున్నాయని తాజా వీడియో ద్వారా తెలుస్తోంది' అని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. గత నెల ఆరో తేదీన శ్రీనగర్ కేంద్ర కారాగారం నుంచి నవీద్‌ను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకురాగా.. ఎస్కార్టు పోలీసులను హతమార్చి, పరారైన విషయం తెలిసిందే. 'ఈ పరారీ వెనక భారీ కుట్ర ఉంది. నాలుగు నెలల పాటు కుట్రకు పన్నాగం పన్నారు' అని మరో పోలీసు అధికారి వివరించారు. ఇతను ఏడుగురు పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్ల హత్యకేసుల్లో ప్రధాన నిందితుడు. ఉగ్రవాద సంస్థలు ఏకమై కుట్రలు పన్నుతున్న నేపథ్యంలో.. దక్షిణ కాశ్మీర్‌లో పోలీసులు అప్రమత్తమయ్యారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. నవీద్ పరారీకి సహకరించిన ఐదుగురు లష్కరే తాయిబా ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ఒక పక్కా ప్రణాళికతో నవీద్ పరారయ్యాడని గుర్తించారు. 'పోలీసులపై కాల్పులు జరిపి.. ఆసుపత్రి బయట ఉన్న ఓ తెల్లరంగు కారులో నవీద్ పరారయ్యాడు' అని పోలీసులు వివరించారు.

అమ్మ కోసం ఉగ్రవాదాన్ని వీడి..!

▸▸ లొంగిపోయిన కశ్మీర్ యువకుడు

జమ్ము/శ్రీనగర్, మార్చి 2: పరిస్థితుల ప్రభావమో, చెడు సావాసాల ప్రభావమో.. ఆ యువకుడు ఉగ్రవాదం వైపు ఆకర్షితుడయ్యాడు. కన్నబిడ్డ ఉగ్రవాదిగా మారిపోవడంతో అతడి తల్లి తల్లడిల్లిపోయింది. 'బిడ్డా.. తిరిగిరా! కలిసి కలో గంజో తాగుదాం. చెడు సోపతులు నీకొద్దు నాయనా..' అని ఆ అమ్మ వేడుకోవడంతో చలించిపోయిన యువకుడు ఉగ్రవాదాన్ని విడిచిపెట్టాడు. జమ్ముకశ్మీర్‌లో ఎందరో చిన్నతనంలోనే ఉగ్రవాదానికి ఆకర్షితులై సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో ఓ మారుమూల ప్రాంతానికి చెందిన యువకుడు కొన్నాళ్ల క్రితం ఉగ్రవాదుల్లో చేరిపోయాడు. కొడుకును తన చెంతకు చేర్చాలని ఇటీవల అతడి తల్లి మీడియా ముందుకొచ్చింది. తల్లి ఆవేదనను అర్థం చేసుకున్న ఆ యువకుడు శుక్రవారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అమ్మ కోసం తాను ఉగ్రకార్యకలాపాలు శాశ్వతంగా విడిచిపెడుతున్నట్లు ప్రమాణం చేశాడు. భద్రత కారణాల దృష్ట్యా అతడి వివరాలను వెల్లడించడం లేదని డీజీపీ ఎస్పీ వేద్ తెలిపారు. ఉగ్రవాదాన్ని వీడేందుకు ఎందరో ముందుకు రావడం శుభపరిణామమన్నారు.

మీ వైవాహిక జీవితాన్ని సుఖమయం చేసుకోండి

వాడటం ప్రారంభించినప్పటి నుండి ప్రభావం చూపుతుంది. అంగం 8-9 ఇంచులు పొడవు పెరుగుతుంది. లావుగా, దృఢంగా అవుతుంది. లైంగిక సామర్థ్య సమయం 30 నుంచి 45 నిముషాల వరకు పెరుగుతుంది. సెక్స్ సమస్యలను పూర్తిగా తొలగిస్తుంది.
డ్రగ్ క్యాప్సూల్‌తో ఉత్తేజపరుచు శక్తి 30 రోజులు ఉంటుంది. కామసూత్రతో పాటు ఆప్‌సీస్ లింగ అభివృద్ధి ఎక్విప్‌మెంట్,రొమాంటిక్ సెక్స్ గైడ్ ఉచితంగా ఇవ్వబడును.
9958745170
9643504091

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.